

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 89 పేజీలు: 12 వెల: 6.50


డిసెంబర్‌లోగా అన్ని సేవలు ఆన్‌లైన్ 3లో

హర్ముజ్ దీర్ఘకాలం దిగ్బంధనం: ట్రంప్ 9లో

# మళ్లీ మళ్లీ మనం గెలవాలి



బుధవారం టిడిపి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార దృశ్యం

## గత 44యేళ్లలో ఎన్నో సంక్షోభాలు ఎదుర్కొన్నాం

## కార్యకర్తే అధినేత అన్నది టిడిపి సిద్ధాంతం

### స్థానిక ఎన్నికల్లోను పూర్తి విజయం సాధించాలి

### టిడిపి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీకి అధినేత కార్యకర్తే అనేది నినాదం కాదని, సిద్ధాంతమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు,సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించాలని ఏపీ చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమికి ఓటేశారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలి. అప్పుడే మనం బాగా పనిచేసినట్టు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు, మళ్లీ మళ్లీ గెలవాలి. పనిచేసిన వారికే పదవులు వస్తాయి పని చేసిన వారికే పదవులిస్తామని తెలిపారు. టిక్కెట్ ఇచ్చిన వారి వెంటే కార్యకర్తలు ఉంటారనే విషయం ప్రతీ లీడరూ గుర్తు పెట్టుకోవాలి, ఇదే టీడీపీ స్పెషాల్టీ అని తెలుగుదేశం అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ పర్మిషన్లతో పదవులు ఇవ్వమని, నేతలు, కార్యకర్తలు అతిగా ప్రవరిస్తే ప్రజలు హర్షించరని చెప్పారు. గతంలో పాలకుల గర్వాన్ని, అహంకారాన్ని చూశామని, అయితే ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. బూతులు, వివాదాలు, దాడులు, గొడవలు, సెటిల్‌మెంట్‌లకు దూరంగా ఉందామని సీఎం వ్యాఖ్యానించారు. మనకు ప్రజలు సహక రించారు, నమ్మకం పెట్టుకున్నారు. అలానే ప్రజలు మనల్ని గమనిస్తుంటారని సీఎం నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎవరైనా అధికారం ఉందని ఇగోలకు పోతే భవిష్యత్తులో నష్టం జరుగుతుందని తెలిపారు. చిన్నపాటి కలహాలు కూడా రాకూడదని, ఫ్లెక్సీలు, ఫొటోల దగ్గర, కుర్చీల దగ్గర గొడవలొద్దని హితవు పలికారు. సత్ప్రవర్తనను నేతలు తమ కింద వాళ్లకు కూడా నేర్పిం చాలని సూచించారు. అనునిత్యం పని చేయడంతోపాటు పార్టీ క్రమశిక్షణను కూడా కాపాడాలని నేతలకు సూచించారు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దని, మళ్లీ మళ్లీ ఎన్నిక కావాలని సీఎం ఆకాంక్షించారు. >>2

## టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ బాధ్యతలు

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "శభాష్ లోకేశ్" అంటూ ఆయన పనితీరును కొనియాడారు. కేవలం పర్మిషన్లతో కాదని, పనితోనే పదవులు వస్తాయని నిరూపించారని ప్రశంసించారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభ అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌తో సహా పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాటాడుతూ లోకేశ్ ప్రతిభ, పట్టుదలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. >>2




# బెంగాల్‌లో ఎన్డీయే!

## కేరళలో మళ్లీ ఎల్డీఎఫ్, తమిళనాట అదే డిఎంకె!

## అసోంలో మళ్లీ బిజెపికే పట్టం, ఎగ్జిట్‌పోల్స్ వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** బెంగాల్‌లో రెండో విడత పోలింగ్ ముగిసిన వెంటనే దేశంలో ఐదు రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో వివిధ పార్టీల బలాబలాలపై ముందస్తు అంచనాలు వెల్లడి అయ్యాయి. వివిధ సంస్థలునిర్వహించిన ఎగ్జిట్‌పోల్స్‌లో బిజెపి ఎన్డీయే మిత్రపక్షాలు కొన్నిచోట్ల ఆధిక్యంలో ఉంటాయని చెపితే తమిళనాడులో డిఎంకె, కేరళంలో యుడిఎఫ్‌లు సర్కారు ఏర్పాటుచేస్తాయన్న అంచనాలు వెల్లడించాయి.

రెండోవిడతగా పశ్చిమబెంగాల్‌లోజరిగిన పోలింగ్‌లో కూడా తీవ్ర ఉద్రిక్త భరితంగా కొనసాగింది. 90శాతం పోలింగ్ జరిగిందన్న అంచనాలతో ఎన్డీయే కూటమి తాము అధి కారం చేపట్టడం ఖాయం అన్న దిశగా ఉంది. అలాగే అస్సాంలో హిమంతబిశ్వశర్మ నేతృత్వంలోని బిజెపి మళ్లీ సర్కారు ఏర్పాటుఖాయం అన్న రీతిలో ఉంది. వివిధ సంస్థలునిర్వహించిన ఎగ్జిట్‌పోల్స్ ఈ విధంగా ఉన్నాయి. >>2



# ఇక మంచివాడిగా ఉండబోను.. 2లో

ట్రంప్ సోషల్ మీడియా 'ట్రూత్'లో పోస్టు



# హర హర మహదేవ్ 2లో

దేశ ప్రజల ఆనందం కోసం విశ్వనాథుని ప్రార్థించా..

కాశీలో ప్రధాని మోడీ ప్రత్యేక పూజలు

### హైకోర్టు ఎజిపిల గౌరవవేతనం

# 25% పెంపు

జిల్లా కోర్టుల్లో జిపి, ఎజిపిలకూ పెంచే యోచన: మంత్రి ఫరూక్



**విజయవాడ,ఏప్రిల్ 29.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్టు)లో పనిచేస్తున్న ఏజీపీల (అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్లు) గౌరవ వేతనాన్ని 25 శాతం పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర >>2

# నేడు టెన్త్ ఫలితాలు


**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈ నెల 30 గురువారం విడుదల చేయనున్నారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఈ ఫలితాలు విడుదల చేస్తారు. ఫలితాల విడుదలకు సంబంధించిన ప్రాసెస్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం ఇప్పటికే పూర్తి చేసింది. ఈ ఏడాది సుమారు 6.30 లక్షల మంది పబ్లిక్ పరీక్షలు రాశారు. ఫలితాలను సంబంధిత వెబ్‌సైట్, మన మిత్ర వాట్సప్ నంబరు 9552300009 ద్వారానూ పొందొచ్చు.

### జగన్ మాజీ సిపిఆర్‌ఒ



# పూడి శ్రీహరి అరెస్ట్

**కుప్పం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ సిపిఆర్వో, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (మీడియా) పూడి శ్రీహరిని కుప్పం పోలీసులు మరో సారి అదుపులో తీసుకున్నారు. బెంగళూ రులో శ్రీహరి ఉన్నారనే సమాచారం తెలు సుకున్న పోలీసులు బుధవారం ఉదయం అతన్ని బెంగళూరునుంచి కుప్పం పిఎస్‌కు తీసుకువచా ్చరు. సిఎం చంద్రబాబు నాయుడుపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు >>2



# ఇటు ఎండ.. అటు వాన

## రాష్ట్రంలో విభిన్న వాతావరణం

## మండు టెండల మధ్య పిడుగుపాట్లు

### నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 44.1$^{0}$ ఉష్ణోగ్రత

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మరో 48గంటలపాటు ఇదే విధంగా ఉండే అవకాశం ఉందని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన అకాల వర్షాల కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైనట్లు ప్రఖర్ జైన్ తెలిపారు. మొత్తం 28 జిల్లాలకు గాను 16 జిల్లాల పరిధిలోని 88 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండి 41 డిగ్రీలకు పైగా నమోదైనట్లు వెల్లడించారు. జిల్లాల వారిగా గమనించినప్పుడు నెల్లూరు కొమ్మిపాడులో 44.1 డిగ్రీలు అనకాపల్లి దేవరపల్లిలో 43.4 డిగ్రీలు పల్నాడు బెల్లంకొండలో 43.3 డిగ్రీలు, మార్కాపురం నందనమారెళ్ళలో 43.2 డిగ్రీలు. చిత్తూరు గంగవరం 42.8 డిగ్రీలు,, కర్నూలు నగరడోనలో 42.7 డి, తిరుపతి(జి) దొరవారిసత్రంలో 42.5 డి, ఎన్టీఆర్(జి) తొర్రగుడిపాడు 42.4డి, మన్యం(జి) మక్కువ, పోలవరం(జి) విఆర్ పురంలో 42.2 డి, నంద్యాల(జి) చాగలమర్రి, ప్రకాశం(జి) కొప్పెరపాడు, వైఎస్సార్ కడప(జి) లింగాలలో 42.1 డి, అనంతపురం(జి) రాయదుర్గంలో 42 డిగ్రీలు చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. మరోవైపు ద్రోణి ప్రభావంతో రేపు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు.

గురువారం అధిక ఉష్ణోగ్రతలతో పాటు విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, బొండపల్లి, రామభద్రాపురం మండలాలు, పార్వతీపురంమన్యం జిల్లా గరుగుబిల్లి, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతానగరంమండలాలు, అల్లూరి జిల్లా అనంతగిరి మం డలాల్లో(10) తీవ్రవడగాల్పులు, మరో 20 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు.

## విపక్షాల వికృతరూపం బట్టబయలు: ప్రధాని మోడీ 9లో




# అందుబాటులో పెట్రోలు

## తగ్గుముఖం పట్టిన ఇంధన సమస్య

## బంకుల వద్ద తిరిగి సాధారణ పరిస్థితి

**విజయవాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ సరఫరా మెరుగు పడుతుంది. దాదాపు వారం రోజులుగా ఏర్పడిన ఇంధన కొరత సమస్య క్రమంగా తగ్గుముఖం పట్టి, బంకుల వద్ద రద్దీ కూడా సాధారణ స్థితికి వస్తోంది. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆయిల్ కంపెనీలు నిరంతరం పని చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో ఆ దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,345 బంకుల్లో 47 మినహా అన్నింటా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయి. కంపెనీల నుంచి బంకులకు 3,714 కిలోలీటర్లు (ఒక కిలోలీటర్ అంటే 1,000 లీటర్లు) పెట్రోల్, 7,107 కిలోలీటర్ల డీజిల్‌ను పంపారు. బంకుల ద్వారా ఈ బుధవారం వాహనదారులకు 1,168 కిలోలీటర్ల పెట్రోల్, 2,086 కిలోలీటర్ల డీజిల్ పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి, కడప, తిరుపతి జిల్లాల్లో మాత్రమే 10కి పైగా బంకుల్లో నోస్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. కర్నూలులో పెట్రోల్, డీజిల్ పరిస్థితులు పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి చేరుకు న్నాయి. గత కొన్ని రోజుల నుంచి డీజిల్, పెట్రోల్ కొరతతో ఇబ్బందులు పడిన >>2

### అర్థరాత్రి ముంచిన మూఢనమ్మకం

# చేతబడి నెపంతో దంపతుల దారుణ హత్య

## అనాథలైన ముగ్గురు పిల్లలు

**కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా), ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచం అంగారక గ్రహం వైపు అడుగులు వేస్తున్నా, మారుమూల పల్లెల్లో అజ్ఞానం ఇంకా చీకటి రాజ్యమేలుతోంది. శ్రీకాకుళంజిల్లా కొత్తూరు మండలం చిన్న రాజాపురం గ్రామంలో తాజాగా చోటు చేసుకున్న ఘోరకలి నాగరికసమాజం తలదించుకునేలా చేసింది. తన కుటుంబానికి కలుగుతున్న అనారోగ్యాలు, కష్టాలకు చేతబడే కారణమని బలంగా నమ్మిన ఒక వ్యక్తి, అనుమానంతో ఇద్దరు అమాయక దంపతులను అత్యంత కిరాతకంగా బలి తీసుకున్నాడు. ఈ అమానవీయ ఘటనతో ఒక కుటుంబం పూర్తిగా ఛిన్నాభిన్నమైంది. మంగళ



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వారం అర్థరాత్రి వేళ చిన్న రాజాపురం గ్రామానికి చెందిన ఇల్లంగో, ఆయన భార్య జ్యోతి తమ నివాసంలో గాఢనిద్రలో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన తోటయ్య అనే >>2



## బెంగాల్‌లో రెండో

# విడత ఉద్రిక్తం

## 92.47 శాతం పోలింగ్

**కోల్‌కత్తా, ఏప్రిల్ 29:** బెంగాల్‌లో హోరాహోరీగాజరిగిన రెండో విడత పోలింగ్‌లో భారీ ఓటింగ్‌నమోదయింది. మొత్తం ఏడు జిల్లాలోపరిధిలో 142 నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో ఉద్రిక్తతలు చెలరేగాయి. విపక్షనేత సువేందు అధికారి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీలమధ్య ఆరోపణలు ప్రత్యారోపణలతో మాటల తూటాలు పేలాయి. కొన్ని చోట్ల సిఆర్‌పిఎఫ్ ఇతర కేంద్ర బలగాలు అల్లరిమూకలను తరిమికొట్టడం కనిపించింది. బెంగాల్‌లో రెండో విడత పోలింగ్ స్వాతంత్ర్యం వచ్చినతర్వాత తొలిసారిగా అత్యధికంగా 92.47శాతం నమోదయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. రెండో విడతపోలింగ్‌ముగిసిన తర్వాత ఇపుడు సువేందు అధికారి, మమతా బెనర్జీల పోటీపైనే అందరూ ఫోకస్‌పెం చారు. బుధవారం పోలింగ్ రాత్రి 7.45 >>2



# హర హర మహదేవ్

## దేశ ప్రజల ఆనందం కోసం విశ్వనాథుని ప్రార్థించా..

## కాశీలో ప్రధాని మోడీ ప్రత్యేక పూజలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:**వారణాసిలో బుధవారం ప్రధానమంత్రి సందడి చేశారు. ఉదయంలో కాశీ విశ్వనాథ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపలకు వస్తూ ప్రజలకు అభివాదం చేశారు. ఇందుకు సంబంధించి ప్రధాని మోడీ 'ఎక్స్'లో ఫొటోలు, వీడియోలు షేర్ చేశారు. వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయంలో పూజలు నిర్వహించి, దేశంలోని పౌరులందరికీ ఆనందం, సుసంపన్నత, ఆరోగ్యకరమైన జీవితం లభించాలని భోలేనాథుడిని ప్రార్థించినట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలిపారు. "హర హర మహదేవ్! కాశీలోని బాబా విశ్వనాథ ఆలయంలో దర్శనం చేసుకుని,పూజలు నిర్వహించే అదృష్టం నాకు లభించింది. ఇక్కడ, దేశంలోని పౌరులందరికీ ఆనందం,సుసంపన్నత, ఆరోగ్యకరమైన జీవితం ప్రసాదించాలని భోలేనాథుడిని ప్రార్థిం చాను.అమ్మ అన్నపూర్ణ, అమ్మగంగాదేవి దర్శనం నాకుఅపారమైన మనశ్శాంతిని కలిగించింది. వారి కృపఅందరి లోనూ సాను కూల శక్తిని నింపాలని ఆశిస్తున్నాను!కాశీ ప్రజలకు మరోసారి నావందనాలు అంటూ ఎక్స్‌లో ప్రధాని రాసుకొచ్చారు.

# ఇక మంచివాడిగా ఉండబోను..

## ట్రంప్ సోషల్ మీడియా 'ట్రూత్'లో పోస్టు

**వాషింగ్టన్, ఏప్రిల్ 29:** ఇరాన్‌తో చర్చలు ప్రతిష్టంభనపరంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లో అసహనం పెరిగిపో తోంది. చర్చలపరంగా ముందుకురాకపోతే ఇక నుంచి తాను మంచివాడిగా ఉండనని ప్రకటించారు. అంతేకాకుండా రైఫిల్ పట్టుకున్నట్లు ఉన్న ఫొటోను ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఆ దేశానికి ఆయన మరోసారి హెచ్చరిక జారీ చేశారు. చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపో తోందని విమర్శించారు. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని అన్నారు. ఈ విషయంలో వారు తెలివిగా వ్యవ హరిస్తే బాగుంటుందని అన్నారు. ఇక మీదట తాను అంత మంచి వాడిగా ఉండనని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెర గడం, అమెరికాఇరాన్ మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంబన నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు విఫలం కావడం, హార్ముజ్ జలసంధిలో నౌకలన్నిటినీ అమెరికా దిగ్బంధం చేయడం, విదేశీ నౌకలపైనా చర్యలకు ఉపక్రమించడం వంటి చర్యలతో ఇరాన్ హర్ముజ్‌ను మూసివేసినటు ్లప్రకటించింది. తాజాగా హర్ముజ్‌ను తెరుస్తామని, చర్చలపరంగా తాము సిద్ధమేనని అయితే యుద్ధం వెంటనే విరమించి బలగాలను తరలించాలని, నౌకాశ్రయాల్లో అమెరికా బలగాలు తప్పించాలంటూ మూడు షరతులు పెట్టింది.అణు తయారీపై చర్చలను వాయిదా వేయాలని కూడాచెప్పడంతో అమెరికాకు సుతరామూ ఇష్టంలేదు. స్పష్టమైన అజెండాతో వచ్చేంతవరకూ కాల్పుల విరమణ కొనసాగుతుందని ప్రకటించినట్రంప్ ఈలోపు ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధంచేస్తున్నారు. దీనితోఇరాన్ చర్చలకు సుతరామూ ఇష్టపడటం లేదు. అయితే తాజాగా హర్ముజ్‌ను ప్రారంభిస్తామని,యుద్ధవిరమణ పాటించాలంటూ ఇరాన్‌నుంచి కొత్త అజెండా ఎదురయినా ట్రంప్ మాత్రం తన అజెండాపైనే కొనసాగుతున్నారు. అందుకు అనుగుణంగానే బుధవారం ట్రూత్ లో గన్‌తో ఉన్న ఫోటోను పోస్టుచేసి ఇకపై తాను మంచివాడిగా ఉండబోనని స్పష్టంచేయడం గల్ఫ్‌లో మరింత ఉద్రిక్తతలకు తావిస్తోంది.

# మళ్లీ మళ్లీ మనం గెలవాలి

>> వర్కింగ్ ప్రెసిడెంట్ అనేది అత్యున్నత బాధ్యత: లోకేశ్ సమర్థతను గుర్తించే వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించామని చంద్రబాబు తెలిపారు. కార్యకర్తే అధినేత అనేది నినాదాన్ని విధానంగా మార్చుకున్నామని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో లోకేశ్ చాలా కీలక పాత్ర పోషించారని, ట్రైనింగ్ క్లాసులు మొదలుకుని కార్యకర్తల సంక్షేమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ అనేది పదవి కాదని అత్యున్నత బాధ్యత అని చంద్రబాబు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ లో మనం బలం పెరగాలని, 2024లో వచ్చిన ఓట్లకంటే ఎక్కువ ఓట్లు రావాలని తెలిపారు. సీనియారిటీ, సిన్సియారిటీ, సోషల్ ఇంజినీరింగ్ తో నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకున్నామన్నారు. కేంద్రమంత్రి అయిన రామ్మోహన్ నాయుడు కార్యకర్త స్థానంలో కింద కూర్చుంటే, కార్యకర్త స్థాయి నుంచి పొలిట్ బ్యూరోకి వచ్చిన వారు వేదికపై కూర్చోవటం పార్టీ ఘనతగా చంద్రబాబు అభివర్ణించారు. కార్యకర్తలు పడ్డ కష్టాలు గుర్తున్నాయి: సీనియర్లను గౌరవిస్తూ, కొత్తవారికి అవకాశాలు ఇస్తూ కష్టపడిన వారికి కమిటీల్లో చోటిచ్చామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 4 దశాబ్దాల నుంచి కమిటీలపై కసరత్తు చేశానని కానీ ఇంత కసరత్తు ఎప్పుడూ చేయలేదని తెలిపారు. తెలుగుదేశం కార్యకర్తలు ఎప్పుడూ మీసం మేలేస్తారని, ఎవ్వరికీ తలవంచరని అన్నారు. మహిళలకు ఎక్కువగా అవకాశాలిచ్చామని అలానే చదువుకున్న వారికి మంత్రి పదవులిచ్చి ప్రొత్సహించామని తెలిపారు. రామ్మోహన్నాయుడు, శబరి, రాజేష్ వంటి వారిని జాతీయ ఉపాధ్యక్షులుగా చేసుకున్నామన్నారు.

2024కు ముందున్న పరిస్థితులన్నీ అందరికీ తెలుసన్న చంద్రబాబు ప్రతి ఘటనా ప్రతి ఒక్కరి పోరాటం తనకు గుర్తుందని అలానే కార్యకర్తలు పడ్డ కష్టాలు తనకు గుర్తున్నాయని చంద్రబాబు అన్నారు.

**నేను పవన్ చక్కగా ఉంటున్నాం:** ఈ మధ్య కొన్ని సంఘటనలు జరిగాయని వాటి గురించి తాను చాలా బాధపడ్డానని చంద్రబాబు అన్నారు. నేతలు, కార్యకర్తలు తప్పు చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. తానుపవన్ కల్యాణ్ చక్కగా ఉంటున్నామని మంచి రిలేషన్ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇదే క్షేత్ర స్థాయిలో ఉన్న కార్యకర్తలు కూడా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంకేంద్రానికి గ్యాప్ లేదు, రాకూడదని స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా గ్రామ స్థాయి కార్యకర్తలు దీన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యకర్తల నుంచి అధ్యక్షుడి వరకు క్రమశిక్షణతో పని చేయడం పార్టీ మూల సిద్దాంతమన్నారు. ప్రజలతో సౌమ్యంగా ఉంటూ అందుబాటులో ఉండాలని నేతలకు సూచించారు.

**ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు:** ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ వ్యవస్థలను గాడిలో పెడుతున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అలానే నీటి భద్రత కోసం ఇరిగేషన్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసి, రైతులకు నీరందిస్తున్నామన్నారు. విధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను పునరుద్దరించామని ప్రజలపై ట్రూ అప్ ఛార్జీ భారం పడకుండా భరిస్తున్నామన్నారు. కరెంట్ ఛార్జీల పెంచబోమని ఇప్పటికే ప్రకటించామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ధరలు తగ్గించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గతేడాది 30 పైసలు తగ్గించాం, మరో 30 పైసలు తగ్గించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. కనెక్టివిటీ పెరిగేలా పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు పూర్తి చేసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# బెంగాల్‌లో ఎన్డీయే!

| >> పశ్చిమబెంగాల్: | బిజెపి | టిఎంసి | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| మ్యాట్రిజ్ | 146-161 | 125-140 | | 6-10 |
| పిమార్క్ | 150-175 | 118-138 | | 2-6 |
| జెవిసి | 138-159 | 131-152 | | 0-2 |
| **అసోం** | **బిజెపి** | **కాంగ్రెస్** | **ఎంఎస్ఎం** | **ఇతరులు** |
| యాక్సిస్ మై ఇండియా | 88-100 | 24-36 | | 0-3 |
| జెవిసి ఎగ్జిట్‌పోల్ | 88-101 | 23-33 | -- | 2-5 |
| మ్యాట్రిజ్ | 85-95 | 25-32 | -- | 6-12 |
| **కేరళ** | **ఎల్‌డిఎఫ్** | **యుడిఎఫ్** | **బిజెపి** | **ఇతరులు** |
| యాక్సిస్‌మై ఇండియా | 49-62 | 78-90 | 0-3 | -- |
| పీపుల్స్ పల్స్ | 55-65 | 75-85 | 0-3 | |
| పీమార్క్ | 62-69 | 72-79 | 0-3 | |
| మ్యాట్రిజ్ | 60-65 | 70-75 | 3-5 | |
| **తమిళనాడు** | **డిఎంకె** | **ఎఐడిఎంకె** | **టివికె** | **ఇతరులు** |
| పిమార్క్ | 125-145 | 65-85 | 16-26 | 1-6 |
| మ్యాట్రిజ్ | 122-132 | 87-110 | 10-12 | 0-6 |
| పీపుల్స్ పల్స్ | 125-145 | 65-80 | 18-24 | 2-6 |
| **పుదుచ్చేరి** | **ఎన్నార్సీబిజెపి** | **కాంగ్రెస్** | **డిఎంకె** | **టివికె ఇతరులు** |
| చాణక్య స్ట్రాటజీస్ | 17-20 | 9-13 | 0-1 | 00 |
| యాక్సిస్ మై ఇండియా | 16-20 | 6-8 | 00 | 3-7 |
| జెవిసి | 15-17 | 11-13 | 1-2 | 00 |

# బెంగాల్‌లో రెండో విడత ఉద్రిక్తం

>> గంటలకు 91.66శాతం నమోదుకాగా చివరికి 92.47శాతం జరిగిందని ప్రకటించారు. మొదటి విడత పోలింగ్‌లో 93.19శాతం నమోదయినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు. 93.24శాతం ఓటింగ్ జరిగింది. పురుషులు 91.74 శాతం నమోదయినట్లు తేలింది. 2011 నుంచి భవానిపూర్‌సీటు టిఎంసికి పట్టుగా ఉంది. ఇపుడు సువేందు అధికారి కూడా ఇక్కడపోటీచేస్తుండటంతో అందరి దృష్టి ఈ స్థానంపైనే పడింది. గత ఎన్నికల్లో ఈ 42 స్థానాల్లో 123 సీట్లు టిఎంసి, బిజెపి 18, వామపక్షాలు ఒకస్థానం గెలుచుకున్నాయి. రెండో విడతలో అధికంగా గ్రామీణప్రాంతంలోనే జరిగాయి. పూర్బ బర్ధమాన్‌లో 93.39శాతం, హుగ్లీలో 91.41శాతం, దక్షిణ24 పరగణాల్లో 91.45శాతం, ఉత్తర 24 పరగణాల్లో 91.39శాతం, నదియాలో 91.35శాతం పోలింగ్ జరిగినట్లు తేలింది. బెంగాల్ షిఇఒ మనోజ్ అగర్వాల్‌మాట్లాడుతూ ఈవిఎంలు ట్యాంపరింగ్ జరిగాయన్న ఆరోపణలున్నచోట్ల రీపోలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. మొత్తం 3.21 కోట్లమంది ఓటర్లు రెండో విడత పోలింగ్‌లోపాల్గొననట్లు తేలింది. రెండోవిడత ముగిసిన తర్వాత మొత్తం 2926మందిప ఓటీచేస్తున్న అభ్యర్థుల జాతకాలున్న ఈవీఎంలకు సీళ్లుపడ్డాయి. ఓటర్ల ప్రత్యేక రివిజన్‌లో 90 లక్షలమంది ఓటర్లను తొలగించారు. ప్రస్తుతంమొత్తం ఓటర్లు 6.81 కోట్లమంది ఉన్నారు. మే 4వ తేదీ ఓట్లలెక్కింపుజరుగుతుంది. మొత్తం 77 ఈవీఎంలు ట్యాంపరింగ్‌కేసులు నమోదయ్యాయని, మే రెండోతేదీ రీపోలింగ్ ఉంటుందని సిఇఒ మనోజ్‌కుమార్ అగర్వాల్ తెలిపారు.

# తెలంగాణ టెన్త్‌లో 95.15 శాతం ఉత్తీర్ణత

## గత ఏడాది కంటే పెరిగిన పాస్ పర్సంటేజ్


## ములుగు ఫస్ట్.. హైదరాబాద్ లాస్ట్

## జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

## నేటి నుంచి మే 14 వరకు ఫీజు చెల్లించడానికి గడువు

## ఫలితాలను విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రంలో మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించిన 10వ తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. పరీక్షలకు హాజరైన వారిలో 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నారు. ఎస్ఎస్‌సి ఫలితాలను బుధవారం ఎస్‌సీఈఆర్‌టీ క్యాంపస్‌లోని గోదావరి ఆడిటోరియంలో ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ పివి శ్రీహరి పాల్గొన్నారు. ఫలితాలను విడుదల చేసిన అనంతరం కె కేశవరావు మాట్లాడుతూ.. 10వ



బుధవారం తెలంగాణ పది ఫలితాలను విడుదల చేస్తున్న ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు

తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మంచి కోర్సును ఎంచుకొని, లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఎస్ఎస్‌సి ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 94.07 శాతం పాసయ్యారు. పరీక్షలకు 5,28,309 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా వారిలో 5,26,166 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన వారిలో 4,97,312 మంది పాసయ్యారు. ఎగ్జామ్స్ రాసిన వారిలో 95.15 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పాస్ పర్సంటేజ్ పెరిగింది. గత ఏడాది 92.78 శాతం ఉత్తీర్ణత శాతం ఉండగా.. ఈ ఏడాది అదికాస్త 95.15 శాతానికి పెరిగింది. మార్చి నుంచి ఏప్రిల్ వరకు జరిగిన పరీక్షలకు 5,28,309 మంది నమోదు చేసుకోగా వారిలో 5,26,166 మంది హాజరయ్యారు. వారిలో 5,16,815 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 9351 మంది ఒకసారి ఫెయిలైన విద్యార్థులున్నారు. పాసైన వారిలో 4,91,774 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా 5,538 మంది ఒకసారి ఫెయిలైన వారున్నారు.

**ములుగు ఫస్ట్.. హైదరాబాద్ లాస్ట్:** ఎస్ఎస్‌సి ఫలితాల్లో ములుగు జిల్లా 99.30 శాతంతో రాష్ట్రంలోనే అత్యధిక ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. 89.23 శాతంతో హైదరాబాద్ జిల్లా అత్యల్ప ఉత్తీర్ణతతో చివరి స్థానంలో ఉంది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, ప్రభుత్వ పాఠశాలల్లో 86.18 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 93.53 శాతం,మోడల్ స్కూల్స్‌లో 97.83 శాతం, కేజీబీవీ పాఠశాలల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రైవేటు పాఠశాలల్లో 95.81 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆరుప్రైవేటు పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత సాధిం చాయి. ఈ ఏడాది మొత్తం 75,731 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా వాటిల్లో 2,065 జిల్లా పరిషత్ పాఠశాలలు, 65 ప్రభుత్వ పాఠశాలలు,83 మోడల్ స్కూల్స్,290 కేజీబీవీలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మీడియంల వారీగా చూస్తే.. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 95.86 శాతంతో ఉత్తీర్ణత సాధించగా, తెలుగు మీడియంలో 89.14 శాతం మంది, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

**ఎస్ఎస్‌సి ఫలితాల్లో విద్యాశాఖ**

ఈ రెండు కీలక మార్పులు చేసింది. గతంలో మాదిరిగా విద్యార్థులకు గ్రేడ్లు కాకుండా, ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు. విద్యార్థుల సౌలభ్యం కోసం తొలిసారిగా వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. తమ ఫలితాలను పొందాలనుకునే వారు 80969 58096 అనే వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపి ఎస్ఎస్‌సి రిజల్ట్స్ అని మెసేజ్ పంపితే చాలు ఫలితాలు వస్తాయి. వాట్సాప్‌తో పాటు అధికారిక వెబ్‌సైట్లలో కూడా విద్యార్థులు తమ మార్కుల మెమోలను చూసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనుండగా.. నేటి(గురువారం- ఏప్రిల్30) నుంచి మే 14 వరకు ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు.

# లోకేష్ బాధ్యతలు

>> 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేశ్ అత్యంత కీలక పాత్ర పోషించారు. కార్యకర్తలను నిరంతరం చైతన్యవంతం చేశారు. అధికారంలోకి వచ్చాక పార్టీని మరింత ముందుకు నడిపిస్తున్నారు. కార్యకర్తల సంక్షేమం నుంచి శిక్షణా తరగతుల వరకు అన్ని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈరోజు ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయంటే దానికి లోకేశ్ కృషే కారణం. ఆయన సమర్థతను గుర్తించే వర్కింగ్ ప్రెసిడెంట్ అనే అత్యున్నత బాధ్యతను అప్పగించాం. ఇది పదవి కాదు, బాధ్యత" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకు నారా లోకేశ్ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.ఆత్మసాక్షిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు నారా లోకేశ్ పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించారు.ఇక 44 ఏళ్ళ టీడీపీ చరిత్రలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని తాజాగానే ఏర్పాటు చేసారు.పార్టీ వ్యవహారాలు,సీఎం విధుల నిర్వహణ తదితరంశాల్లో కొంత భారం తగ్గించుకునేందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు.పార్టీ నిర్వహణ, రాష్ట్ర సంక్షేమం కార్యనిర్వహణలో ఆర్దిక భారం,పని వత్తిడి తగ్గాల్సి అవసరాన్ని తాము గుర్తించినట్లు సీఎం తన ప్రసంగంలోనే స్పష్టం చేసారు.

# అందుబాటులో పెట్రోలు

>> వాహనదారులు ప్రస్తుతం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెట్రోల్ బంకుల వద్ద సాధారణ స్థితి నెలకొని ఉంది. అధికారులు చేపట్టిన చర్యల భాగంగా సమస్య సద్దుమణిగిందని స్థానికులు తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా.గుంటూరు.పల్నాడు,మార్కాపురం,అనంతరం జిల్లాల్లోని పెట్రోలు బంకుల్లో విరివిగానే డీజిల్ దొరుకుతుందని వినియోగదారుల సమాచారం.నెల్లూరు,చిత్తూరులోకొన్ని బంకుల్లో డీజిల్ లభ్యం కావడం లేదంటున్నారు. ఈ 3 జిల్లాల్లో మూతపడిన బంకులకు స్టాక్ సరఫరా కోసం అధికారులు చర్యలు చేపట్టారు. పెట్రోలు బంకుల వద్ద పరిస్థితులను పోలీసులు,సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ చేస్తున్నారు.

# భార్యభర్తల బలవన్మరణం

## అనాథగా మిగిలిన 13 నెలల పసికందు

**వేటపాలెం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** రామన్నపేట గ్రామం రావూరుపేట పరిధిలోని ఆర్యవైశ్య వీధిలో భార్యాభర్తలు ఆత్మహత్యలు సంచలనంగా మారింది. బుధవారం మధ్యాహ్నం మాజేటి ప్రభాకర్(33), పార్వతి(24) ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలు పార్వతి మధ్యాహ్నం 12.30గంటల సమయంలో పక్క ఇంటి వాళ్లకు తమ పాప మాన్వితను చూడమని అప్పగించినట్లు సమాచారం. మృతుడు ప్రభాకర్ ఎంబీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని



చేస్తున్నారు. ఆత్మహత్యకు పాల్పడటానికి ముందు ప్రభాకర్ అతని సోదరుని మీ సేవ కేంద్రానికి వెళ్లి వచ్చినట్లుగా చెబుతున్నారు. మూడున్నర గంటల సమయంలో సోదరుడు సుధాకర్ ఇంటికి వచ్చి చూడగా ప్రభాకర్ బాత్రూంలో, ప్రభాకర్ భార్య బెడ్ రూమ్‌లో చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి బంధువులకు చెప్పడంతో విషయం బహిర్గతమైంది. సమాచారం తెలుసుకున్న వేటపాలెం పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతులుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదమరిచి నిద్రిస్తున్న 13 నెలల పాప మాన్విత చూసి స్థానికులు కన్నీర్పర్యంతమయ్యారు.

# అనంతబాబు బెయిల్ రద్దు పిటిషన్ వాయిదా

**కాకినాడ,ఏప్రిల్ 29,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ అనంత బాబు కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అనంతబాబు బెయిల్ రద్దు పిటిషన్ వాయిదా పడింది. రెగ్యులర్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ ప్రభుత్వ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు బాధిత కుటుంబం తరపున రాజమండ్రి స్పెషల్ కోర్టులో బలమైన వాదనలు



వినిపించారు. నిందితుడు తరఫున న్యాయవాదులు కూడా తమ వాదనలు వినిపించారు.

ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ కేసును ఫర్దర్ ఆర్డర్స్ కోసం ఆరవ తారీఖుకు వాయిదా వేశారు.ఇక సాక్షులను బెదిరించి వారికి నగదు చెల్లింపు ల కేసులో అరెస్టయిన నిందితుడు తరఫున న్యాయవాదులు రాజమండ్రి జిల్లా కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై ఎల్లుండి వాదనలు వింటామని జిల్లా కోర్టు న్యాయమూర్తి తెలిపారు. అదేవిధంగా, అనంతబాబును పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిందితుడు ఎక్కడ అరెస్టయ్యాడో అక్కడి కోర్టులోనే పోలీస్ కస్టడీ పిటిషన్ వేయాలని న్యాయమూర్తి సూచించారు. ఈ మేరకు ఈ నెల 30వ తేదీన కాకినాడ మొబైల్ కోర్టులో పోలీసులు పోలీస్ కస్టడీ పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# 25% పెంపు

>> న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలి పారు.హైకోర్టు ఏజీపీలకు ప్రస్తుతం ఇస్తున్న వేతనం మొత్తం రూ. 44,000 నుండి రూ.55,000 కు పెంచుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.వీరితోపాటు జిల్లా కోర్టుల్లో పనిచేస్తున్న జీపీలు, ఏజీపీలకు కూడా వేతనాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు పంపవలసిందిగా సిఎం ఆదేశించినట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు.రాష్ట్రంలో 86 మంది దాకా ఏజీపీలు ఉన్నారని, వారి గౌరవ వేతనం పెంపుతో ప్రభుత్వం పై సంవత్సరానికి రూ. 1,13,52,000/ అదనపు భారం పడుతుందని మంత్రి తెలిపారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నా లా ఆఫీసర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పెంపుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. గౌరవ వేతనం పెంపుదలకు కృషి చేసిన న్యాయ శాఖ కార్యదర్శి ప్రతిభా దేవిని అభినందిస్తూ జిల్లా కోర్టుల్లో జీపీలు, ఏజీపీలకు కూడా గౌరవ వేతనం పెంపుదలను వర్తింప చేయడానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు.

# దంపతుల దారుణ హత్య

>>వ్యక్తి కత్తితో వారి ఇంట్లోకి చొరబడ్డాడు. నిద్రపోతున్న వారిపై పగతో విచక్షణారహితంగా దాడి చేయడంతో, తల మరియు మెడ భాగాల్లో తీవ్ర గాయాలై ఆ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నిందితుడు తన కుటుంబ సభ్యుల వరుస అనారోగ్యాలకు ఈ దంపతుల మంత్రతంత్రాలే కారణమని మనసులో పగ పెంచుకుని, పథకం ప్రకారమే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలు స్తోంది. ఈ దారుణ హత్యలతో ఆ దంపతుల పిల్లలు అనాథలయ్యారు. వివాహమైన కుమార్తె సుజాతతో పాటు,ఇంకా లోకం తెలియని 16 ఏళ్ల కిసాయి, 8ఏళ్ల రామరాజు కళ్లముందే తల్లిదండ్రులు రక్తపు మడుగులో విగతజీవులుగా పడి ఉండటం చూసి తల్లడిల్లిపోతున్నారు. ఆ చిన్నారుల రోదనలు గ్రామస్తులను కన్నీటి పర్యంతం చేశాయి. సమాచారం అందుకున్న కొత్తూరు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. హత్య అనంతరం పరారైన నిందితుడు తోటయ్య కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రశాంతంగా ఉండే గ్రామంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ రక్తపాతం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. అక్షరాస్యత కలిగిన ఈ కాలంలో కూడా అజ్ఞానం, మూఢనమ్మకాలు ప్రాణాలను బలి తీసుకోవడం పట్ల జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతోంది. అవగాహన లోపం ఎంతటి అనర్థాలకు దారితీస్తుందో ఈ చిన్న రాజాపురం విషాద ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# పూడి శ్రీహరి అరెస్ట్

>> డైరెక్టర్ వినోద్‌కుమార్ మూర్తి ఫిర్యాదు మేరకు కుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి ఇదివరకే పూడి శ్రీహరిని కుప్పం పోలీసులు అరెస్ట్ చేసి కుప్పం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి శ్రీహరికి ఈనెల16న బెయిల్ మంజూరు చేశారు. తదనంతరం ఇదే కేసు విషయంగా కుప్పం పోలీసులు హైకోర్టులో అప్పీల్ చేయగా హైకోర్టు కుప్పం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నేపథ్యంలో పూడి శ్రీహరి సుప్రీ ంకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా హైకోర్టు ఉత్తరు ్వలపై స్టే ఇచ్చేందుకు సుప్రీ ంకోర్టు నిరాకరించినట్లు తెలిసింది. దీంతో పూడి శ్రీహరిని కుప్పం పోలీసులు మరోమారు అదుపులో తీసుకుని విచారణ చేపట్టారు.

## వారం - వర్జ్యం

**30-04-2026, గురువారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**వైశాఖమాసం, ఉత్తరాయణం**
**వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె**
చతుర్దశి రా.9.14
చిత్త రా.2.17
వర్జ్యం : ఉ.8.57-ఉ.10.41
దు.ఉ.9.57-ఉ.10.48,
2) మ.3.03-3.54
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:**జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. మిత్రులను కలుస్తారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**వృషభం:**ఫలితాన్ని ఆశించకుండా కృషిచేసి మంచి ఫలితాలు సాధిస్తారు. తనఖా వస్తువులు విడిపిస్తారు.వస్త్ర లాభం.

**మిథునం:** రాజకీయ రంగంలోని వారికి అనుకూలంగా వుంది. ఆదాయ మార్గాలు మెరుగుపరుతాయి. బంధువుల కలయిక.

**కర్కాటకం:** చేపట్టిన కార్యక్రమాలలో విజయంసాధిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతులు వుంటాయి.

**కన్య :**విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. నూతన విద్యావకాశాలు కలవు.

**తుల:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందుతారు. టెక్నికల్ రంగంలోని వారికి అనుకూలంగా వుంది. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** శుభకార్యాలు ముడిపడతాయి. ఉపయుక్తమైన చర్యలు చోటు చేసుకుంటాయి. విలువైన వస్తువులు కొనుగోలు.

**ధనుస్సు:** ధర్మమార్గంలో పయనిస్తారనే ఖ్యాతి లభిస్తుంది. సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

**మకరం:**ఇంటిలో పండుగ వాతావరణం నెలకొనివుంటుంది. ఎదురుచూడని అవకాశాలు లభిస్తాయి.

**కుంభం:** సోదరుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**మీనం:** ఫైనాన్స్ రంగంలోని వారు కాస్త జాగ్రత్తగా మెలగడం చెప్పదగినది. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# డిసెంబర్‌లోగా అన్ని సేవలు ఆన్‌లైన్

**శరవేగంగా డ్రోన్‌సిటీ మొదటి దశ పనులు**
**శాటిలైట్ సమాచారం వినియోగించుకునేలా కార్యాచరణ**
**ఆర్టీజీ సమీక్షలో సిఎం చంద్రబాబు**

**విజయవాడ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అన్ని సేవలు ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా ఆన్‌లైన్‌లో అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర పరిధిలోకి అన్ని సేవలు తీసుకు వస్తే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదని చెప్పారు. ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మన మిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రస్తుతం 1,035 సేవలు అందిస్తున్నామని తెలిపారు. వాట్సప్ గవర్నెన్సు సేవలు ప్రారంభించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 54 లక్షల మంది 1.78 కోట్ల సేవలుపొందారని ఈసందర్భంగా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వాట్సప్ గవర్నెన్స్ సేవల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తు న్నామని సీఎంకు తెలిపారు. ఇప్పటి వరకూ 24 లక్షల మందికి పైగా వాట్సప్ గవర్నెన్సు సేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించామని చెప్పారు.

కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ఫేజ్ 1 అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని... ఇప్పటికే ప్లాంట్లు నెలకొల్పేందుకు ముందు కొచ్చిన 8 కంపెనీలకు భూముల కేటాయింపు పూర్తయ్యిందని, మే నెల రెండో



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

వారంలో ఇవన్నీ గ్రౌండ్ అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. డ్రోన్ సిటీ మాస్టర్ ప్లాన్ ఖరారైం దని అధికారులు ఇచ్చిన వివరణ పై స్పందించిన సీఎం... ఈ ఏడాది జూలై నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**సిసి కెమేరాలతో నేర నియంత్రణ చర్యలు...**

దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనంతగా ఆంధ్రప్రదేశ్‌లో సీసీ టీవీ కెమేరాల ఏర్పాటు, వాటి వినియోగం, పర్యవేక్షణ జరుగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడంతో పాటు... మిస్సింగ్ కేసుల ట్రేసింగ్, వాహనాల దొంగతనాల వంటి కేసులు వేగంగా కొలిక్కి వస్తున్నాయని చెప్పారు.

అయితే సీసీ కెమేరాలు లేని ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల డేటాను కూడా ఇంటిగ్రేట్ చేయాలని, ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించా లని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సీసీ కెమేరాలతో పాటు శాటిలైట్ డేటాను విని యోగించు కునేలా కార్యాచరణ చేపట్టాలని అధి కారులకు సీఎం నిర్దేశించారు. శాటిలైట్ సమాచా రాన్ని ఆర్టీజీఎస్‌కు అనుసంధానించి వేగంగా చర్యలు చేపట్టేలా చూడాలన్నారు.

ఇటీవల తిరుమలతిరు పతి సమీపంలో శేషాచల అటవీ ప్రాంతంలో మం టలు వ్యాపించిన ఘటనపై వేగంగా స్పందించే అవకాశం ఉండేదన్నారు. డీజిల్, పెట్రోలు సరఫరా పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తక్షణ చర్యలతో మళ్లీ సాధారణ స్థితికి నెలకొందని... అయితే సమస్య ఉత్పన్నం కాకముందే రియల్ టైమ్‌లో స్పందించేలా చర్యలు ఉండాలని సీఎం సూచించారు.

## పామర్రులో ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

**హనుమాన్‌జంక్షన్(కృష్ణా), ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మే 1వతేదీ కృష్ణాజిల్లా పామర్రు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ బుధవారం ఉదయం పరిశీలించారు. పమిడిముక్కల మండలంలో కపిలేశ్వరపురం గ్రామంలో హెలిప్యాడ్, బారికేడ్లను పరిశీలించారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులకు వేచి ఉండేందుకు హెలిప్యాడ్ సమీపంలో షామియానా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పమిడిముక్కల గ్రామంలో ప్రజావేదిక నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ పనుల్లో వేగం పెరగాలని అప్రోచ్ రహదారిని నిర్మించాలని ఆదేశించారు. భవననిర్మాణ కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖీ కార్యక్రమం ఉన్నందున ఇందులో పాల్గొనే కార్మికుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ప్రజావేదికపై సియంతోపాటు కూర్చునే లబ్దిదారుల పేర్లు ఖరారు చేయాలని, వీరంకిలాకులోని ఎన్‌టిఆర్ కాలనీలో పింఛన్ పంపిణీ చేసే లబ్దిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ప్రజావేదిక వద్ద ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్మికశాఖ వైద్యభీమా కమీషనర్ ఆంజనేయులు, ఉయ్యూరు ఇన్‌చార్జీ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



పెమ్మసాని చంద్రబాబు

## సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

**విజయవాడ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:** డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే సైబర్ మోసాలపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచిం చారు. పోలీసు అధికారులుగా నటిస్తూ, సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్‌చేసి డబ్బులు వసూలు చేస్తా రని తెలిపారు. ఇలాంటి మోసా లపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఇలాంటి నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఒక వీడియోను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. డిజిటల్ అరెస్ట్ మోసాలతో జాగ్రత్త!. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసు అధికారులు లేదా ప్రభుత్వ ప్రతినిధులుగా నటిస్తూ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజ్ఞాత కాల్స్, సందేహాస్పద లింకులు, ఓటీపీలు ఎప్పటికీ షేర్ చేయకండి. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించండి లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి. స్మార్ట్‌గా ఉండండి, సురక్షితంగా ఉండండి. ఒక్క క్లిక్ మీ భవిష్యత్తును మార్చొచ్చు. జాగ్రత్తగా ఆలోచించండి అని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

## ఎక్స్‌ప్రెస్‌లో అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం

**ఎపి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ**

**విజయవాడ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. బుధవారం ఈ ఘటనలో బాధిత మహిళకు రాయపాటి శైలజ వీడియో కాల్ చేసి.. ఫోన్‌లో పరామర్శించారు. న్యాయం చేస్తామని ఈ సందర్భంగా బాధితురాలికి రాయపాటి శైలజ హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రాయపాటి శైలజ బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం విశాఖపట్నంలో నివసిస్తున్నారు. గత ఆదివారం సాయంత్రం వివాహిత విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించింది. గుర్తు తెలియని వ్యక్తి జనరల్ బోగిలో ఉన్న ఆమెను ఏసీ బోగిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధిత మహిళ.. రెంటచింతల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షల నిమిత్తం ఆమెను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ అత్యాచార ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ అత్యాచార ఘటన బహిర్గతం కావడంతో ఈ ఘటనపై రెంటచింతల పోలీసులతో మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని పోలీసులకు రాయపాటి శైలజ సూచించారు.

## లిక్కర్ నిందితుల అరెస్టుపై మధ్యంతర ఉత్తర్వులు జారీ

**విజయవాడ, ఏప్రిల్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కరు స్కామ్ కేసులో నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి గోవిందప్ప అరెస్టు చేయకుండా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను జూన్ 24 వరకు ఏపీ హైకోర్టు ధర్మాసనం పొడిగించింది. నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప పిటిషనులపై విచారణ సందర్భంతో వారి అరెస్ట్‌పై ఉన్న మధ్యంతర ఉత్తర్వులు రద్దు చేయాలని సిట్ తరుపున న్యాయవాదులు వాదించారు. నిందితుల న్యాయవాదులు ధర్మాసనం ముందు తమ వాదనలు విన్పించారు. ఈ క్రమంలో పిటిషన్లపై మే 6లోగా కౌంటర్లు దాఖలు చేయాలని సిట్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేసు విచారణను వాయిదా వేసింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ సుబ్రమణ్యం

## జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

**తండ్రి కొడుకులు దుర్మరణం**

**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా.. జూపాడుబంగ్లా వద్ద జాతీయ రహదారి-340సి పై బుధవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తండ్రి కొడుకులు మృతిచెందారు. పాములపాడు మండల రుద్రవరం గ్రామం నుంచి మోటర్‌సైకిల్‌పై తండ్రి రంగన్న అలియాస్ రాజేష్(38) కొడుకు విశ్వక్‌రాణలు బ్రహ్మణకొట్కూరుకు వెళ్లుతున్నారు. అతివేగంగా వెళుతున్న మోటర్ సైకిల్ అదుపు తప్పి డివెడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి కొడుకులకు గొంతులకు డివైడర్ రేకు కోసుకుకోవడంతో వారిద్దరు అక్కడక్కడే మృతి చెందారు. వేగంగా వెళుతున్న మోటర్ సైకిల్ 100 మీటర్ల దూరంలో రోడ్డుపై పడిపోయింది. సిఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ మల్లికార్జునలు ఘటనా స్థలం వద్దకు వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని, శవాలను పోస్టుమార్టమ్ నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**భోగాపురం (విజయనగరం జిల్లా) ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** భోగాపురం గ్రామంలో కస్తూరిబా పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని మోటార్ సైకిల్‌పై వచ్చి బలంగా గుద్దడంతో ప్రమాదం జరిగిన స్థలంలోనే ముగ్గురు వ్యక్తులు మరణిం చిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన వ్యక్తులు సంచాన సాయికుమార్(23), లావేటి చిన్నమ్ములు(48), చిట్టివలస రుత్విక(4) ఉగాది గ్రామం నుంచి బుధవారం ఉదయం సింహాచలం దర్శనంకి బయలుదేరి దర్శనం అనంతరం భోగాపురం సమీపంలో కస్తూరిబా పాఠశాల సమీపంలో జాతీయ రహదారి పై ఎదుట ప్రయాణిస్తున్న లారీని బలంగా మోటార్ సైకిల్‌తో ఢీకొట్టడం తో సంఘటన స్థలం వద్దనే ముగ్గురు మరణించినట్లు స్థానిక పోలీ సులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే విజయనగరం జిల్లా ఏఎస్‌పి సౌమ్య లత మరియు డిఎస్‌పి గురుమూర్తి సంఘటన స్థలానికి చేరు కొని ప్రమాదం ఏవిధంగా జరిగిందో పరిశీలించి విచారణ చేపడుతు న్నట్టు తెలిపారు. స్థానికంగా ఉన్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి జాతీయ రహదారికి వాహన చోదకులకు ఎటువంటి అంతరాయం కలగకుండా చేశారు. స్థానిక సిఐ దుర్గాప్రసాద్, ఎస్‌ఐలు పాపారావు, సూర్య కుమారి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి జరగడానికి గల కారణాలు తెలుసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ దుర్గాప్రసాద్




ఆనందోత్సాహాలతో భాష్యం విద్యార్థులు

## తెలంగాణ 10వ తరగతి 2026 ఫలితాలలో భాష్యం హైదరాబాద్ విజయభేరి..

**గుంటూరు విద్య ఏప్రిల్ 29 ప్రభాతవార్త**


తెలంగాణ 10వ తరగతి 2026 ఫలితాలలో భాష్యం విద్యార్థినీ, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారని భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తెలిపారు. బుధవారం ఎస్.ఆర్.నగర్‌లోని భాష్యం క్యాంపస్‌లో ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో సాకేత్ రామ్ మాట్లాడుతూ తెలంగాణ 10వ తరగతి ఫలితాలలో భాష్యం హైదరాబాద్ విద్యార్థులు పి.శృతి, ఆర్.గుణసాయి శరణ్‌రెడ్డిలు 600కి 595 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వి.ఎస్.ఎన్.శరజ్ఞ 594, కె.ఎల్.డి.వి. అనూరాధ 594, కె.హనీషా 594, డి.గగన హంస 593, యు.వి.లిఖిత్ 593, ఆరోహిశర్మ 593 వంటి మార్కులతో పాటు 580 ఆ పైగా మార్కులను 203 మంది, 570 ఆ పైగా 434, 550 ఆ పైగా 974, 500 ఆ పైగా 1934 మంది విద్యార్థులు సాధించారన్నారు. భాష్యం విద్యార్థులు 520 మార్కుల యావరేజ్‌ను సాధించి భాష్యం విద్యాసంస్థలకు గర్వకారణంగా నిలిచారన్నారు. మ్యాథ్స్ 90 ఆపైగా సాధించిన విద్యార్థులు 1500, సైన్స్‌లో 90 ఆపైగా సాధించిన విద్యార్థులు 1331 మంది అని తెలిపారు. విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఇలాంటి అద్భుత విజయాలు సాధించడం జరిగిందన్నారు. విద్యా విధానంలో సమగ్ర ప్రణాళికలతో భాష్యం జైత్రయాత్ర ఇలాగే కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, హైదరాబాద్ సీఈఓ చైతన్యలు అభినందించారు. కార్యక్రమంలో హైదరాబాద్ భాష్యం జోనల్ హెడ్స్ బి.అంకమ్మరావు, శిరీష, మార్కండేయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

## ఇథనాల్ ఉత్పత్తికి మంచినీటి గండం..!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** ప్రస్తుతం ప్రపంచ దేశాల్ని పశ్చిమాసియా యుద్ధం కారణంగా చమురు కొరతపట్టి పీడిస్తోంది. ఇండియా ఇదే పరిస్థితిలో ఉంది. అందుకే, భవిష్యత్తులో చమురు కొరతను ఎదుర్కొనేందుకు భారతీయ వాహనదారులు పెట్రోల్‌లో ఇథనాల్ కలపాలని కేంద్రం భావిస్తోంది. ఇందుకోసం అవసరమైన ఇథనాల్‌ను భారీ స్థాయిలో ఉత్పత్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇథనాల్ ఉత్పత్తి చేయాలంటే భారీగా నీళ్లు అవసరం. ఒక లీటర్ ఇథనాల్ తయారు చేయడానికి పది వేల లీటర్ల నీళ్లు అవసరం. ఎందుకంటే ఇథనాల్ ఉత్పత్తి చేయాలంటే చెరుకు, జొన్న, వరి అవసరం. ఈ పంటలకు భారీగా నీళ్లు అవసరం. ఇండియాలో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 1,822 కోట్ల లీటర్లు. ఈ స్థాయిలో ఇథనాల్ ఉత్పత్తి కావాలంటే జొన్న, వరి, చెరుకు పంటలు అధిక స్థాయిలో ఉత్పత్తి కావాలి. ఈ పంటలకు ఇతర పంటలతో పోలిస్తే ఎక్కువ సాగునీరు అవసరం. కేంద్రం గనుక ఇథనాల్‌ను అధికంగా ఉత్పత్తి చేయాలని భావిస్తే దీనికి అనుగుణమైన పంటల సాగును ప్రోత్సహించాలి. దీనివల్ల దేశంలో సాగునీటి కొరత ఇంకా పెరుగుతుందని నిపుణులు అంటున్నారు.

## సాధారణ పరిస్థితులకు పెట్రోల్ డీజిల్ లభ్యత

**తిరుపతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా తీవ్రంగా కనిపించిన పెట్రోల్, డీజిల్ కొరత ప్రభావం క్రమంగా బుధవారం ఉదయానికి తగ్గుముఖం పట్టింది. ప్రధానంగా తిరుపతి నగరంలో పెట్రోల్ బంకుల వద్ద పరిస్థితి సాధారణ స్థితి కనిపించింది. గత రెండురోజులుగా బంకుల వద్ద కిలోమీటర్ల మేర కనిపించిన వాహనాల క్యూలు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి. ఇప్పటికే ఆయిల్ కంపెనీలు అదనపు ట్యాంకర్ల ద్వారా ఇంధన సరఫరాను పెంచడంతో తిరుపతి చిత్తూరు జిల్లాల్లో పరిస్థితి మెరుగుపడుతోంది. పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గిపోవడంతో వాహనదారులు ఊరట చెందుతున్నారు. రెండు రోజులుగా నాలుగు చక్రాల వాహనాలకు వెయ్యిరూపాయల వరకు మాత్రమే పెట్రోల్ ఇచ్చే పరిమితి ఉండగా, ఈరోజు దానిని రెండువేల రూపాయలకు పెంచారు. ద్విచక్రవాహనాలకు రూ. 500 వరకు ఇంధనం అందిస్తున్నారు. నిన్నటి వరకు గంటన్నరకు పైగా క్యూలో నిలబడి పెట్రోల్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండగా, బుధవారం సాయంత్రానికి 10నిమిషాల్లోనే ఇంధనం లభిస్తోందని వాహనదారులు చెబుతున్నారు. జిల్లాలో పెట్రోల్ బంకుల వద్ద ఇంధన సరఫరా సాధారణ స్థితికి చేరుకుంటోందని అధికారులు తెలిపారు. బంకుల వద్ద నో స్టాక్ బోర్డ్స్ లేకుండా చూడాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి పెట్రోల్, డీజిల్ కొరతతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఇప్పుడు కొంత ఊరట లభించింది. రానున్న రోజుల్లో సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుతుందని అధికారులు భావిస్తున్నారు.




ఖాళీగా మారిన పెట్రోల్‌బంకు

# తిరుమల సమాచారం

## వేసవిసెలవులతో భారీగా కొనసాగుతున్న భక్తులు

**-వెంకన్న దర్శనానికి 18 గంటలు**



తిరుమలలో దైవదర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు

**తిరుమల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు మొదలవడంతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా కొనసాగుతున్నారు. వారంరోజులుగా తిరుమలలో భక్తులరద్దీ విపరీతంగా ఉంది. టిటిడి అధికారులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసి వీలైనంత త్వరగా దర్శనం చేయించేందుకు చూస్తున్నారు. టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఓ లోకనాథం, ఏవిఎస్‌ఓ రాజశేఖర్ ఆలయంలో తోపులాట లేకుండా క్యూలైన్ల నిర్వహణ చేస్తున్నారు. వారంరోజులుగా తిరుమల భక్తజన సంద్రంగానే మారింది. బుధవారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 18 గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరేడు గంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 42 వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25 వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టీ, కాఫీ, మజ్జిగ, పాలు పంపిణీ చేస్తున్నారు.

## అటకెక్కిన పరకామణి కేసు

**తిరుపతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:**



హుండీని లెక్కిస్తున్న దేవాదాయ సిబ్బంది

మూడు సంవత్సరాల కిందట తిరుమల పరకామణిలో విదేశీ కరెన్సీ చోరీ జరిగిన కేసులో జరిగిన పరిణామలన్నిటిపై పూర్తిస్థాయిలో సమగ్ర దర్యాప్తు అంశాలు ఏమయ్యాయనేది విస్మయం కలిగిస్తోంది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో సిఐడి, ఎసిబి, ఐటి విభాగాలు ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి ఆ తరువాత చోటుచేసుకున్న అంశాలపై, లోక్‌అదాలత్‌లో రాజీచేసుకోవడం వరకు అన్ని కోణాల్లోనూ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. నిందితుడు ఆస్తులపై దర్యాప్తుకు అవినీతినిరోధకశాఖ(ఎసిబి)డిజికి ఆదేశాలిచ్చింది. ఈ కేసుతో సంబంధం ఉన్న గత టిటిడి ఛైర్మన్, అధికారులు, పోలీసు అధికారులతోబాటు లోక్‌అదాలత్‌లో పరకామణికేసు రాజీచేసిన న్యాయమూర్తిపైనా చర్యలు చేపట్టాలని హైకోర్టు సూచించడంతో గత ఏడాది సంచలనంగా మారింది. అత్యవసరంగా సిబిసిఐడితో విచారణకు ఆదేశించడంతో పరకామణి చోరీ వ్యవహారంలో "పెద్ద"లుగా వ్యవహరించి చేతివాటం చూపిన వారికి, అధికారులకు చెమటలు పట్టాయి. అయితే ఈ కేసులో ఏమి జరిగిందనేది మాత్రం వెలుగులోకి రాలేదు. 2023లో పరకామణి చోరీ కేసులో తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత లోక్‌అదాలత్‌తో రాజీకి ప్రోత్సహించడం వంటివి సంచలనం కలిగించాయి. అయితే ఈ కేసు దర్యాప్తు మాత్రం ఏమైందనేది టిటిడి వర్గాల్లో సంచలనంగా మారింది.

## పారిశ్రామిక ప్రాధాన్యత రంగాల మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

**-తిరుపతి జెసి గోవిందరావు..**

**తిరుపతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:**




సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి జెసి గోవిందరావు

రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ఆర్థిక వృద్ధి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తిరుపతి జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అవకాశాలు, పారిశ్రామిక ప్రాధాన్యత రంగాలపై తిరుపతి డిఆర్‌ఓ నరసింహులుతో కలిసి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో తిరుపతి జిల్లాను ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఆధునిక తయారీ రంగాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణపై సమీక్షి ంచారు. తిరు పతిలో ఎలక్ట్రానిక్ అసెంబ్లీ యూనిట్లు, అనుబంధ పరిశ్రమలు, నూతన పెట్టుబడుల ఆకర్షణకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అనుగుణంగా భూముల లభ్యత, విద్యుత్, నీటి సరఫరా, రహదారులు, రవాణా సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అలాగే తిరుపతి జిల్లాలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాలకు అనుకూల వాతావరణం కల్పించి, దేశీయ మరియు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్‌ఓ నరసింహులు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చంద్ర శేఖర్, ఏడీ సర్వే అరున్ కుమార్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ చంద్రశేఖర్ రావు,ఏపీ ట్రాన్స్కో ఈ ఈ శ్రీనివాసన్, ఇరిగేషన్ ఎస్ ఈ రాధాకృష్ణ మూర్తి, ఏపీఐఐసీ ప్రతినిధులు, జిల్లా ఐ టీ మేనేజర్ రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మే 10,11 తేదీలలో టిటిడి ఇంజనీరింగ్ పోస్టుల కోసం కంప్యూటర్ ఆధారిత పరీక్షలు

**తిరుమల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ కోసం మే 10, 11 తేదీలలో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ పరీక్షల ద్వారా ఎఇఇ(సివిల్), ఎఇఇ (ఎలక్ట్రికల్), ఎఇ (సివిల్), ఎటిఒ (సివిల్) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా క్రింది షెడ్యూల్ ప్రకారం నిర్వహించబడతాయి. పరీక్షల షెడ్యూల్‌లో భాగంగా ఎఇఇ(సివిల్) మేనెల 10వతేదీ ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు, ఎఇఇ (ఎలక్ట్రికల్) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకుజరుగుతాయి. తిరిగి ఎఇ సివిల్ 11వతేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు ఎటిఒ (సివిల్) మధ్యాహ్నం2గటంలనుంచి సాయంత్రం 5 గంటలవరకు అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలను ఏప్రిల్ 24 నుండి 29వ తేదీ సాయంత్రం 6గంటల వరకు ఆన్ లైన్ లో ఎంపిక చేసుకోవాలి. తదుపరి అభ్యర్థులు హాల్ టికెట్లను మే 02 తేదీ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలాగే పరీక్ష షిఫ్ట్ వివరాలను పరిశీలించి, అవసరమైన అభ్యర్థి నిర్ధారణ (కాండిడేట్ కన్ఫర్మేషన్) ప్రక్రియను పూర్తి చేసుకోవాలని టిటిడి కోరుతోంది. హాల్ టికెట్లు, పరీక్షా కేంద్రాలు తదుపరి వివరాలకు టిటిడి వెబ్ సైట్ ,కాల్ సెంటర్ నెంబర్ 155257ను సంప్రదించాలి.



# గుంటూరు వార్త

# అందరినీ కలుపుకుని ముందుకు సాగాలి

**పార్టీ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులకు శిక్షణ తరగతుల్లో నారా లోకేష్ దిశానిర్దేశం..**

**మంగళగిరి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త** పదవి వచ్చిందనే అహంకారం వద్దనీ, అందరినీ కలుపుకుని ముందుకుసాగాలని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పార్టీ కేంద్రకార్యాలయంలో నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం అనంతరం నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమానికి మంత్రి హాజరై దిశానిర్దేశం



చేశారు. ఈ సందర్భంగా పర్సనాలిటీ డెవలప్ మెంట్ క్లాస్ విన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు నియోజకవర్గాల్లో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలి. మిమ్మల్ని ఎలా గుర్తించామో మీరు కూడా నాయకత్వాన్ని గుర్తించాలి. నాయకుల పనితీరుపై ప్రతి మూడు నెలలకోసారి బేరీజు వేస్తాం. నిన్నటి వరకు వేరు, ఈ రోజు నుంచి వేరు. మీరు చేసే ప్రతి పని పార్టీకి వర్తిస్తుంది. మీరు మంచి చేస్తే పార్టీకి మంచి జరుగుతుంది. ప్రతి అంశంపైనా అవగాహన ఉండాలి. పార్టీ నిర్మాణం, నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి. సమన్వయంతో ముందుకుసాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## రెంటచింతలకు చెందిన వివాహితపై రైలులో లైంగిక దాడి

**మాచర్ల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రెంటచింతల మండలానికి చెందిన ఓ వివాహితపై విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీవనోపాధి కోసం విశాఖలో ఉంటున్న బాధితురాలు ఈ నెల 26న నడికుడి వైపు ప్రయాణిస్తుండగా జనరల్ బోగీలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఏసీ బోగికి తీసుకెళ్లి దాడికి పాల్పడినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘనటపై పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగుతుందని సంబంధిత అధికారి పేర్కొన్నారు.



# లోకేష్...శభాష్..!

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**గుంటూరు ఏప్రిల్ 29 ప్రభాత వార్త ప్రతినిధి :** ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో గతానికి మించి కూటమి పార్టీలకు ఓట్లు రావాలని టీడీపీ కొత్త కార్యవర్గానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కొత్త కార్యవర్గ








ప్రమాణస్వీకారోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. పాత,కొత్త కలయికతో టీడీపీ అధినాయకత్వం కమిటీలను ఏర్పాటు చేసింది. పార్టీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు పొలిట్ బ్యూరోలో చంద్రబాబు, లోకేష్ చోటు కల్పించారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని నిజం చేస్తూ పని చేసిన వారికే కమిటీల్లో పెద్ద పీట వేశారు. సీనియర్ల సారధ్యం, జూనియర్ల దూకుడును సమపాళ్లలో కలుపుతూ కమిటీల నియామకాన్ని చేపట్టారు. గతంలో సోషల్ మీడియాలో యాక్టీవ్ గా పనిచేసిన వారికి కమిటీలో చోటు కల్పించారు. ఎన్టీఆర్, చంద్రబాబు అధ్యక్షులుగా ఉన్నప్పుడు లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కమిటీల్లోనూ యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి వంటి వారు కీలక బాధ్యతలు చేపట్టారు. కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ హైలెట్ గా నిలిచారు. పార్టీలో కొత్తగా కొలువు తీరిన కార్యవర్గానికి.. నేతలకు, కేడర్ కు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మాట్లాడుతూ మరో 3 ఏళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేసేందుకే కూటమికి ప్రజలు ఓట్లేశారని వచ్చే ఎన్నికల్లో 2024లో వచ్చిన ఓట్లకంటే ఎక్కువ ఓట్లు రావాలని అన్నారు. పార్టీ ప్రతిష్ట పెరిగేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని పార్టీ శాశ్వతంగా ఉండాలని అన్నారు.తెలుగుదేశం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని, పడిన కష్టాన్ని ప్రజలకు చెబుదామని అన్నారు. ప్రతిదీ నిష్టతో , మనస్సుతో, భవిష్యత్తు కోసం పని చేయాలని తెలిపారు.

## డిజిటల్ అరెస్ట్ పై అప్రమత్తంగా ఉండాలి

**కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

**గుంటూరు ఏప్రిల్ 29 ప్రభాత వార్త ప్రతినిధి :** దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు, సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక అవగాహన వీడియోను విడుదల చేశారు. నేరగాళ్లు పోలీసులుగా , ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఈ వీడియోలో వివరించారు. మీపై కేసు వుంది అరెస్ట్ అవుతారని భయపెడతారని తెలిపారు. కొన్నిసార్లు నకిలీ ఎఫ్ ఐ ఆర్ లు , ఐడీలు చూపించి నమ్మిస్తారని పేర్కొన్నారు. బాధితులను ఎక్కువసేపు కాల్‌లో ఉంచి మానసిక ఒత్తిడి పెంచి డబ్బులు పంపించమంటారని అన్నారు. తెలియని కాల్స్, వీడియో కాల్స్ ను నమ్మొద్దని స్పష్టం చేశారు. ఓ టి పి లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.అనుమానం ఉంటే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు లేదా పోలీసులను సంప్రదించాలని వీడియో సందేశంలో కోరారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గుంటూరు ఏప్రియల్ 29 ప్రభాత వార్త ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 30వ తేదీన సి.ఆర్.డి.ఏలో జరగనున్న కార్యక్రమానికి హాజరుకానున్న దృష్ట్యా బుధవారం జిల్లా కలెక్టర్



సాయికాంత్ వర్మ ఏర్పాట్లను పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ తో కలిసి పరిశీలించారు. ఈ నెల 25వ తేదీన ముంబాయి వేదికగా బిజినెస్ రిఫార్మర్ అవార్డును ముఖ్యమంత్రి అందుకున్న సంగతి తెలిసిందే. ఈ అవార్డును వ్యక్తిగత అవార్డుగా కాకుండా టీం అవార్డుగా భావిస్తూ తన ఔన్నత్యాన్ని తెలియజేయడమే కాకుండా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బందితో సహా అందరి భాగస్వామ్యం ఉందని స్వర్ణ వార్డు సభ్యులు, మంత్రులు, అధికారులు ఇలా అందరితో ఈ అవార్డు విశేషాలను పంచుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏర్పాట్లు తనిఖీ చేసి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ లు భార్గవ తేజ, కొల్లాబత్తుల కార్తీక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ అధికారుల పనితీరుపై ప్రతి 15 రోజులకు సమీక్షా సమావేశం నిర్వహిస్తాం : జిల్లా కలెక్టర్,

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 29 ( ప్రభాతవార్త) :** గుంటూరు నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు తమ పనితీరులో మార్పు చేసుకోవాలని...ప్రతి విభాగానికి సంబంధించి అధికారుల పనితీరుపై ప్రతి 15 రోజులకు సమీక్షా సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్, గుంటూరు నగర కార్పొరేషన్ ప్రత్యేక అధికారి సిఎం.సాయికాంత్ వర్మ సున్నితమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇక నుంచి తాను నిర్వహించబోయే ప్రతి సమావేశానికి యాక్షన్ టేకెన్ రిపోర్ట్స్ తో అధికారులు హాజరు కావాలని స్పష్టం చేశారు. అలాగే నగరంలో నూతన డ్రైన్ నిర్మాణ పనులు10రోజుల్లో ..నిర్మాణదశలో ఉన్న డ్రైన్లు 15రోజుల్లో పూర్తి చేయకపోతే ఇంజినీరింగ్ అధికారులే భాద్యత వహించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా నగరంలో మోడల్ గా 24/7 త్రాగునీటి సరఫరా పైలెట్ ప్రాజెక్ట్ గా చేయాలని .. ఎక్కడా త్రాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. నగరంలో అడ్డగోలుగా ఉన్న హోర్డింగులను తక్షణమే తొలిగించాలన్నారు.స్వచ్ఛ సర్వేక్షణ్ లో గతేడాది కంటే ఒక్క స్థానం తగ్గడానికి వీలులేకుండా చూడాలని, ప్రతి విభాగం అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని సున్నితంగాసిఎం.సాయికాంత్ వర్మ హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి సిఎం.సాయికాంత్ వర్మ బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తో కలిసి విభాగాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కమిషనర్ నగరపాలక సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, జనాభా, త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం, రెవెన్యూ, రోడ్ల విస్తరణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్, ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రతి 15 రోజులకుతి జిఎంసి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని, ప్రతి సమావేశానికి యాక్షన్ టేకెన్ రిపోర్ట్స్ తో అధికారులు హాజరు కావాలన్నారు. నగరంలో త్రాగునీటి కొరత లేకుండా అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలన్నారు. నగరంలో ఎక్కడా డ్రైన్ క్రాస్ త్రాగునీటి పైప్ లైన్లు ఉండడానికి వీలు లేదని, ఏఈల వారీగా అలా క్రాసింగ్ లేవని సంతకంతో కూడిన సర్టిఫికేట్ ఇవ్వాలన్నారు. డిప్యూటీ కమిషనర్లకు కూడా పర్యవేక్షణ విధులు కేటాయించాని సూచించారు. ఎక్కడైనా త్రాగునీటి పైప్ లైన్ లీకులు గుర్తిస్తే టాప్ ప్రయారిటీగా మరమత్తు చేయాలని, గతంలో జరిగిన విధంగా నగరంలో ఎక్కడా కలుషిత నీటి సరఫరా జరిగి




ప్రమాదాలు జరగడానికి అవకాశం లేకుండా జాగ్రత్తగా తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. త్రాగునీటి సరఫరా సమయాలు ఒకే రీతిలో ఉండాలని, సరఫరా సమయంపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. సరఫరాలో లోపాలు తలెత్తకుండా అదనపు మోటార్లు, జనరేటర్లని సిద్ధంగా ఉంచాలన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ పనుల్లో ప్రారంభం కాని వాటిని 15 రోజుల్లో ప్రారంభించాలన్నారు. నగరంలో మోడల్ గా 24/7 త్రాగునీటి సరఫరా పైలట్ ప్రాజెక్ట్ గా చేయాలన్నారు. ప్రతి పైప్ లైన్ ని ఎమినిటి కార్యదర్శులు తరువుగా ఆడిట్ చేసుకోవాలని, సచివాలయం పరిధిలో జరిగే సరఫరా లేదా సమస్యలకు సెక్రెటరీనే భాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రజలు అందించే ఫిర్యాదుల పరిష్కారానికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఇక నుండి మొదలు పెట్టె డ్రైన్ వర్క్ లు 10 రోజుల్లో పూర్తీ కావాల్సిందేనని, ప్రస్తుతం ఉన్న పెండింగ్ పనులు 15 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. డ్రైన్ వర్క్ ప్రారంభానికి ముందే ఆర్ఓడబ్ల్యు పట్టణ ప్రణాలిక విభాగం చేయాలని, యుటిలిటి విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ పూర్తి చేసిన పిదపనే డ్రైన్ పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. నగరంలో విస్తారమైన రోడ్లు ఉన్నాయని, వాటిలో గ్రీనరీ పెంపుకు శ్రద్ధ చూపాలన్నారు. ఫుట్ పాత్ లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్, గ్రీనరీ బెల్ట్, సెంట్రల్ లైటింగ్ వంటి అంశాలతోనే రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నగరంలో ప్రధాన రోడ్ల అభివృద్ధిపై వచ్చే సమావేశానికి డిపిఆర్ సిద్దం చేయాలని ఎస్ఈని ఆదేశిచారు. జంక్షన్ల అభివృద్ధికి ట్రాఫిక్ రెగ్యులేషన్స్ తో కూడిన మంచి డిజైన్లతో తదుపరి సమావేశానికి రావాలన్నారు. పార్క్ లను మల్టి పర్పస్ యూజ్ రీతిలో ఆట స్తలాలుగా కూడా అభివృద్ధి చేయాలని, శ్మశానాలను దాతల సహకారంతో మోడల్ గా అభివృద్ధి చేయాలన్నారు. రోడ్లపై పాట్ హోల్స్ ఉండడానికి వీలు లేదని, వాటిని ఇష్టానుసారం కాకుండా రోడ్ లెవల్ కి ఉండేలా చేయాలని సూచించారు. ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నూతన లేయర్ చేయాలన్నారు. ఫుట్ పాత్ లను కూడా క్రమ పద్దతిలో చేయాలన్నారు. ప్రజారోగ్య విభాగంకి సంబంధించ పారిశుధ్యం మెరుగవ్వాలని, ప్రధాన రోడ్ల శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో గతేడాది కంటే ఒక్క స్థానం తగ్గడానికి వీలు లేదన్నారు. కమర్షియల్ సంస్థలు, రోడ్ల పక్కన వ్యాపారాలు చేసేవారు చెత్త రోడ్లు, డ్రైన్లలో వేస్తె కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చెట్ల కొమ్మలు కూడా తొలగించాలన్నారు. ఏబీసిపై మాట్లాడుతూ జిజిహెచ్ లో వీధి కుక్కల కాటులపై వచ్చే వారి వివరాలు తీసుకొని, ఆయా ప్రాంతాల్లో ఏబీసికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏబీసిని జిఎంసి సెంటర్లతో పాటుగా అర్హత కల్గిన ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాల్లో కూడా చేయిస్తే ఉత్తమ ఫలితం ఉంటుందని తెలిపారు. దోమల నియంత్రణపై మాట్లాడుతూ నీరు నిలిచే ప్రాంతాల్లో విస్తృతంగా గంబూషియా చేపలు వదలడం, డ్రైన్లలో లార్వా నాశక మందులు పిచికారీ, ఆయిల్ బాల్స్ వేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. రోడ్లు, డ్రైన్ల నిర్మాణ సమయంలో రైట్ ఆఫ్ వే (ఆర్ఓడబ్ల్యు) క్లియరెన్స్ భాధ్యత పట్టణ ప్రణాళిక విభాగానిదేనన్నారు. నగరంలో హోర్డింగ్స్ అడ్డదిడ్డంగా ఉన్నాయని, వారికి తెలియచేసి, స్పందించకుంటే తొలగించాలన్నారు. డివైడర్లలో లాలి పప్స్, ఫ్లెక్సీలు వంటి వాటిని తొలగించాలని ఆదేశించారు. ప్రధానంగా అన్ని జంక్షన్లలో 3 రోజుల్లో అనధికార హోర్డింగ్స్, బ్యానర్లు తొలగించాలని స్పష్టం చేశారు. పోస్టర్స్ ప్రింట్ చేసేవారు, అంటించే వారిపై కఠినంగా వ్యవహరించాలని, అంటించిన వారికి అపరాధ రుసుం విధించి, వారితోనే శుభ్రం చేయించి, పెయింట్ కూడా చేయించాలని, అందుకు ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. నగరంలో 50 శాతం గ్రీన్ బెల్ట్ కవరేజ్ ఉండే లక్ష్యంతో వచ్చే ఏడాదికి 25 శాతం సాధించేలా తదుపరి సమావేశానికి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్దం చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్(ఇంచార్జి) జి.సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిపి రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, పిఓ సింహాచలం, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**సత్తెనపల్లిటౌన్ ముప్పాళ్ళ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం ప్రధాన రహదారి పై ఉన్న బొల్లవరం అడ్డరోడ్డు రక్తసిక్తమయ్యింది. అధికారుల నిరక్ష్యం, కనీస భద్రతా ప్రమాణాలు




లేని రహదారి వెరసి ఇద్దరు యువ విద్యార్థులను బలితీసుకుంది. నరసరావుపేట నుండి వస్తున్న విద్యార్థులను, సత్తెనపల్లి నుండి అతివేగంతో దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.నరసరావుపేటలో తమ పనులు ముగించుకుని బైక్‌పై సత్తెనపల్లి వైపు వస్తున్న వేజెండ్ల ఇమేష్ (24)గంప ఆంజనేయ రాజు (26) అనే విద్యార్థులను సత్తెనపల్లి నుండి ముప్పాళ్ళ వైపు అతివేగంతో దూసుకొచ్చిన కారు బొల్లవరం అడ్డరోడ్డు , నార్నెపాడు కాలువ మధ్య బలంగా ఢీకొట్టింది. కారు వేగానికి బైక్ నుజ్జునుజ్జు అయ్యింది. యువకులు తీవ్ర రక్తస్రావంతో స్పాట్‌లోనే ప్రాణాలు విడిచారు. ఈ ఘోర ప్రమాదానికి అతివేగం ఒక కారణమైతే, అధికారుల నిరక్ష్యం మరో ప్రధాన కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న అడ్డరోడ్ల వద్ద కనీసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం దారుణం. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవని చెబుతున్నారు.కళ్లముందే ఎదుగుతున్న పిల్లలు శవాలై పడి ఉండటం చూసి ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి బొల్లవరం అడ్డరోడ్డు వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోతే, ఈ రహదారి మరింత మంది ప్రాణాలను మింగేసే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.ఈ క్రమంలో ముప్పాళ్ళ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాలను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.

## లోకేశ్ నాయకత్వంలో పార్టీలో నూతనోత్తేజం

**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు, ఏప్రిల్ 29,ప్రభాతవార్త :** టీడీపీ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందని, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంత్రి నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టడం ద్వారా టీడీపీకి నూతనోత్తేజం వచ్చిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం నారా లోకేశ్ ప్రమాణ స్వీకారం అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయంలోని ఆయన చాంబర్ లో కలిసి ఎమ్మెల్యే నసీర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు సంక్షోభాల సైతం గుండె ధైర్యంతో ఎదుర్కొని పాదయాత్ర ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన గొప్ప నాయకుడు నారా లోకేశ్ అని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమలు ఒక్కొక్కటిగా రాష్ట్రం నుంచి తరలిపోయాయని, ఈ క్రమంలో అధికారం చేపట్టిన వెంటనే యువతకు 20 లక్షల



ఉద్యోగాల కల్పన దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి లోకేశ్ కృషి చేశారని తెలిపారు. అందులో భాగంగా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడంలో యువ నేత లోకేశ్ సక్సెస్ అయ్యారని చెప్పారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి ఉన్నత ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని అన్నారు. పార్టీకి కార్యకర్త అధినేత అనే సంకేతం ఇస్తూ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా అండగా నిలుస్తున్నారని చెప్పారు. అలాంటి విజన్ ఉన్న నాయకుని ద్వారా తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతమవుతుందని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు.

## పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల నుంచి సామాన్యుల వరకు అందరికి గుర్తింపు

**మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ధనుంజయ్ రావు**


మంగళగిరి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ఇది కార్యకర్తల పార్టీ.. ఇది సామాన్యుల పార్టీ..” అని చేనేత నాయకులు, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ గుత్తికొండ ధనుంజయ్ భావోద్వేగంతో పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పొలిట్‌బ్యూరో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాధారణ కార్యకర్తల ప్రతిభను గుర్తించి పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక వేదిక అయిన పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించడం తనకు గర్వకారణమని అన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనలాంటి వారికి కూడా ఉన్నత స్థాయిలో అవకాశాలు కల్పించడం పార్టీ ప్రత్యేకతను ప్రతిబింబిస్తోందని తెలిపారు.కార్యకర్తల కృషి, అంకితభావాన్ని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు లభించేలా పార్టీ వ్యవస్థ పనిచేస్తోందని, ఇదే పార్టీ బలానికి మూలమని చెప్పారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కట్టుబడి పనిచేస్తానని, కార్యకర్తల ఆశయాలను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని గుత్తికొండ ధనుంజయ్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ స్థాయికి తీసుకువచ్చిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# కదులుతున్న రైల్లో అత్యాచారం

**విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో వివాహిత పై లైంగిక దాడి బాధితురాలుది పల్నాడు జిల్లా రెంటచింతల రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు**

**గుంటూరు ఏప్రిల్ 29 ప్రభాత వార్త ప్రతినిధి :** రైలు ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడి పోతున్నారు. ఈ మధ్య బాపట్ల జిల్లా అప్పికట్ల వద్ద దుండగులు రైలు నిలిపి దోపిడీ చేసిన ఘటన మరువక ముందే కదులుతున్న రైల్లో అత్యాచారం జరిగిన మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. పల్నాడు జిల్లా రెంతచింతలకు చెందిన భార్యాభర్తలు గత ఆదివారం విశాఖపట్నం నుండి సొంతూరు రెంతచింతలకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరారు.సీట్లు దొరక్క పోవడంతో జనరల్ బోగీలోని బాత్రూం వద్ద కూర్చున్నారు. రైలు విజయవాడ సమీపానికి చేరుకోగానే ఏసీ బోగీలో బాయ్ గా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన శేఖర్ దంపతులిద్దరిని ఏసీ బోగీలో ఖాళీ వుంది కూర్చోమని పిలిచాడు. ఇద్దరూ ఏసీ బోగీలోకి వెళ్ళిన తర్వాత భర్త ఫోన్ చూసుకుంటూ బాత్రూం వద్ద నిలబడగా



భార్య ఏసీ కుపే లోపలకు వెళ్ళింది.ఇదే అదనుగా నిందితుడు వివాహిత నోరు మూసేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చాక భార్య ముభావంగా ఉండటం గమనించిన భర్త గట్టిగా నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో మంగళవారం రెంటచింతల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయవాడ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గుర్తించిన రైల్వే పోలీసులు బుధవారం అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# కన్నవారికే నిప్పు పెట్టిన కసాయి కూతురు

## ఆస్తికోసం అర్థరాత్రి ఘాతుకం.. చిలకలూరిపేటలో కలకలం

గుంటూరు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి: మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. ఆస్తిపాస్తుల ముందు పేగు బంధం చిన్నబోతోంది. కన్నవారిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కూతురే.. ఆస్తి కోసం వారు నిద్రిస్తున్న ఇంట్లోనే పెట్రోల్ పోసి నిప్పంటించిన అమానుష ఘటన చిలకలూరిపేట పట్టణంలో సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని గుర్రాలచావిడి ప్రాంతంలో నివసిస్తున్న గౌడిశెట్టి సుకన్యకు ఇద్దరు కుమార్తెలు. అయితే, గత కొంతకాలంగా ఆస్తి విషయంలో తల్లిదండ్రులకు, కుమార్తె గౌడిశెట్టి చంద్రికకు మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆస్తి మొత్తం తనకే చెందాలన్న దురాశతో చంద్రిక కన్నవారని కూడా చూడకుండా అత్యంత దారుణానికి ఒడిగట్టింది.అర్ధరాత్రి అగ్నిప్రమాదం.. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తల్లి సుకన్య, తండ్రి ఇంట్లో నిద్రిస్తుండగా, చంద్రిక ఇంటికి నిప్పు పెట్టింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రాణభయంతో వృద్ధ దంపతులు బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదయ్యింది. అదృష్టవశాత్తూ వారు తృటిలో ప్రాణాపాయం నుండి



తప్పించుకున్నారు. పోలీసుల రంగప్రవేశం: స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ అమానుష ఘటనపై స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. “ఆస్తి కోసం కన్నవారిని చంపాలనుకోవడం కలికాలం కాకపోతే మరేమిటి?“ అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

MN 6 PAGE-GNT:MN 6 PAGE-GNT 01/01/2001 09:29 Page 1



# విద్యార్థులే వర్సిటీకి అంబాసిడర్లు

## ఏఎన్‌యులో అట్టహాసంగా వార్షికోత్సవ సంబరాలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్29,ప్రభాతవార్త:** జీవితంలో మూలాలతోనే ఉన్నత వ్యక్తిత్వానికి మార్గాలు తెలుస్తాయని డా.గజల్ శ్రీనివాస్ అన్నారు. జీవితంతో సక్సెస్‌కు కారణాలు మూలాలకు దగ్గరగా ఉంటాయన్నారు. నాలుగు డబ్బులు ఉన్నాయని జీవితం సంతోషంగా




గడిచిపోతుందని అనుకోవద్దు జీవితం మొత్తం నేర్పిస్తుంది ఈక్రమంలో నీలో నీకు కాన్ఫిడెన్స్ ఉండాలని, సక్సెస్ ఇచ్చిన వారిపట్ల కృతజ్ఞత చూపాలని పేర్కొన్నారు. తను పాడిన పాటల్లో 'ఒక్కసారి ఊరుపోయిరా', నాన్నంటే పాటల ఆలాపాన అందరిని ఆలోచింపచేసింది. తన పేరుకు ముందు డాక్టర్ అనే గౌరవ రావడానికి ఏఎన్‌యు ఇచ్చిన డాక్టరేట్ అని దీనిని తాను జీవితాంతం గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు. ఏఎన్‌యులోని ఆర్ట్స్, సైన్స్, ఫార్మశీ, వ్యాయామ విద్య, ఆర్కిటెక్చర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు బుధవారం జరిగాయి. ఈ వేడకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న గజల్ శ్రీనివాస్ పైవిధంగా మాట్లాడారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ కోర్సు పూర్తిచేసుకుని వెళ్తున్న విద్యార్థులు నైపుణ్యాలు నేర్చు కోవాలని సూచించారు. వాటిద్వారానే జీవితంలో కోరుకున్న విధంగా లక్ష్యాన్ని సాధించుకోవచ్చున న్నారు. ఏఎన్‌యు విద్యార్థులకు అమరావతి రాజధానిలో అపార



ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మార్పులను స్వాగతించి తదనుగుణంగా స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు వర్సిటీకి అంబాసిడర్లుగా ఉండాలన్నారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలవైపు వెళ్లాలన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం విద్యార్థులు వర్సిటీ సౌకర్యాలపై, వసతులపై నలుగురికి చెప్పాలన్నారు. వార్షికోత్సవ వేడుకల కన్వీనర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు వేడుకల నివేదికను వెల్లడించారు. ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎం.సురేష్‌కుమార్, ఆచార్య పాల్‌కుమార్, ఆచార్య తేజోమూర్తి, ఆచార్య కె.వి.నిరుపమలు కళాశాలల నివేదికలు సమర్పించారు. ఓఎస్‌డి ఆచార్య రవికుమార్ వర్సిటీలోని వసతులను వివరించగా, ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత మంగళ్ సింగ్ చాంపియ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జానపద కళాకారులు దామోదర గణపతిరావు పాటలతో అలరించారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత చెరుకూరి సత్యన్నారాయణ సేవలను కొనియాడారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక, కళా రంగాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

# కల్పవృక్ష వాహనం పై భక్తులకు దర్శనమిచ్చిన దేవ దేవుడు

**పొన్నూరు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** శ్రీ సాక్షి భావదేవుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజైన బుధవారం ఉదయం స్వామివారికి విశేష అర్చనలు, హోమాలు, అభిషేకాలు జరిగాయి. రాత్రికి ప్రత్యేకంగా 'సప్తఋషిపూజ' జరిపారు. బృగు, అత్రి, కశ్యప, క్రతు,పులహ, పులహస్త్య, భరద్వాజులు అయిన సప్తఋషులను పూజించి వారిని స్వామివారికి జరగబోవు కళ్యాణోత్సవానికి ఆహ్వానించడం ఈ సప్తఋషి పూజలోని అంతరార్థం. తర్వాత స్వామివారిని శ్రీకృష్ణుని అలంకరణలో పొన్నవృక్షవాహనం (కల్పవృక్షవాహనం)పై స్వర్ణపురి పురవీధుల్లో భక్తులకు దర్శనార్థం ఊరేగించారు. కల్పవృక్ష వాహనానికి ముందు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణ స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. సమస్త కామితార్థములను తీర్చేది కల్పవృక్షం. భక్తుడు తన సర్వస్వము





భగవంతుడేనని విశ్వసించి ఇహ,పరమైన మమకారములను వదిలేసి ఆ భగవంతుని శరణు వేడడం తద్వారా ఆయన కృపాకటాక్ష వీక్షణములను పొందడం ఈ పొన్నవృక్షవాహనం యొక్క విశిష్టత. లీలామానుష విగ్రహుడైన కృష్ణుని అలకంరణలో భావదేవుడు భక్తులకు కనువిందు చేశాడు. ఈ కార్యక్రమంలో యాజ్ఞీకస్వామి ఎన్.ఎస్.కె.ఆర్.భట్టాచార్యులు (రాంబాబు), అర్చకులు గోవర్ధనం రామకృష్ణ, రొంపిచర్ల గౌతమ్ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, కాట్రగడ్డ రామచంద్రరావు, గుడివాడ పవన్, కూరాకుల సత్యనారాయణ, ధరణికోట పద్మావతి, ఆకురాతి అనూరాధ, ఊటుకూరి బాజి శిరీష, సింహాద్రి వెంకటలక్ష్మి, పరాశరం రంగవల్లి, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొన్నూరు బాలగంగాధర తిలక్ పాల్గొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

# ఉచిత 30 రోజుల ప్రాథమిక ఉర్దూ ఆన్ లైన్ లైన్ కోచింగ్ తరగతులు

## ఇంటర్మీడియట్ బోర్డు ఉర్దూ ప్రత్యేక అధికారి షేక్ నాగూర్ భాష



**గుంటూరు విద్య ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఉర్దూ భాషను నేర్చుకోవాలనుకునే విద్యార్థులు, యువత మరియు ఆసక్తి గల ప్రతి ఒక్కరికీ శుభవార్త అని 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం తీసుకొని రెండవ భాషగా ఉర్దూను ఎంపిక చేసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు ఉర్దూ ప్రత్యేక అధికారి షేక్ నాగురు భాష తెలిపారు 2026 మే 1వ తేదీ నుండి 30 రోజుల పాటు ప్రాథమిక ఉర్దూ కోచింగ్ తరగతులు పూర్తిగా ఉచితంగా నిర్వహించబడనున్నాయనీ, ఈ కోచింగ్ ఆన్‌లైన్ అందుబాటులో ఉంటుంది.ఈ కోచింగ్ ద్వారా ఉర్దూ భాషలో చదవడం, రాయడం, మాట్లాడడం వంటి ప్రాథమిక అంశాలు సులభంగా బోధించబడతాయి.ఉర్దూ మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. ఈ భాషను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు విద్యా మరియు ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయి.ఇంటర్మీడియట్ స్థాయిలో ఉర్దూను చదవడం ద్వారా విద్యార్థులు తమ మాతృభాషను పరిరక్షించుకోవడంతో పాటు ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాలలో కూడా ముందుకు సాగగలరు.ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని షేక్ నాగూర్‌వలి నిర్వహిస్తున్నారు.ఆసక్తి గల వారు వెంటనే నమోదు చేసుకోవచ్చునని షేక్ నాగూర్‌వలిసెల్: 9885139827 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు.అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు.

# పట్టణంలో మున్సిపల్ కమిషనర్ విస్తృత పర్యటన

## అభివృద్ధిపనులపై స్వీయ పరిశీలన

**తెనాలి మున్సిపాలిటీ,ఏప్రిల్29,(ప్రభాతవార్త):** తెనాలి మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు బుధవారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు.ఉదయాన్నే పట్టణంలోని చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ ను సందర్శించారు. పాఠశాలల్లోని తరగతి గదులు, ప్రాంగణాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 34వ వార్డులో గల భవన నిర్మాణ వ్యర్థాల కేంద్రాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులను ఆరా తీశారు. 33వ వార్డులో గల పురపాలక సంఘ నిరాశ్రయుల వసతి గృహాన్ని పరిశీలించి, అక్కడ మెరుగైన సేవలు అందించుటకు వీలుగా మరమ్మత్తుల అంచనాలు తయారుచేసి , వసతి గృహాన్ని వాడుకలలోకి తీసుకురావాలని అసిస్టెంట్ ఇంజనీర్ ను ఆదేశించారు.. ఆ ప్రాంతంలో జరుగుతున్న హోమ్ కంపోస్ట్ వివరాలను, తడి చెత్త పొడి చెత్త సేకరణను నగదీపికలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో తెనాలి పురపాలక సంఘం ప్రథమస్థానంలో ఉండే విధంగా అందరూ కృషి చేయాలని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ కు సంబంధించి సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఎక్కువ స్థాయిలో చేయించాలని సూచించారు.శానిటేషన్ కమ్యూనిటి టాయిలెట్ల నిర్వహణ,కంపోస్ట్ యార్డ్ నిర్వహణ వంటి వివిధ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కమీషనర్ వెంట ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ దార రాజేష్,శానిటరీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.



బుధవారం మధ్యాహ్నం, పట్టణంలోని రామలింగేశ్వర పేట శివారు,పూలే కాలనీ సమీపం లోగల జంపని కాలువలో జెసిబి ద్వారా జరుగుతున్న కాలువ పూడిక తీత పనులను పరిశీలించారు. కాలువ లో ఉన్న చెత్త ఇతర వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని సిబ్బందికి సూచించారు. కాలువ అంచులను కూడా శుభ్రం చేయాలని కాలువలో చెత్త ఇతర వ్యర్థాలు రాకుండా, ఇంటి వద్దనే పూర్తి స్థాయిలో చెత్త ను సేకరించే విధంగా చూడాలని చెప్పారు. కాలువ లో ఉన్న సిల్ట్ కూడా పూర్తిగా తొలగించాలని సిబ్బందికి సూచించారు.కమీషనర్ వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరావు, ఇంచార్జ్ ఏఈ భాష,పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నారై అకాడమీ నూతన కమిటీ ఎన్నిక

## అధ్యక్షునిగా సురేంద్ర బి. ఆవుల

**మంగళగిరి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** న్నారై అకాడమీ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక బుధవారం ఘనంగా జరిగింది. ఈ ఎన్నికల్లో అకాడమీ అధ్యక్షుడిగా సురేంద్ర బి. ఆవుల ఎన్నికవ్వగా, ఉపాధ్యక్షుడిగా




రామకృష్ణ రావు పిన్నమనేని బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శిగా సోము కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా మణి అక్కినేని, కోశాధికారిగా కె. బాపిరెడ్డి, సంయుక్త కోశాధికారిగా జితేంద్ర కాట్నేని నియమితులయ్యారు. వీరితో పాటు ఈసీ సభ్యులుగా సుమతి ముక్కామల, కృష్ణ ప్రసాద్ సూరపనేని, నందిపాటి తిరుపతి రావు ఎన్నికయ్యారు. అకాడమీ అభివృద్ధికి, విద్య, వైద్య సేవల విస్తరణకు ఈ నూతన కమిటీ అంకితభావంతో పనిచేస్తుందని సభ్యులు ఆకాంక్షించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారు మాట్లాడుతూ సంస్థ ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గానికి అకాడమీ ప్రతినిధులు మరియు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రేపటి నుండి జనగణను పక్కాగా నిర్వహించాలి

## -తహశీల్దార్ కళ్యాం శ్రీనివాసశర్మ

**పొన్నూరు, ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** ఒకటో తేదీ నుంచి జనగణన సిబ్బంది ఇంటింటికి వెళ్ళి అన్ని కుటుంబాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని తహశీల్దార్ కళ్యాం శ్రీనివాసశర్మ ఆదేశించారు. స్థానిక



తహశీల్దార్ కార్యాలయంలో జన గణన సిబ్బందికి అందుకు సంబంధించిన సామాగ్రిని అందజేశారు. మొట్టమొదటి సారిగా డిజిటల్ పద్ధతిలో జన గణన జరుగుతుందన్నారు. సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పక్కాగా నూరుశాతం జన గణన నమోదు చేయాలన్నారు. స్వీయగణ చేసిన ఇండ్లకు సంబంధించి ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి జనగణన పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఊహారాణి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పెరుగు శ్రీనివాసరావు తదితరులున్నారు.

# ప్రతి గ్రామం స్వచ్ఛతకు మారుపేరుగా నిలవాలి : డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** మండలంలోని ప్రతి గ్రామం స్వచ్ఛతకు మారుపేరుగా నిలవాలని ఎంపీడీవో రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం



ప్రజా ఉద్యమంగా స్వచ్ఛ పదం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో లు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాలు, మండల ప్రధాన కేంద్రాలు, హైవేల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలనే సత్సంకల్పంతో స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రత్యేకంగా మండలం నుంచి వెళ్లే కనెక్టివిటీ రోడ్లు, ప్రతి పల్లెలోని ప్రధాన రహదారులు, హైవేలకు అనుసంధాన మార్గాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం స్వచ్ఛతకు మారుపేరుగా నిలవాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి బుధవారం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని ఇతర అధికారులను, శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు సమన్వయంతో పనిచేసి పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమం వల్ల గ్రామాల్లో పరిశుభ్రత పెరిగి ప్రజా ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ప్లాస్టిక్ వంటి కాలుష్య కారక వ్యర్థాల పునర్వినియోగం జరుగుతుందని, పరిశుభ్రమైన మరియు సుందరమైన గ్రామాలు తయారవుతాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు, ప్రభుత్వ స్థలాలు మరియు పబ్లిక్ ప్రదేశాలను శుభ్రం చేయడంపై ప్రత్యేక దృష్టి పెడతారని తెలియజేశారు. గ్రామాల్లోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రం చేయడం మరియు పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తమ ఇళ్లల్లోని పొడి చెత్త ప్లాస్టిక్, కాగితం, గాజు, ఇతర వ్యర్థాలను స్వచ్ఛ రధానికి ఇస్తే దానికి బదులుగా నిత్యవసర సరుకులు అందించే వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టి నిర్వహిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయితీ, సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు, కూటమి ప్రభుత్వ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ హత్యకు నిరసనగా డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేత

మంగళగిరి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త చిత్తూరు జిల్లా వీకోట ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యను ఖండిస్తూ, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, మంగళగిరి ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ అంకారావు కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల భద్రత కోసం రక్షణ చట్టాన్ని తీసుకు రావాలని డిమాండ్ చేశారు. విలేకరి జగన్మోహన్ రెడ్డిని హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఆయన కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ కార్యదర్శి బత్తుల సాంబశివరావు, సహాయ కార్యదర్శి మెడ కాయల మస్తాన్ రావు, చదలవాడ సాయి చంద్, మంగళగిరి ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు ఎం సిరిబాబు, కార్యవర్గ సభ్యులు ఇంధనం నాగరాజు, అన్వర్ ఖాన్, మర్రెడ్డి శివ నాగిరెడ్డి, కట్టెపోగు నారాయణ, ఆరేపల్లి రాజు, శివరాత్రి శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ 10వ తరగతి 2026 ఫలితాలలో భాష్యం హైదరాబాద్ విజయభేరి

**గుంటూరు విద్య ఏప్రిల్ 29,ప్రభాతవార్త :** తెలంగాణ 10వ తరగతి 2026 ఫలితాలలో భాష్యం విద్యార్థినీ, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారని భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తెలిపారు. బుధవారం ఎస్.ఆర్.నగర్ లోని భాష్యం క్యాంపస్ లో ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో సాకేత్ రామ్ మాట్లాడుతూ తెలంగాణ 10 ఫలితాలలో భాష్యం హైదరాబాద్ విద్యార్థులు పి.శృతి, ఆర్.గుణసాయి శరణ్ రెడ్డిలు 600కి 595 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వి.ఎస్.ఎన్.శరజ 594, కె.ఎల్.డి.వి. అనూరాధ 594, కె.హనీషా 594, డి.గగన హంస 593, యు.వి.లిఖిత్ 593, ఆరోహి శర్మ 593 వంటి మార్కులతో పాటు 580 ఆ పైగా మార్కులను 203 మంది, 570 ఆ పైగా 434, 550 ఆ పైగా 974, 500 ఆ పైగా 1934 మంది విద్యార్థులు సాధించారన్నారు. భాష్యం విద్యార్థులు 520 మార్కుల యావరేజ్ ను సాధించి భాష్యం విద్యాసంస్థలకు గర్వకారణంగా నిలిచారన్నారు. మ్యాథ్స్ 90 ఆపైగా సాధించిన విద్యార్థులు 1500, సైన్స్ లో 90 ఆపైగా సాధించిన విద్యార్థులు 1331 మంది అని తెలిపారు. విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఇలాంటి




అద్భుత విజయాలు సాధించడం జరిగిందన్నారు. విద్యా విధానంలో సమగ్ర ప్రణాళికలతో భాష్యం జైత్రయాత్ర ఇలాగే కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, హైదరాబాద్ సీఈఓ చైతన్యలు అభినందించారు. కార్యక్రమంలో హైదరాబాద్ భాష్యం జోనల్ హెడ్స్ బి.అంకమ్మరావు, శిరీష, మార్కండేయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

# సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన తెదేపా నేతలు

**తెనాలి ఏప్రిల్29(ప్రభాతవార్త):** మానవత్వమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించిన కూటమి ప్రభుత్వం.



తెనాలి పట్టణానికి చెందిన నల్లూరి అనిల్ వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి ,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి లెటర్ అఫ్ క్రెడిట్ నుంచి రూ. 3,49,269/ మంజూరైంది.ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి బుధవారం,బాధిత కుటుంబసభ్యులకు 3,49,269/ ల చెక్కును, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు.ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్,మల్లవరపు విజయ్,సయ్యద్ షావుల్,కనికరం యోగేష్, కన్నయ్య,ముళ్ళపూడి వెంకట్,సిల్వర్ జిలానీ,భాగ్యరాజు,రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసి విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే జిపిఏటి పరీక్ష పై అవగాహనా సదస్సు


**గుంటూరు విద్య ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం నిర్వహించే



జిపిఏటి పరీక్ష ప్రాధాన్యతను గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన హైదరాబాద్ లోని ఈఎస్ ఫార్మా ఎడ్యుకేషన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్. ఉమా శంకర్ మాట్లాడుతూ జీపాట్ పరీక్ష పాఠ్య ప్రణాళిక, పరీక్ష సమయం, విషయం ఉత్తీర్ణతకు సాధించవలసిన మార్కులు తదితర వివరాలను వివరించి విద్యార్థులకు తెలియచేశారు. జిపిఏటి లో ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎన్ ఐ పి ఈఆర్ విద్యా సంస్థలలో వారు కోరిన శాఖలో సీట్లు, నెలకు రూ.12,400 ఉపకార వేతనం లభిస్తుందన్నారు. తర్వాత జాతీయ స్థాయిలో ఉన్నత ఉపాధి అవకాశాలు లభిస్తాయి అన్నారు. ఆ సంస్థ అకడమిక్ డైరెక్టర్ జ్యోతిశ్రీ మాట్లాడుతూ తన సంస్థలో శిక్షణ తీసుకొని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లో ఉపాధి పొందిన విద్యార్థుల వివరాలను తెలియచేశారు. ఈ సందర్భంగా కళాశాల పాలకమండలి ఛైర్మన్ జూపూడి రంగరాజు , కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదన రావు అతిధులకు తమ అభినందనలను తెలియ చేశారు. ఈ కార్యక్రమం లో బి. ఫార్మసి విద్యార్థులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. ప్రత్యూష, ఫార్మడి డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య , ముగ్గు శంకర భవాని, డాక్టర్ ఎం.శ్రీరేఖ, శ్రీమతి ఎం. బీనాదేవి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనపరుచుకున్న తెనాలి మండల తహశీల్దార్

**తెనాలి,ఏప్రిల్29,(ప్రభాతవార్త):** తెనాలి మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల చెరలో ఉన్న ప్రభుత్వభూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న తెనాలి మండల తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ. వివరాల్లోకి వెళితే తెనాలి మండల రూరల్ గ్రామం జగ్గాడిగుంటపాలెం శివారు చినరావూరు లోని టిడ్కో గృహసముదాయం సమీపంలో పరుచూరి రత్తయ్య అనే రైతు ఆధీనంలో ఉన్న 61 సెంట్లు (వ్యవసాయభూమి)ప్రభుత్వ భూమిని తనాలి మండల తాసిల్దార్ కేవీ.గోపాలకృష్ణ బుధవారం ప్రభుత్వానికి స్వాధీన పరిచారు. సుమారు 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం కొనుగోలు చేసి నిరుపయోగముగా ఉన్న ఈ భూమిని ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకుంటున్న రైతు పరుచూరి రత్తయ్యను తహసిల్దార్ సంప్రదించి తిరిగి ప్రభుత్వానికి చెందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరను అనుసరించి ఈ భూమి విలువ సుమారు 5 కోట్ల రూపాయలు పైగా విలువ కలిగి ఉంటుందని తాహసిల్దార్ పేర్కొన్నారు. అదేవిధంగా చిన్న పరిమి రోడ్డులోని పినపాడు కి చెందిన 2.93 సెంట్లు చెరువు ఆక్రమణలకు గురవ్వగా దానిని కూడా స్వాధీనపరచుకోవటం జరిగిందని,సదరు వ్యక్తి హైకోర్టుకి వెళ్లిన చివరకు ప్రభుత్వానికి ఆ భూమి చెందిందని తాహసిల్దార్ పేర్కొన్నారు. అనంతరం నందివెలుగు గ్రామంలో పర్యటించిన తహసిల్దార్ కెవి. గోపాలకృష్ణ అక్కడ కూడా సుమారు 9 ఎకరాలకు పైగా ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ డొంక భూమిని స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి స్వాధీనపరచుకొనటం జరిగిందని, అందులో నివసిస్తున్న వారిని,ఖాళీ చేయవలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ గోపాలకృష్ణ



మాట్లాడుతూ, మండల పరిధిలోని జగ్గడగుంటపాలెం, నందివెలుగు,పినపాడు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూమిని గుర్తించి ఆక్రమణల చెర నుండి స్వాధీనపరచుకోవటం జరిగిందని,ఆయా స్థలాలను ప్రజాపయోగార్థం ప్రజలకు ఏ విధంగా ఉపయోగించవచ్చునో,స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లి, అందులో పలు కార్యాలయాలు నిర్మించడం ద్వారా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అలాగే ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లయితే స్వచ్ఛందంగా తిరిగి అప్పగించాలని లేనిచో చట్టం తన పని తాను చేసుకుంటుందని ప్రభుత్వం ఏ విధంగానైనా సరే ఆ భూమిని స్వాధీనపరచుకుంటుందని దయచేసి ప్రజలు అర్థం చేసుకొని సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మే 1 నుండి కళాశాలలో ఉచిత వాలీబాల్ శిక్షణ తరగతులు

పెదనందిపాడు ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) స్థానిక పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో మేనేజ్మెంట్ వారి సహకారంతో మే ఒకటో తారీకు నుంచి ఉచిత వాలీబాల్ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య . బుధవారం తెలిపారు . శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు పూర్తి వివరాలను కళాశాల పనివేళలో తెలుసుకోవచ్చు అన్నారు. మండలంలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోపరుచుకోవాలని వారు కోరారు.

# మార్కాపురం వార్త



## సైన్స్ బోధనలో ప్రతిభకు గౌరవం

**- సివి రామన్ పురస్కారాలు అందుకున్న మార్కాపురం ఉపాధ్యాయులు**



**మార్కాపురం, ఏప్రిల్ 29,(ప్రభాతవార్త**

ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ మరియు ప్రొఫెసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో సైన్స్ ఉపాధ్యాయులు, లెక్చరర్లకు ప్రతిష్ఠాత్మక సివి రామన్ ప్రతిభ పురస్కారం అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ లక్ష్మణ రావు (జన విజ్ఞాన వేదిక రాష్ట్రఅధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ) చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా వాసులైన నలుగురు ఉపాధ్యాయులు ఈ గౌరవాన్ని అందుకోవడం విశేషం. పురస్కారం పొందినవారిలో కంభం సిఎల్ఆర్ జూనియర్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ ఏనుగుల రవికుమార్, కంభం సిఎల్ఆర్ డిగ్రీ కళాశాల కంప్యూటర్ లెక్చరర్ గుండాల ముక్తేశ్వరరావు, మార్కాపురం అరవింద సమగ్ర విద్యాకేంద్రం గణిత ఉపాధ్యాయులు కే మల్లికార్జున, కురిచేడు విశ్వభారతి హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయులు సానె తిరుమలయ్య ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సైన్స్ బోధనలో ప్రతిభ కనబరిచి, విద్యార్థులను ప్రోత్సహించడంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తిస్తూ ఈ అవార్డులను ప్రతి సంవత్సరం అందజేస్తున్నారు. సివి రామన్ స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ఈ పురస్కారం ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపుగా నిలుస్తోంది. పురస్కార గ్రహీతలను స్థానికులు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రతి బుధవారం స్వచ్ఛ పథం

**- గ్రామాల శుభ్రతకు కలెక్టర్ ఆదేశాలు**



**మార్కాపురం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

గ్రామాల శుభ్రతను మెరుగుపరచి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ప్రతి బుధవారం తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి స్వచ్ఛ పథం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి, రోడ్లను శుభ్రంగా, అందంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె స్పష్టం చేశారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించి, వివరాలను పీఆర్ వన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవోలు పర్యవేక్షణ నిర్వహించి, కార్యక్రమ పురోగతిని ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. జిల్లా మరియు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డీఎల్డీవో బాలు నాయక్, మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ రావు, పెద్దారవీడు ఎంపిడిఓ జాన్ సుందర్ రావు,, డిప్యూటీ ఎం పిడిఓలు స్వర్ణలత, శ్రీనివాస్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామ ప్రజల ఆరోగ్యానికి అండగా మెగా మెడికల్ క్యాంప్

**- 500 మందికి ఉచిత చికిత్స**



**మార్కాపురం, ఏప్రిల్ 29,(ప్రభాతవార్త**

మార్కాపురం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మార్కాపురం జిల్లా చింతకుంట గ్రామం ఎల్‌బీఎస్ నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (మహిళా విభాగం) సైకం శివకుమారి అధ్యక్షత వహించారు. బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో ఈ క్యాంప్ నిర్వహించడం విశేషం. ఈ మెడికల్ క్యాంప్‌లో సుమారు 500మందికి పైగా గ్రామస్తులు పాల్గొని వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేయించుకొని చికిత్స పొందారు. గుండె, కిడ్నీ, రక్తపోటు (బీపీ), షుగర్, కీళ్ల నొప్పులు వంటి సమస్యలకు నిపుణులైన వైద్యులు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజేవై పథకం కింద ఐదు లక్షల రూపాయల విలువ గల ఉచిత ఆరోగ్య భీమా కార్డులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా బృంద సభ్యులు, ఎల్‌బీఎస్ నగర్ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్



**గిద్దలూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని సబ్ జైల్‌ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ప్రతి ఒక్కరి కేసుల వివరములను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలన్నారు. మద్యం త్రాగి మోటారు వాహనములు నడపటం నేరమన్నారు. బెయిల్ పొందిన వారు, సదరు కేసు పూర్తయ్యే వరకు, ప్రతి వాయిదాకు కోర్టు ముందు హాజరు కావాలన్నారు. సింగిల్ షూరిటీ, అర్హులకు ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. నేరాలు చేయవద్దనని, కుటుంబ సభ్యుల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. ఆవేశం అనర్థదాయకమన్నారు. తదుపరి ఖైదీలకు అందిస్తున్న సదుపాయములను, సరుకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరి చేశారు. ఈ కార్యక్రమంలో జైల్ ఇంచార్జ్ సూపరెండెంట్ రామకృష్ణ, లీగల్ ఎయిడ్ న్యాయవాది బి సంధ్యారాణి పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావు, జైల్ సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

### గాలివాన బీభత్సానికి కూలిపోయిన కోళ్ల ఫారం షెడ్డు

**- దేవనగరం గ్రామంలో రైతుకు భారీ నష్టం**



**గిద్దలూరు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

మండలంలోని దేవనగరం గ్రామంలో ఇటీవల గాలివాన, అకాల వర్షాలు, బలమైన ఈదురు గాలుల కారణంగా తీవ్ర నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన రైతు నెమలియ్య నిర్వహిస్తున్న కోళ్ల ఫారం షెడ్డు గాలివాన తీవ్రతను తట్టుకోలేక ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో షెడ్డు పూర్తిగా నేలమట్టమవడంతోపాటు పైభాగంలో అమర్చిన సోలార్ ప్యానెల్లు ధ్వంసమయ్యాయి. కోళ్ల పెంపకానికి ఉపయోగించే పరికరాలు, ఇతర సామాగ్రి కూడా పనికిరాకుండా పోయాయి. కోళ్ల ఫారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నెమలియ్యకు ఈ ప్రమాదం పెద్ద ఆర్థిక దెబ్బగా మారింది. సుమారు రూ.4 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితుడు వెల్లడించాడు. ఈ నేపథ్యంలో తనను ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణ ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు. ఇటీవల గిద్దలూరు ప్రాంతంలో అకాల వర్షాలు, ఈదురు గాలులు పెరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు, పశుసంవర్ధక రంగాలకు వరుసగా నష్టాలు వాటిల్లుతున్నాయి.

### రాష్ట్ర కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో బుధవారం వైభవంగా జరిగిన నూతన జాతీయ, రాష్ట్ర కార్యవర్గ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో మంత్రులు, సహచర శాసనసభ్యులతో కలిసి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన యువనేత నారా లోకేష్‌కు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఉమామహేశ్వర ఆలయంలో కెమెరాల ఏర్పాటు



**రాచర్ల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

మండలంలోని ఎడవల్లి గ్రామంలోగల శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో రాచర్ల ఎస్ఐ పి కోటేశ్వరరావు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో దుండగులు త్రవ్వకాలు జరపడంతో స్థానికులు సమస్యను ఎస్ఐ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆలయానికి భద్రత గ్రామ ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ఎస్సై గ్రామ ప్రజలను కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు పట్ల గ్రామ ప్రజలు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

## డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్

**- 30 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం**



**వేటపాలెం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

చీరాల డీఎస్పీ పర్యవేక్షణలో చీరాల రూరల్ సీఐ సుధాకర్ యాదవ్ నేతృత్వంలో వేటపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ జబ్బర్ కాలనీలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నేర నియంత్రణలో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో అనుమానస్పద వ్యక్తులు, పాత నేరస్తులు, అద్దె దారుల వివరాలను పోలీసులు సవివరంగా పరిశీలించారు. వాహనాల పత్రాలను తనిఖీ చేసి సరైన ధృవపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి అక్రమ విక్రయాలు, మాదక ద్రవ్యాల కార్యకలాపాలపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భండీ ఎండీ మొయిన్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో కార్డెన్ సెర్చ్ అత్యంత కీలకమన్నారు. ప్రజల సహకారం ఉంటేనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని, అనుమాన స్పద వ్యక్తులు లేదా అనైతిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. చట్టాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, సమాజంలో శాంతి భద్రతలు కాపడడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, వేటపాలెం ఎస్సై జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

### నిశ్చితార్థ వేడుకలలో మంత్రి గొట్టిపాటి



**బల్లికురవ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

నరసరావుపేట పట్టణంలో బుధవారం కడియాల రమేష్‌బాబు కుమార్తె నిశ్చితార్థం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ వేడుకల్లో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, ఉమ్మడి ప్రకాశంజిల్లా ప్రజా ప్రతినిధులు, ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



**సీఎస్‌పురం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

విధి నిర్వహణలో అంగన్‌వాడీ కార్యకర్తలు అలసత్వం వహిస్తే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ వెలిగండ్ల సీడీపీవో షేక్ ఆశాబేగం అన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురం వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రం నందు బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టారన సమావేశం సూపర్‌వైజర్ కే.దేవ కృపావరం అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సీడీపీవో ఆశాబేగం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను ఎండ భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా వారిలో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన పెంచాలన్నారు. అదే విధంగా వారికి వచ్చే పౌష్టికాహారాన్ని సకాలంలో ఇవ్వాలన్నారు. హెల్త్ డిపార్టుమెంట్ వారు అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను సకాలంలో అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేసే ప్రతి పనిని సాంకేతిక పరమైన యాప్‌లో పొందుపరచడం వల్లనే పిల్లల బరువులు, ఎత్తులు క్రమం తప్పకుండా పరిశీలించగలమని తెలియజేశారు. కార్యక్రమంలో సెక్టార్‌సూపర్‌వైజర్ దేవకృపావరం, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధంసామ్యూల్, యాక్టింగ్ సూపర్‌వైజర్ సరళారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### అన్ని దానాలలో రక్తదానం మిన్న

**- రక్తదానం చేయండి రోగులను కాపాడండి**

**- దోర్నాల్లో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన అధికారులు**



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

దోర్నాలలో అధికారులు రక్తదానం చేసి మానవతా విలువలను చాటుతూ ఆదర్శంగా నిలిచారు. మార్కాపురం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో దోర్నాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దోర్నాల మండల తహసీల్దార్, మెజిస్ట్రేట్ సీహెచ్ అశోక్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.లక్ష్మీ ప్రసూనాదేవి నిర్వహణలో రక్తదాన శిబిరం జరిగింది. అత్యవసర పరిస్తితులలో రక్తం అవసరమైన రోగులకు సహాయంగా ముందుకొచ్చిన అధికారులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి మంచి సందేశం అందించారు. మండల తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో టీఎల్ ప్రసూనదేవి, జూనియర్ అసిస్టెంట్ మాలతి, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ సుభాష్ చంద్రబోస్, సంగుబొట్ల శ్రావణకుమార్ శర్మ, వెలిదండ నాగేశ్వరరావు, కే.ఉదయ్, రేవంత్, సుబ్బారావు, శేషు తదితర అధికారులతో పాటు ఈ కార్యక్రమంలోవివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు 20 మంది రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అన్నిదానాల్లోకెల్లా రక్తదానం గొప్పది. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదు. ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వారి సేవాభావాన్ని స్థానిక ప్రజలు అభినందిస్తూ రక్తదానం వంటి మహోన్నత కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను రక్షించవచ్చని, యువత కూడా ఈ తరహా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యంగా ఉన్న యువత ప్రతి మూడు లేదా నాలుగు నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చని, రక్త దానం చేయాల్సిన వారు ఉంటే మార్కాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌లోని బ్లడ్ బ్యాంకుకు రక్తదానం చేయవచ్చని వివరాలకు పి.హబీబ్ ఖాన్(సీహెచ్ఓ దోర్నాల 8374837572), ఎస్.చలపతిరావు (ఎంపీహెచ్ఈఓ మార్కాపురం 9492081140) సంప్రదించాలని కోరారు. ఈ రక్తదాన కార్యక్రమం ద్వారా దోర్నాలలో సేవా స్ఫూర్తి మరింత పెంపొందిందని, ఇలాంటి కార్యక్రమాల్లో సమాజంలో అవగాహన పెంచేందుకు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మనాభరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున నాయుడు, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### వడగండ్ల వర్షం, తీవ్ర ఈదురు గాలులతో అరటి, బొప్పాయి తోటలకు భారీ నష్టం

**- పెద్దబొమ్మలాపురంలో పంటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారి ఆదిరెడ్డి**






**పెద్దదోర్నాల, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

మంగళవారం కురిసిన వడగండ్ల వాన, తీవ్ర ఈదురు గాలుల కారణంగా పెద్దబొమ్మలాపురంలో అరటి, బొప్పాయితోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆకస్మిక ఈ ప్రకృతి విపత్తుతో రైతులు అపార నష్టం చవి చూశారు. గాలుల తీవ్రతకు అరటి చెట్లు నేలకొరిగిపోగా, బొప్పాయి మొక్కలు కూడా విరిగిపడి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఈ నేపథ్యంలో ఉద్యానవన శాఖ అధికారి ఆదిరెడ్డి బుధవారం క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న తోటలను పరిశీలించారు. నష్టపోయిన పంటల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకొని ప్రభుత్వానికి నివేదికను పంపుతానని తెలిపారు. 30 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిలిందని వ్యవసాయ అధికారి డి.జవహర్‌లాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికే పెట్టుబడులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ వర్షం తమనుమరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని వారు కోరారు. ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు ధైర్యం చెప్పి పంటలనష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని, రైతులు అధైర్య పడవద్దని, రైతులను ఆదుకుంటామని అధికారులు భరోసా ఇచ్చారు.

### ఘనంగా స్వామివారి, అమ్మవారి ప్రతిష్ట మహోత్సవాలు





**రాచర్ల, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

మండలంలోని గౌతవరం గ్రామంలో శ్రీ రంగనాయక శ్రీ లక్ష్మి, శ్రీ గణపతి విగ్రహ ప్రతిష్ట, జేపీ చెరువు గ్రామంలో శ్రీ లక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గౌతవరం గ్రామం లో ఆలయ పూజారి మనోహర్ శర్మ, జె పి చెరువు గ్రామంలో పూజారి మంగమ్మ ఆధ్వర్యంలో ప్రతిష్ట కార్యక్రమాలు జరిగాయి. వందలాది మంది భక్తులు ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొని స్వామి అమ్మవార్లకు పూజలు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఆహ్లాదపరిచేందుకు గౌతవరం గ్రామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చింతామణి నాటక ప్రదర్శన నిర్వహించారు.

## ఇంటి వద్దకే సీఎం సహాయనిధి చెక్కులు

**- 13 మందికి రూ.8.12 లక్షల పంపిణీ**



**మార్కాపురం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

మార్కాపురం నియోజకవర్గంలో ఆపన్నహస్తంగా సీఎం సహాయనిధి అందజేత కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి సతీమణి వసంత లక్ష్మి బుధవారం మార్కాపురం పట్టణం మరియు మండలంలోని లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 13 మందికి సీఎం సహాయనిధి కింద రూ.8,12,939 విలువైన చెక్కులు అందజేయడం జరిగింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. చెక్కులు అందుకున్న వారిలో మార్కాపురం పట్టణ మరియు మండలానికి చెందిన తిరుమలరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (రూ.4,09,237), సయ్యద్ హసీనా (రూ.30,500), షేక్ మాబున్ని (రూ.31,278), నూనె వెంకట సత్య శివారెడ్డి (రూ.43,077), బొందిలి రామ్ ప్రసాద్ సింగ్ (రూ.25,437), గోగిరెడ్డి సత్యనారాయణ రెడ్డి (రూ.25,437), కంచర్ల కిరణ్ (రూ.40,000), పిట్టు హేమలత (రూ.31,544), గణపం రామలింగారెడ్డి (రూ.38,795), తడికమండ్ల వెంకటేశ్వర్లు (రూ.26,434), ఏరువా రామిరెడ్డి (రూ.19,000), గోలమారు రంగారెడ్డి - బోడిచెర్ల (రూ.48,376), నారు వెంకటేశ్వర రెడ్డి - తూర్పుపల్లె, గజ్జలకొండ (రూ.43,824) చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా వసంత లక్ష్మి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే స్పందించడం తమ బాధ్యత అని పేర్కొన్నారుస్థానికులు ఈ చర్యను ప్రశంసిస్తూ, ఇళ్ల వద్దకే వచ్చి సహాయం అందజేయడం వల్ల వారికి ఎంతో ఉపశమనం కలిగిందన్నారు.

### బోడపాడులో పిడుగుపాటు బీభత్సం

**- ఇద్దరు మహిళల మృతి, కుటుంబాలకు పరిహారం డిమాండ్**



**మార్కాపురం, ఏప్రిల్ 29,ప్రభాతవార్త**

మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో కురిసిన అకాల వర్షం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పొలాల్లో పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో పిడుగులు, మెరుపులతో కూడిన భారీ వర్షంలో చిక్కుకుని ఒంటేరు పుల్లమ్మ, చింతగుంట్ల కుమారి అనే ఇద్దరు మహిళలుదురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. పిడుగుపాటు తీవ్రతకు మహిళలు అక్కడికక్కడే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు. అకాల వర్షం, పిడుగుల కారణంగా జరిగిన ఈ దుర్ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మరియు కేవీపీఎస్ మార్కాపురం జిల్లా కమిటీ నాయకులు గుమ్మా బాల నాగయ్య, జవాజి రాజు ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అదనంగా మిగిలిన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మార్కాపురం మండల కార్యదర్శి తురక ఏడుకొండలు, పుల్లమ్మ తండ్రి గుమ్మ వెంకటేశ్వర్లు తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అకాల వర్షం కారణంగా రెండు కుటుంబాలు దుఃఖంలో మునిగిపోవడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

### ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పుట్టిన రోజు సంబరాలకు సన్నాహం



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గ స్థాయిలో ఘనంగా జరిపేందుకు వైసీపీ శ్రేణులు సన్నాహాలు మొదలు పెట్టారు. ఈ వేడుకలను మే 1వ తేదీ శుక్రవారం యర్రగొండపాలెం పట్టణంలోని వినుకొండ రోడ్డు నందు గల వైష్ణవి కళ్యాణ మండపం వేదిక కానుంది. తాటిపర్తి చంద్రశేఖర్ సారథ్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఉత్సాహభరితమైన వాతావరణంలో కేక్ కటింగ్, సన్మాన కార్యక్రమం జరుపనున్నారు. ఈ వేడుకలకు నియోజకవర్గంలోని కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొనేలా ఆ గ్రామాల నాయకులు పిలుపునిచ్చారు. ఇప్పటికే పట్టణంలో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. వేలాది మంది కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని నాయకులు చెబుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి గ్రూపులకు అవకాశమేలేదని, ఇక్కడంతా జగన్ గ్రూపు ఎమ్మెల్యే గ్రూపు వైసీపీ పార్టీ మాత్రమే ఉందని పేర్కొన్నారు. మన నాయకుని పుట్టిన రోజు సంబరాలకు యావన్మంది కదలి రావాలని యర్రగొండపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏకులా ముసలారెడ్డి పిలుపునిచ్చారు.

## భార్యభర్తల బలవన్మరణం

**- అనాథగా మిగిలిన 13 నెలల పసికందు**







**వేటపాలెం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

రామన్నపేట గ్రామం రావూరుపేట పరిధిలోని ఆర్యవైశ్య వీధిలో భార్యాభర్తలు ఆత్మహత్యలు సంచలనంగా మారింది. బుధవారం మధ్యాహ్నం మాజేటి ప్రభాకర్(33), పార్వతి(24) ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలు పార్వతి మధ్యాహ్నం 12.30గంటల సమయంలో పక్క ఇంటి వాళ్లకు తమ పాప మాన్వితను చూడమని అప్పగించినట్లు సమాచారం. మృతుడు ప్రభాకర్ ఎంబీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఆత్మహత్యకు పాల్పడడానికి ముందు ప్రభాకర్ అతని సోదరుని మీ సేవ కేంద్రానికి వెళ్లి వచ్చినట్లుగా చెబుతున్నారు. మూడున్నర గంటల సమయంలో సోదరుడు సుధాకర్ ఇంటికి వచ్చి చూడగా ప్రభాకర్ బాత్రూంలో, ప్రభాకర్ భార్య బెడ్ రూమ్‌లో చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి బంధువులకు చెప్పడంతో విషయం బహిర్గతమైంది. సమాచారం తెలుసుకున్న వేటపాలెం పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతులుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదమరిచి నిద్రిస్తున్న 13 నెలల పాప మాన్విత చూసి స్థానికులు కన్నీపర్యంతమయ్యారు.

## విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి



**సీఎస్‌పురం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

విద్యార్థులు మాతృభాషతో పాటు ఆంగ్లంపై కూడా పట్టు సాధించాలని ఇన్‌స్ట్రక్టర్ కే.సంజన, గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు అన్నారు. శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారం ఇన్‌స్ట్రక్టర్ కే.సంజన స్పోకెన్ ఇంగ్లీష్ ఆవశ్యకతను వివరించి మాట్లాడే విధానం వివరించి స్పోకెన్ ఇంగ్లీష్‌పై పట్టు సాధించేందుకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఆంగ్లంపై పట్టు భవిష్యత్తులో ఉన్నత చదువులకు తొలి మెట్టుగా మారుతుందన్నారు. గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నీతి కథలు, తెలుగు పద్యాలు, వ్యాకరణం, గుణింతాలు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్స్ ఇ.అనిత, ఇ.భారతి, కే.సంజన విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్‌దే అధికారం

**పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్**

**దివ్యాంగుల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లు: స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క**

**నిజామాబాద్ కాంగ్రెస్ కార్యాలయ భవన నిర్మాణనికి భూమి పూజ**





నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మహేశ్ గౌడ్, సీతక్క తదితరులు(ఇన్‌సెట్) బ్యాటరీ సైకిళ్ల పంపిణీ చేస్తున్న సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేశ్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేశ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కేసీఆర్ పాలన తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని మహేశ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పోటీ లేదన్నారు. మంచి నమూనాతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు.

రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందని.. ఏడాది కాలంలో 4 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు.

**దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ**

నిజామాబాదు జిల్లా రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో దివ్యాంగులకు ట్రై మోటరైజడ్ స్కూటీలు, బ్యాటరీ సైకిళ్లు, బిజినెస్ ఎంపవర్ కార్లు, బిజినెస్ ఆటోలు, మోటార్ సైకిళ్ళు, ల్యాప్ ట్యాపులు, సహాయ ఉపకరణాలను మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్, ప్రభుత్వం సలహాదారులు షబ్బీర్ అలీ, సుందర్శన్‌రెడ్డి, వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పంపిణీ చేశారు. దాదాపు 140 మంది దివ్యాంగ లబ్దిదారులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. ప్రధానంగా 75 మందికి స్కూటీలు అందజేశారు. మిగిలిన వారికి బ్యాటరీ వీల్ చైర్లు, బిజి నెస్ ఎంపవర్ కార్డులు, ల్యాప్ టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో జీవిం చాలన్న ఏ ... లక్ష యంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ ని చే స్తో ంద ని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి వారి పేరు మీదనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ దివ్యాంగుల ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేకంగా జాబ్ పోర్టల్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంగ వైకల్య నిర్ధారణ ప్రక్రియను మరింత శాస్త్రీయంగా చేసేందుకు అత్యాధునిక పరికరాల కొనుగోలు నిమిత్తం రూ.20 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డితోపాటు నగర మేయర్ ఉమారాణి ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కదులుతున్న రైల్లో అత్యాచారం

- విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో వివాహిత పై లైంగిక దాడి
- బాధితురాలుది పల్నాడు జిల్లా రెంటచింతల
- రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు శేఖర్



**గుంటూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రైలు ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడి పోతున్నారు. ఈ మధ్య బాపట్ల జిల్లా అప్పికట్ల వద్ద దుండగులు రైలు నిలిపి దోపిడీ చేసిన ఘటన మరువక ముందే కదులుతున్న రైల్లో అత్యాచారం జరిగిన మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. పల్నాడు జిల్లా రెంతచింతలకు చెందిన భార్యాభర్తలు గత ఆదివారం విశాఖపట్నం నుండి సొంతూరు రెంతచింతలకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరారు. సీట్లు దొరక్క పోవడంతో జనరల్ బోగీలోని బాత్రూం వద్ద కూర్చున్నారు. రైలు విజయవాడ సమీపానికి చేరుకోగానే ఏసీ బోగీలో బాయ్‌గా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన శేఖర్ దంపతులిద్దరిని ఏసీ బోగీలో ఖాళీ వుంది కూర్చోమని పిలిచాడు. ఇద్దరూ ఏసీ బోగీలోకి వెళ్ళిన తర్వాత భర్త ఫోన్ చూసుకుంటూ బాత్రూం వద్ద నిలబడగా భార్య ఏసీ కుపే లోపలకు వెళ్ళింది. ఇదే అదనుగా నిందితుడు వివాహిత నోరు మూసేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చాక భార్య ముభావంగా ఉండటం గమనించిన భర్త గట్టిగా నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో మంగళవారం రెంటచింతల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయవాడ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడు ఏసీ బోగీలో బాయ్‌గా పనిచేస్తున్న శేఖర్‌గా గుర్తించిన రైల్వే పోలీసులు బుధవారం అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## సమాజంలో జైళ్ల పాత్ర కీలకం

**డిజిపి బి.శివధర్‌రెడ్డి**

**సైదాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** సమాజంలో జైళ్ల శాఖ పాత్ర చాలా కీలకమైనదని డిజిపి బి.శివధర్‌రెడ్డి అన్నారు. చంచల్‌గూడలోని సికాలో బుధవారం ఢిల్లీ జైళ్ల శాఖ సిబ్బందికి ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిజిపి మాట్లాడుతూ జైలు సేవ అనేది కేవలం నాలుగు గోడల మధ్య తాళాలు వేసే పనికాదని, ఖైదీలను సరిదిద్దుతూ వారిని సమాజంలోకి మంచి పౌరులుగా తిరిగి కలిపే బాధ్యత అని అన్నారు. శిక్షణను పొందుతున్న అభ్యర్థులు క్రమశిక్షణ, నిష్పక్షపాతం, వృత్తి పరమైన నైపుణ్యాలను పాటిస్తూ ఖైదీలను గౌరవంతో చూడా లన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర మాట్లాడుతూ ఢిల్లీ జైళ్ల శాఖ డిజి సికాపై నమ్మకం ఉంచి అక్కడి సిబ్బందిని పెద్ద ఎత్తున శిక్షణకు పంపడం గర్వకారణమని అన్నారు. సికా పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలకు ఇది నిదర్శనంగా నిలుస్తుం దన్నారు. సికాలో గతంలో విజయవంతంగా నిర్వహిం చిన శిక్షణ కార్యక్రమాలు, దేశవ్యాప్తంగా పొందిన గుర్తింపును డిజి వివరించారు. ఆధునిక జైలు పరిపాలన సంస్కరణాత్మక, హక్కుల ఆధారిత విధానాలవైపు సాగుతుందన్నారు. ఢిల్లీ జైళ్ల శాఖకు చెందిన మొత్తం 381 మంది ఈ ఏడాది దశలవారీగా సికాలో శిక్షణ పొందనున్నారు. దీనిలో భాగంగా బుధవారం మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. తొమ్మిది నెలల పాటు సికాలో వీరు శిక్షణ పొందుతారు. అంతర్గత శిక్షణలో భాగంగా జైలు అడ్మినిస్ట్రేషన్, క్రిమినాలజి, విక్టిమాలజి, పెనాలజి, సైకా లజి, సోషియాలజి, సోషల్ వర్క్, క్రిమినల్ చట్టాలు, రాజ్యాం గ విలువలు, మానవ హక్కులు, జైలు పరిపాలనలో సాంకేతికతల గురించి వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. బాహ్య శిక్షణ లో భాగంగా శారీరక వ్యాయామం, బిపిఆర్ అండ్ డి ప్రమా ణాల ప్రకారం పరేడ్, యోగా, ద్యానంలో శిక్షణ ఇస్తారు.

## జైలు నుంచి పైలట్ రోహిత్ రెడ్డి విడుదల

**మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్‌పార్టీ కేసు..**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎంఎల్ఎ, బిఆర్ఎస్ నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. రోహిత్ రెడ్డికి హై కోర్టు మంగళవారం నాడు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. గత నెల 14వ తేదీన మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డికి చెందిన ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులు రట్టు చేయడం, ఈ సందర్భంగా రోహిత్ రెడ్డితో పాటు అ తని సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా 12 మందిని పోలీసులు అరెస్టు చేయడం విదితమే. ఇందులో డ్రగ్స్ సేవించిన పరిస్థితుల్లో పోలీసులపై కాల్పులు జరిపినందుకు రోహిత్ రెడ్డి అతని సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ వ్యాపారవేత్త నమిత్ శర్మలను పో లీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అప్పటి నుంచి వీరు జైల్లో వున్నారు. వీరిలో రోహిత్‌రెడ్డి తరపున న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించి బెయిల్ పొందారు. బెయిల్‌కు సంబంధించిన పత్రాలను న్యాయవాదులు బుధవారం జైలు అధికా రులకు ఇచ్చిన తరువాత రోహిత్ రెడ్డిని విడుదల చేశారు. బెయిల్ షరతుల్లో భాగంగా రోహిత్ రెడ్డి పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించడంతో పాటు ప్రతీ బుధవారం నాడు చేవెళ్ల పోలీసుల ఎదుట విచారణకు హాజరు కావాల్సి వుంటుంది.

## కిశోర బాలికలకు 2 నుంచి సమ్మర్ క్యాంపులు

**ప్రతి గ్రామంలో నిర్వహణ**

**మంత్రి సీతక్కకు శ్రీనివాస రామానుజన్ ఉత్తమ సేవా పురస్కారం**



**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** కిశోర బాలికల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడమే లక్ష యంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కిశోర బాలికల (15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు) కోసం స్నేహ సమ్మర్ క్యాంపులను మే 2 నుండి జూన్ 10 వరకు నిర్వహించనున్నారు. బాలికల సమగ్ర అభివృద్ధిని లక్ష యంగా పెట్టుకుని రూపొందించిన ఈ ప్రత్యేక కార్యక్రమం విద్య కొనసాగింపు, ఆరోగ్య పరిరక్షణ, భద్రతపై అవగాహన, జీవన నైపుణ్యాల పెంపు, బాల్య వివాహాల నివారణ వంటి ముఖ్య అంశాలపై దృష్టి సారిస్తుంది.

స్నేహ సమ్మర్ క్యాంపులో భాగంగా ప్రతి రోజుకు ప్రత్యేక థీమ్‌లతో కార్యాచరణ రూపొందించారు.

బాలికల పరస్పర పరిచయం నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలుజజ బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన, ఎనిమియా(రక్తహీనత) తదితర ఆరోగ్య సమస్యలపై చర్చలు, గ్రామస్థాయిలో భద్రతా ప్రణాళికల రూపకల్పన, సామాజిక బాధ్యత పెంపు వంటి అంశాలపై చర్చిస్తాయి. ఆర్థిక నిర్వహణ, క్రీడలు, సైబర్ భద్రత, విద్య ప్రాముఖ్యత, కెరీర్ మార్గదర్శనం, సైక్లింగ్, ఇతర నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్యాంపుల ముగింపు సందర్భంగా గ్రామ స్థాయిలో బాలికల గ్రామసభలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత, విద్య కొనసాగింపు వంటి అంశాలపై తీర్మానాలు చేస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఒక కిశోర బాలికను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. ఈ మేరకు సెర్ప్ సిఇఒ దివ్యా దేవ రాజన్ మార్గదర్శకాలు జారి చేశారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, ఫీల్డ్ స్థాయి సిబ్బంది సక్రమంగా మార్గదర్శకాలను అనుసరించాలని ఆదేశించారు. కాగా.. స్నేహ సమ్మర్ క్యాంపుల ద్వారా బాలికల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించి, సమాజంలో సురక్షి తమైన, సమాన అవకాశాలు కలిగిన వాతావరణాన్ని సృష్టించడమే లక్ష యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సమాజంలో బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగడానికి ఇటువంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలికల భవిష్యత్తును బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష యమని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, విద్య, పోలీస్, పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమశాఖల సమిష్టి కృషితో ఈ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

**మంత్రి సీతక్కకు ఉత్తమ సేవా పురస్కారం..**
**అందజేసిన మాజి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, స్త్రిశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క శ్రీనివాస రామానుజన్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మంత్రి సీతక్కకు పురస్కారాన్ని అందజేశారు. వేలాది మంది విద్యార్థుల సమక్షంలో మంత్రి సీతక్క ఈ గౌరవాన్ని అందుకోవడం విశేషంగా నిలిచింది. ప్రజాసేవలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం మంత్రి సీతక్క అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొని మంత్రి సీతక్క సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడ గౌరవంగా భావిస్తున్నానని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజాసేవలో సుదీర్ఘ అనుభవం కలిగిన వెంకయ్యనాయుడు గారంటే అందరికీ గౌరవమని, ఆయన సూచనలు దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సాధనతోనే విజయాలు సాధ్యమని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కృషి చేయాలని సూచించారు. పదో తరగతితో చదువు ఆపిన తాను తరువాత మళ్లీ విద్యను కొనసాగించి ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎం, పీహెచ్‌డీ పూర్తి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి

## సురేష్ కత్రావత్ ఆత్మహత్యపై సిబిసిఐడిచే విచారణ జరిపించాలి

**పౌర హక్కుల సంఘం డిమాండ్**

**సైఫాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రిలో పిజి విద్యార్థి డాక్టర్ సురేష్ కత్రావత్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సిబిసిఐడిచే విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ సురేష్ కత్రావత్ ఆత్మహత్యకు కారణమైన వారిపైన కఠినంగా చర్యలు తీసుకోవాలని, ఎన్ఎంసి నిబంధనలు వైద్య వృత్తికి ప్రతిబంధకమైతే వాటిని వెంటనే మార్చాలని కోరారు. ఇటీవల తమ సంఘం సభ్యులు ఒక నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి ఉస్మానియా మెడికల్ కాలేజీని సందర్శించి సురేష్ ఆత్మహత్యపై నిజ నిర్ధారణ చేపట్టడం జరిగిందన్నారు. ఎస్టీ రిజర్వేషన్ కోటాలో ఫ్రీ సీటు సంపాదించుకున్న సురేష్ కత్రావత్‌పై సీనియర్స్ పనిభారం పెంచడం, హేళనగా చూడటం వల్లనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి బలమైన కారణం ఆదేనని తామ భావిస్తున్నామన్నారు. ఎన్ఎంసి ద్వారా వచ్చిన పిజి సీటును వదులుకోవడం వల్ల 50 లక్షలు కట్టాలని మూడేళ్ళవరకు పిజికి అర్హుడు కాదనే నిబంధనలు ఒక వైపు కారణమని స్టాఫ్ చెపుతున్నారని వారన్నారు. అతను ఫ్రీ సీటు తెచ్చుకున్నందుకే కొనసాగిన హేళన, వివక్ష, ఒతి డుల మూలంగానే ఆత్మహత్య చేసుకున్నారని తమ సంఘం భావిస్తున్నదన్నారు. ఈ సమావేశంలో సురేష్ తల్లి నాగమణి కత్రావత్, సంఘం నాయకులు పి.శ్యామలరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పశు సంవర్ధకశాఖ ఉద్యోగులుగా గుర్తించండి

**- రాష్ట్ర ప్రభుత్వానికి గోపాలమిత్రల వినతి**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పశుసంవర్ధకశాఖ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని గోపాలమిత్రలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఇలంబర్తికి గోపాలమిత్రల అసోసియేషన్ వినతిపత్రం సమర్పించింది. జివొ 89కి సవరణ చేసి పశు సంవర్ధకశాఖ ఏఐ టెక్నిషియన్‌గా గోపాలమిత్రలను గుర్తించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సింగరాజు, చెరుకు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వెంకన్న కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా దశాబ్దాలుగా 1530 మంది గోపాల మిత్రలు పశుసంవర్ధకశాఖలో సేవలందిస్తున్నా ఇప్పటి వరకు కనీసం వేతనం చెల్లించడం లేదని, కనీసం ఆరోగ్య బీమా సదుపాయం కూడా కల్పించడం లేదని వినతిపత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. చాలిచాలని జీతాలతో గోపాలమిత్రల కుటుంబాలు పూట గడవలేని స్థితిలో ఉన్నాయని విన్నవించారు. విధి నిర్వహణలో చనిపోయిన గోపాలమిత్రల కుటుంబాలను ఆదుకుని కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పెట్రో, డీజిల్ సరఫరాపై పకడ్బందీ నిఘా

**-కొరత లేకుండా ప్రత్యేక చర్యలు**
**-అవసరం లేకున్నా కొనుగోలు చేయొద్దు**
**- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పెట్రోల్ , డిజీల్ సరఫరాపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలు పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఆందోళన చెందవద్దని సూచించారు. రాష్ట్రంలో కావాల్సినంత ఇందనం అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ధరలు పెరుగుతాయనే వదంతుల నేపథ్యంలో ప్రజలు అవసరానికి మించి ఇందనాన్ని నిల్వ చేసుకుంటున్నారని, దాంతో బంకుల వద్ద భారీగా రద్దీ నెలకొంటుందని చెప్పారు. వదంతులను నమ్మి ఆందోళన చెందొద్దని ప్రజలకు సూచించారు. ఆందోళన చెంది అవసరానికి మించి ఎక్కువ ఇందనాన్ని నిల్వ చేసుకోవడం వల్ల పలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు వేలిసినట్లు మంత్రి ఉత్తమ్ చెప్పారు. అయితే పరిస్థితిని చక్కదిద్దుతున్నట్లు తెలిపారు. ఇందన సరఫరాను సాధారణ స్థాయి కంటే 126 శాతం పెంచినట్లు ప్రకటించారు. సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1967ను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా ఉంచామన్నారు. జిల్లాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ అవసరాలకు డీజిల్ సరఫరా చేస్తామని హామి ఇచ్చారు.

## ఉచిత విద్యుత్ డిస్కంకు కొత్త రిక్రూట్ చేయాలి

**ఇప్పటికే సిబ్బంది కొరతతో పంపిణీ సంస్థలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** ఇప్పటికే పదవీ విరమణ, మరణాల కారణంగా సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల నుండి 2 వేల మంది సిబ్బందిని మూడో కొత్త ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీ చేయాలనే నిర్ణయాన్ని ఉద్యోగవర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న వారిలో 1,000 మంది అధికారులు, మరో 1,000 మంది కార్మికులను కొత్తగా ఏర్పాటు చేసిన ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీ చేయడం వల్ల వాటి పరిస్థితి మరింత దిగజార్చుతుందని పలువురు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పంట భూములకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం పరిమిత సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను నడపడం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. మరోపక్క సమన్వయ లోపాల కారణంగా వినియోగదారులకు అసౌకర్యం కలిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రస్తుతం ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలు ఖాళీగా ఉన్న పోస్టులతో సతమతమవుతుండగా, ఇదే సమయంలో కొత్త సబ్‌స్టేషన్లకు ఆపరేటర్లు లేరని, ఇందువల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అంటున్నారు. కొత్త ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు కావాల్సిన అధికారులు, సిబ్బందిని కొత్తగా నియామకం చేపట్టినట్లయితే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఇప్పటికే ఉన్న పంపిణీ సంస్థల్లో కొరత మరింత తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చని స్పష్టం చేస్తున్నారు,



నీటి పారుదల ప్రాజెక్టుల ప్రతిపాదనలను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

**ప్రాణహిత-చేవెళ్ల**

## నిర్మించి తీరుతాం

**ఇప్పటికే డిపిఆర్ కూడా సిద్ధమైంది**

**రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేశామన్నారు. డిపిఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ మేరకు బుధవారం సిఎంతో నీటిపారుదలశాఖ సమీక్షా సమావేశానికి ముందు కీలకమైన నీటి పారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ ఉన్నతాధికారులతో చర్చించారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నామన్నారు. తుమ్మిడి హట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు పరిశీలి స్తున్నామన్నారు. ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా 4 ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలను వచ్చే వర్షాకాలం సీజన్ లోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రతి 1.5 మీటర్ దూరంలో ఎస్పీటీ టెస్టులు, 3 మీటర్ల పెర్మిబులిటీ టెస్టులు జరపనున్నామన్నారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం నియమించిన సమన్వయ కమిటీ సందర్శన టైమ్ లైన్‌ను ఫిక్స్ చేసుకోవాలన్నారు. ప్రతిప్రతిపాదనకు అయ్యే ఖర్చు, అను కూల, ప్రతీ కూలతలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినప్పటికీ రాయి లోపటికి 5 మీటర్లు లోతుగా బోర్లు వెయ్యాలన్నారు. సిడబ్లుపిఆర్ఎస్ డైరెక్టర్ క్షేత్ర స్థాయిలో ఉంటూ పునరుద్ధరణకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. పునరుద్ధరణ కోసం జరుగుతున్న పురోగతి పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్‌డిఎస్‌కు సమగ్రంగా సమాచారం అందించాలని అధికారులకు సూచించారు.

**వ్యవసాయ విశ్వ విద్యాలయంలో**

## హార్టికల్చర్ కోర్సులు వద్దు

**వర్సిటి విద్యార్థుల నిరసన**

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హార్టికల్చర్ కోర్సుల నిర్వహణకు ప్రత్యేకంగా యూనివర్సిటీ ఉండగా అదనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనూ ఉద్యాన కోర్సులకు సీట్లు కేటాయించడం సరైన నిర్ణయం కాదని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. ఈచర్యలతో హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రాముఖ్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజి తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటిలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరంనుంచి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 30 బిఎస్సి హార్టికల్చర్ సీట్లు, 8 ఎంఎస్సి సీట్లు కేటాయించే ప్రతిపాదనలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల అవకాశాలు తగ్గిపోతాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. హార్టికల్చర్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిసముచిత నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో రెసోనెన్స్ అద్భుత ప్రతిభ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 29:** తెలంగాణ ఎస్ఎస్‌సి- 2026 ఫలితాలలో రెసోనెన్స్ స్కూల్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రతి నలుగురిలో ముగ్గురు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా మాదాపూర్ లో ఉన్న ఆశ్రయ కన్వెన్షన్ లో పదో తరగతి ఫలితాల విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు నర్రా మాట్లాడుతూ.. తెలంగాణ ఎస్ఎస్‌సి ఫలితాలు 2026లో మా విద్యార్థులు సాధించిన విజయంపై మాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ముఖ్యంగా ప్రతి నలుగురిలో ముగ్గురు 500 పైగా మార్కులు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇది విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనమన్నారు. తల్లిదండ్రుల విశ్వాసం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. మాధాపూర్, పటాన్‌చెరువులోని క్యాంపస్‌లు గత కొన్ని సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. నగరవ్యాప్తంగా మరింత మందికి అందుబాటులో ఉండేలా మా స్కూల్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తొమ్మిది మంది విద్యార్థులు 580 మార్కులు, అంతకంటే ఎక్కువ సాధించారు. 47 మంది విద్యార్థులు 550 నుంచి 579 మార్కుల మధ్య సాధించారు. 60 మంది విద్యార్థులు 500 నుంచి 549 మార్కుల మధ్య సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 71 శాతం మంది 500కు పైగా మార్కులు సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 93 శాతం మంది 450కు పైగా మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన వారు.. సుష్మితా సింగ్ 587/600, గడ్డే ప్రజ్ఞన్ 586/600,జీ వేద సమ్విత 585/600 కే సహస్ర 585/600, దేవహర్ష్ బమ్మిడి 584/600, ఏ థాన్వి 583/600, కూర రాంసాయి రిషిత్ రెడ్డి 580/600, బండి ఆశ్రిత్ రామ్ 580/600, అన్విత రెడ్డి 580/600.

## బరోడా బ్యాంక్ జోనల్ హెడ్‌గా సుధాకర్ బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి జోనల్ హెడ్‌గా ఎంవీఎస్ సుధాకార్ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని జోనల్ కార్యాలయానికి జనరల్ మేనేజర్‌గా సుధాకర్‌ను నియమించింది. దీంతో ఆయన బుధవారం కార్యకలాపాలను ప్రారంభిచారు. కాగా సుధాకర్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్‌లలో 30 సంవత్సరాలకు పైగా విస్తారమైన బ్యాంకింగ్ అనుభవం ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా నిబంధనల పాటింపుతో కూడిన వ్యాపారం, శాఖల విస్తరణ, డిజిటల్ బ్యాంకింగ్, ఇంకా రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ రంగాలను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా సుధాకర్ తెలిపారు.

## టిజి20 క్రికెట్ లీగ్ లోగో ఆవిష్కణ

**హైదరాబాద్, ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, టిజి20 గవర్నింగ్ కౌన్సిల్ సహకారంతో, తెలంగాణ క్రికెట్ వ్యవస్థను రూపాంతరం చెందించే లక్ష యంతో హెచ్‌సిఏ టిజి20 అనే కీలకమైన లీగ్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈమేరకు బుధవారం పార్కుహయత్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లీగ్ లోగోను తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్, అంబటి రాయుడు, హీరో వెంకటేష్ దగ్గుబాటి, సంగీత దర్శకుడు ఎస్. తమన్, హెచ్.సి.ఏ. సింగిల్ మెంబర్ సూపర్వైజరీ కమిటీ చైర్మన్ న్యాయమూర్తి పి. నవీన్ రావు (విరమణ) అలాగే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అదనంగా బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వర నాథ్, మాజీ బీసీసీఐ అధ్యక్షుడు శివలాల్ యాదవ్, మాజీ అంతర్జాతీయ క్రికెటర్లు, హెచ్.సి.ఏ. అపెక్స్ కౌన్సిల్ సభ్యులు, టిజి20 గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, మాజీ క్రికెటర్లు, ప్రస్తుత హెచ్.సి.ఏ. రంజీ ఆటగాళ్లు హాజరయ్యారు.

# విపక్షాల వికృతరూపం బట్టబయలు

- మహిళా బిల్లు ఓటమికి వారే కారణం
- యుపి అభివృద్ధికి గంగా ఎక్స్‌ప్రెస్ వే జీవనాడి
- రూ. 36,230 కోట్ల గంగా ఎక్స్‌ప్రెస్ వే జాతికి అంకితం
- హర్దోయ్ బహిరంగసభలో ప్రధాని మోడీ



బుధవారం హర్దోయ్ బహిరంగసభలో అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ, మంత్రులు

**హర్దోయ్, ఏప్రిల్ 29:** ఆధునిక ప్రగతి సాధిస్తున్న ఈ యుగంలో, గంగామాత సమీపంలో వెళ్లే ఈ ప్రాజెక్ట్ ఉత్తర ప్రదేశ్ అభివృద్ధికి 'కొత్త జీవనాడి'గా మారుతుందని ఆయన అన్నారు. దేశంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని వివరించారు. రూ.36,230 కోట్లతో నిర్మించిన గంగా ఎక్స్‌ప్రెస్‌వేను బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. అనంతరం హర్దోయ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, "నరసింహస్వామి యొక్క ఈ పవిత్ర భూమికి నేను నమస్కరిస్తున్నాను. ఇక్కడికి కొద్దిదూరంలోనే గంగామాత తన ఆశీస్సులను కురిపిస్తూ ప్రవహిస్తుంది, అందుకే ఈ ప్రాంతమంతా ఒక పుణ్యక్షేత్రం కంటే తక్కువ కాదు. యుపికి ఎక్స్‌ప్రెస్‌వేల వరం కూడా గంగామాత ఆశీస్సుల వల్లే లభించిందని నమ్ముతున్నా. ఇప్పుడు మీరు కేవలం కొన్ని గంటల్లోనే సంగమం చేరుకోవచ్చు. కాశీలోని బాబా ఆశీస్సులు పొందవచ్చు." అని అన్నారు. "మా గంగానది యుపికి, ఈ దేశానికి ఎలా జీవనాధారంగా ఉందో, అదే విధంగా ఈ ఆధునిక ప్రగతి యుగంలో, మా గంగానది సమీపంలోవెళ్లే ఈ ఎక్స్‌ప్రెస్‌వే యుపి అభివృద్ధికి ఒక కొత్త జీవనాధారంగా మారుతుంది," అని ఆయన అన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ (సవరణ) బిల్లు ఓటమిని 'వేడుకగా జరుపుకోవడంపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్ష పార్టీలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటన ప్రతిపక్షాల "నిజస్వరూపాన్ని, వికృత ముఖాన్ని" బట్టబయలు చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. "సమాజ్‌వాదీ పార్టీ కేవలం అభివృద్ధి వ్యతిరేకి మాత్రమే కాదు, మహిళా వ్యతిరేకి కూడా" అని ఆయన అన్నారు. ఇటీవలి రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీల "నిజస్వరూపాన్ని, వికృత ముఖాన్ని" దేశం మరోసారి చూసిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. "కేంద్రంలోని ఎన్‌డియే ప్రభుత్వం పార్లమెంటులో 'నారీశక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు)ను ప్రవేశపెట్టింది. ఈ సవరణ బిల్లు ఆమోదం పొంది ఉంటే, 2029 ఎన్నికల నుంచే రాష్ట్ర శాసనసభల్లోనూ, లోక్‌సభలోనూ మహిళలకు రిజర్వేషన్లు లభించి ఉండేవి" అని ఆయన తెలిపారు. "మన తల్లులు, సోదరీమణులలో గణనీయమైన సంఖ్యలో వారు పార్లమెంటు సభ్యులుగానూ, శాసనసభ్యులుగానూ ఢిల్లీకి, లక్నోకు చేరుకునేవారు. సమాజంలోని ఏ ఇతర వర్గానికి కేటాయించిన సీట్ల సంఖ్యను తగ్గించకుండానే ఈ పరిణామం సాధ్యమయ్యేది. అయినప్పటికీ, సమాజ్‌వాదీ పార్టీ ఈ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసింది" అని ప్రధానమంత్రి అన్నారు. ఉత్తరప్రదేశ్‌కు ఎక్కువ సీట్లు లభిస్తాయని భావించి డిఎంకె వంటి పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయని, ఆ పార్టీల భావనలకు ఎస్‌పి, కాంగ్రెస్ పార్టీలు "మద్దతు" తెలిపాయని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. "కొత్తగా నిర్మించిన ఎక్స్‌ప్రెస్‌వేలు వికసిత్ భారత్‌కు జీవనాధారాలుగా పనిచేస్తాయి. నేడు, ఈ ఆధునిక జీవనాధారాలు భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతున్నాయి," అని ఆయన నొక్కి చెప్పారు.

### గంగామాత ఆశీస్సుల నుంచి ఆధునిక రహదారుల వరకు...

ఉత్తరప్రదేశ్‌లో "పరివర్తనాత్మక" గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి తన దార్శనిక నాయకత్వాన్ని ప్రదర్శించారు. దాదాపు 600 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న, నియంత్రిత ప్రవేశం గల ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ కేవలం ఒక రహదారి మాత్రమే కాదు. ఇది ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రగతి పథంలో దూసుకుపోతున్న తీరుకు ఒక ప్రతీక. ప్రధాని మోడీ నాయకత్వంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి అపూర్వమైన వేగాన్ని, స్థాయిని అందుకుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇంత భారీ ప్రాజెక్టును ఐదేళ్లలోపే పూర్తిచేయడం విశేషం. ఇది ఆయన ప్రభుత్వ సామర్థ్యానికి, నిబద్ధతకు నిదర్శనమని విశ్లేషకులు అంటున్నారు. ఈ వేగమే నిర్ణయాత్మక, ఆశయాలు గల, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న 'నూతన భారతదేశాన్ని' నిర్వచిస్తుంది.

## ప్రాణత్యాగానికైనా సిద్ధం..శత్రువులకు తలొగ్గం!

### యుకెలో ఇరాన్ ఎంబసీ సంచలన పోస్టు


యుకె ఇరాన్ ఎంబసీ

**లండన్, ఏప్రిల్ 29:** యూకేలోని ఇరాన్ రాయబార కార్యాలయం, ఆ దేశంలో నివసిస్తున్న ఇరానీయులను ఉద్దేశించి చేసిన పోస్టు ఉద్రిక్తతలకు తావిచ్చింది. ఇరానీయులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని, దేశాన్ని వారికి అప్పగించే బదులు మనమంతా ప్రాణాలను అర్పిద్దామని యూకేలో నివసిస్తున్న తమ పౌరులకు పిలుపునిచ్చింది. దేశంకోసం ఆత్మబలిదానానికి సిద్ధంగా ఉండాలని, అలాంటివారు తమను సంప్రదించాలని కోరింది. అయితే ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టుపై విమర్శలు వస్తున్నాయి. ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టు అనుచితమైనదని, ఆందోళనకరమైనదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇరాన్ దౌత్య కార్యాలయం చేసిన పోస్టు, ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని యూకే అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టు చేసినందుకు ఆ దేశ రాయబారి సయ్యద్ అలీ మోసావినికి సమన్లు జారీ చేశారు. అయితే ఇరాన్ రాయబార కార్యాలయం తమ పోస్టును సమర్థించుకోవడం గమనార్హం. ఇది దేశభక్తికి, దేశంపై విధేయతకు సంబంధించినదని పేర్కొన్నారు. హింసను ప్రోత్సహిస్తున్నట్లు కాదని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు ఎల్లప్పుడూ తమ మాతృభూమి పరిరక్షణకు ముందుంటారని తెలిపింది. యుద్ధంలో ప్రాణత్యాగానికి తనతో సహా ఇరాన్ పౌరులు సిద్ధంగా ఉండాలని ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## బంగ్లాదేశ్‌లో మహమ్మారిగా మారిన మీజిల్స్!

**ఢాకా, ఏప్రిల్ 29:** బంగ్లాదేశ్‌లో మీజిల్స్ మహమ్మారి తీవ్రరూపం దాల్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా విజృంభించి 250 మందికిపైగా ప్రాణాలను బలిగొంది. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులే ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అత్యంత వేగంగా వ్యాపించే ఈ వైరల్ వ్యాధి సరిహద్దులు దాటి భారత్, మయన్మార్ వంటి దేశాల్లోకి ప్రవేశించే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీచేసింది. భారత్‌లో వ్యాక్సినేషన్ కవరేజ్ బలంగా ఉన్నప్పటికీ, ఏమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదని నిపుణులు హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని 64 జిల్లాలకు 58 జిల్లాల్లో తట్టుకేసులు తీవ్రంగా ఉన్నాయని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. బంగ్లాదేశ్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం నమోదైన కేసుల్లో 91 శాతం ఒకటి నుంచి 14 ఏళ్లలోపు పిల్లలే ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అత్యవసర వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రారంభించినప్పటికీ, వ్యాధి వ్యాప్తి అదుపులోకి రాకపోవడంతో సరిహద్దు దేశాల్లో ఆందోళన నెలకొంది. భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించే షోర్, నవాబ్‌గంజ్ వంటి సరిహద్దు రద్దీ ప్రాంతాలు బంగ్లాదేశ్‌లో ఉండటం, ఢాకా, చట్టోగ్రామ్ వంటి నగరాల నుంచి అంతర్జాతీయ రాక పోకలు ఎక్కువగా ఉండటంవల్ల వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉందని డబ్ల్యూహెచ్‌వో తన నివేదికలో పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ, భారత్‌లో మహమ్మారిగా మారే అవకాశాలు చాలా తక్కువని సీనియర్ వైరాలజిస్ట్, ఇండియా ఎక్స్‌పర్ట్ గ్రూప్ ఆన్ మీజిల్స్ రుబెల్లా కోఛైర్ డాక్టర్ జాకబ్‌జాన్ స్పష్టం చేశారు. 2026 చివరి నాటికి తట్టు, రుబెల్లా నిర్మూలనను భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం మీద భారత్‌లో అధిక వ్యాక్సినేషన్ కవరేజ్ రక్షణ కవచంలా ఉన్నప్పటికీ, పొరుగు దేశంలో పరిస్థితి తీవ్రంగా ఉన్నందున సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను పటిష్ఠం చేసి, అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు సూచిస్తున్నాయి.

# హర్ముజ్ దీర్ఘకాలం దిగ్బంధనం!

### కేబినెట్ సమావేశంలో సమీక్షించిన ట్రంప్


ట్రంప్ హర్ముజ్

**వాషింగ్టన్, ఏప్రిల్ 29:** హర్ముజ్ జలసంధిని సుదీర్ఘకాలం దిగ్బంధించాలన్న ఆలోచనలో ట్రంప్ ఇదే విషయాన్ని ఆయన తన క్యాబినెట్ మిత్రులకు చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్‌తో వార్ మూడో నెలలోకి ప్రవేశించింది. ఈ నేపథ్యంలో ఆ దేశంపై ఆర్థిక వత్తిడి తెచ్చే ఆలోచనలో అమెరికా ఉన్నది. ప్రభుత్వంలోని ముఖ్య, సన్నిహిత వ్యక్తులతో ట్రంప్ చర్చించారని, ఇరానీ ఇంధన ఎగుమతిపై ఆంక్షలు పొడిగించేందుకు నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ఆ పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన తన బృందానికి చెప్పినట్లు తెలుస్తోంది. ఇరానీ పోర్టుల దిగ్బంధాన్ని మరింత కాలం పొడిగించాలని భావిస్తున్నట్లు ఆ మీటింగ్‌లో ట్రంప్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే ఇరాన్‌పై బాంబు దాడుల కన్నా.. హోర్ముజ్ జలసంధిని దీర్ఘకాలం దిగ్బంధించడమే తక్కువ రిస్క్‌తో కూడుకున్న అంశమని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా తీసుకున్న నిర్ణయంతో దాదాపు ఇరాన్‌పై సైనిక చర్య ఆగినట్లే అవుతుంది. కానీ ఆ సంక్షోభానికి సంపూర్ణ పరిష్కారం దొరకనట్టు అవుతుంది. హోర్ముజ్ జలసంధిని సుదీర్ఘకాలం దిగ్బంధించడం వల్ల అక్కడ ఉన్న ట్రాఫిక్ సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోనున్నది. ఇరానీ పోర్టుల నుంచి హోర్ముజ్ ద్వారా ప్రయాణిస్తున్న షిప్‌లను అమెరికా అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఇరానీ ఇంధన ఆదాయాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశంతో అమెరికా ఆ చర్యకు పూనుకున్నది. హోర్ముజ్‌లో బ్లాకేడ్‌ను ఎత్తివేయాలని ఇరాన్ కోరుతున్నట్లు ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఆయిల్, గ్యాస్ షిప్‌మెంట్లను ఓపెన్ చేయాలని టెహ్రాన్ కోరుతున్నదన్నారు. అయితే హోర్ముజ్ అంశంలో అమెరికాతో ఇరాన్ తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయి.


బిజినెస్‌మేన్

## మహిళను ఢీకొట్టాడని బిజినెస్‌మాన్‌పై దాడి


### ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి

**వారణాసి, ఏప్రిల్ 29:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఒక సాధారణ రోడ్డు ప్రమాదం హింసాత్మకంగా మారింది. ఒక వ్యాపారి ప్రాణాలను బలితీసుకున్నది. కారుతో ఒక మహిళను ఢీకొట్టాడన్న ఆగ్రహంతో స్థానికులు మూకదాడికి పాల్పడి 38 ఏళ్ల వ్యాపారిని కొట్టి చంపారు. ఈ అమానుష ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మనీశ్ కుమార్‌సింగ్ అనే వ్యాపారి ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కారులో ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కారు రోడ్డు పక్కన నడుస్తున్న ఒక మహిళను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన మహిళను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత అక్కడి పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహంతో ఊగిపోయిన స్థానికులు మనీశ్ కుమార్‌ను కారులో నుంచి బయటకు లాగి అత్యంత కిరాతకంగా దాడిచేశారు. తీవ్ర గాయాలపాలైన అతడిని బెనారస్ హిందూ యూనివర్సిటీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనపై గోమతి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) నీతూ కద్యాన్ మాట్లాడుతూ రాత్రి ఫ్యాక్టరీ నుంచి ఇంటికి వస్తుండగా మనీశ్ సింగ్ కారు ఒక మహిళను ఢీకొట్టింది. ఈ ఘటన తర్వాత పరిస్థితి ఉద్రిక్తంగా మారి, స్థానికుల దాడిలో మరణించాడని చెప్పారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఫూల్పూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో 8 మంది పేర్లను చేర్చగా మరో ఏడుగురిని గుర్తు తెలియని వ్యక్తులుగా పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటివరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారని, మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలుచేపట్టినట్లు డీసీపీ తెలిపారు.

## హనీమూన్ హత్యకేసులో సోనమ్‌కు బెయిల్

### పోలీసుల తప్పిదం వల్లే నిందితురాలికి బెయిల్





**షిల్లాంగ్, ఏప్రిల్ 29:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలి గా ఉన్న సోనమ్ రఘువంశీకి బెయిల్ మంజు రైంది. ఆమెకు బెయిల్ మంజూరు కావడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నిందితు రాలికి బెయిల్ మంజూరు కావడానికి గల కారణం ఏమిటో తాజాగా బయటకు వచ్చింది. నిందితు రాలి అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం కారణంగానే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తెలుస్తోంది. దీనిపై మృతుడు రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) ప్రకారం హత్యకు సంబంధించి నిందితులపై 103(1), 238(ఏ), 309(6) సెక్షన్‌లను విధించాలి. కానీ ఈ హనీమూన్ హత్య కేసుకు సంబంధించి సోనమ్ అరెస్టు ఎఫ్ఐఆర్‌లో సెక్షన్ 403(1) అని నమోదు చేశారు. బీఎన్ఎస్‌లో ఇలాంటి సెక్షనే లేకపోవడం గమనార్హం. సాంకేతిక తప్పిదంవల్ల ఇలా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అరెస్టు మెమోలోనే కాకుండా కేసుకు సంబంధించిన అన్ని పత్రాల్లోనూ ఇదే సెక్షన్ ప్రస్తావించడాన్ని షిల్లాంగ్ కోర్టు గుర్తించింది. దీంతో సాంకేతిక తప్పిదమని పోలీసులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ క్రమంలో సోనమ్ అరెస్టుకి సరైన కారణాలు లేవని పేర్కొంది. అదేవిధంగా సోనమ్‌ను అరెస్టు చేసి తొలిసారి ఘాజీపుర్‌లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు వెల్లడించింది. ఈ కారణంతోనే సోనమ్ మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేకపోయిందని కోర్టు గుర్తించింది. ఈ తప్పిదాలే నిందితురాలికి అనుకూలంగా మారాయి. ఇదే సమయంలో విహాన్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యానా 2025 కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రూ. 50వేల వ్యక్తిగత పూచీకత్తుపై సోనమ్‌కు షిల్లాంగ్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అనుమతి లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదని షరతు విధించింది.

### విద్యుత్ కుంభకోణంపై సిబిఐ దర్యాప్తుకు హైకోర్టు ఆదేశం

**చెన్నై, ఏప్రిల్ 29:** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో జరిగిన 397 కోట్ల కుంభకోణం గురించి దర్యాప్తు చేపట్టాలని మద్రాసు హైకోర్టు బుధవారం సీబీఐని ఆదేశించింది. విద్యుత్తు శాఖ మంత్రిగా వీ సెంథిల్‌బాలాజీ ఉన్న సమయంలో ఈ స్కామ్ జరిగింది. అయితే దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని, సీబీఐకి అన్ని రికార్డులు, డాక్యుమెంట్లను అందజేయాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొన్నది. కేసు విచారణకు సిట్ వేయాలని అరప్పోర్ ఇయ్యక్కమ్ పిటీషన్ వేశారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు జరగాలని అన్నాడీఎంకే అడ్వకేట్లు డిమాండ్ చేశారు. 2021 నుంచి 2023 వరకు విద్యుత్‌మంత్రిగా సెంథిల్‌బాలాజీ ఉన్నారు. ఆ సమయంలో 45 వేల ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేశారు. కానీ 397 కోట్ల నష్టం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ స్కామ్ గురించి దర్యాప్తు చేపట్టాలని మద్రాసు హైకోర్టు సీబీఐని కోరింది. చీఫ్ జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఈ కేసులో ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర సర్కారు అన్ని రకాలుగా సీబీఐకి సహ కరించాలని తన ఆదేశాల్లో కోర్టు స్పష్టంచేసింది. ఇన్వెస్టిగేషన్ ఇంచార్జ్ ఆఫీసర్‌కు అన్ని ఫైళ్లను ట్రాన్స్‌ఫర్ చేయాలని డీవీఏసీని కోర్టు ఆదేశించింది.

## వర్చువల్ విచారణలో పోర్న్ విడియోలు హల్‌చల్

### విచారణ నిలిపివేసిన హైకోర్టు న్యాయమూర్తి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** ఢిల్లీ హైకోర్టులో షాకింగ్ ఘటన చోటుచేసుకున్నది. వర్చువల్‌గా వాదనలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా అశ్లీల వీడియో ప్లే అయ్యింది. చీఫ్ జస్టిస్ కోర్టురూమ్‌లోనే ఈ ఘటన చోటుచేసుకున్నది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వింటున్న సమయంలో ఈ ఘటన జరిగింది. పలుమార్లు వీడియో కాన్ఫరెన్స్ మధ్యలో పోర్న్ వీడియో ప్లే అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పట్ల కోర్టు న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వర్చువల్ కోర్టు వాదనలను నిలిపివేశారు.

వర్చువల్ హియరింగ్ జరుగుతున్న సమయంలో రెండుసార్లు ఈ సమస్య ఎదురైనట్లు తెలిసింది. రెండుసార్లు అభ్యంతరకర పోర్న్ కాంటెంట్ ప్లే అయినట్లు చెప్పారు. అయితే వర్చువల్ ప్రోసీడింగ్స్‌ను కొనసాగించేందుకు వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను షట్‌డౌన్‌చేసి మళ్లీ స్టార్ట్ చేశారు. తొలిసారి సమస్య రాగానే సిస్టమ్‌ను రీస్టార్ట్ చేశారు. కాసేపు బాగానే వీడియో కాన్ఫరెన్స్ వాదనలు జరిగాయి. అయితే మళ్లీ పోర్న్ ప్లే కావడంతో వీసీ సిస్టమ్‌ను పూర్తిగా షట్‌డౌన్ చేశారు. పోర్న్ వీడియో ప్లే అవుతున్న సమయంలో మీ సిస్టమ్ హ్యాక్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అయితే హ్యాక్ అయిన విషయాన్ని ఆటోమెటిక్ వాయిస్ ద్వారా కూడా వినిపించినట్లు చెబుతున్నారు. దీంతో ఢిల్లీ హైకోర్టు వీడియో కాన్ఫరెన్స్‌లో సైబర్ అటాక్ జరిగినట్లు పుకార్లు వ్యాపించాయి. నిందిత వ్యక్తి వీసీ స్క్రీన్‌ను షేర్ చేసుకుని, పోర్న్ వీడియోలు ప్లే చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. శ్రీధర్ సర్నాబాత్, షిట్‌జీత్ సింగ్ అకౌంట్ల నుంచి ఆ వీడియోలు ప్లే అయినట్లు అనుమానిస్తున్నారు.

# వాణిజ్యప్రయోజనాలకు ఓపెన్ ఎఐ ఆసక్తి

### ఓక్‌ల్యాండ్ కోర్టులో టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ఆరోపణలు




మస్క్ ఓపెన్ ఎఐ

**ఓక్‌ల్యాండ్ (యుఎస్ఎ), ఏప్రిల్ 29:** ప్రముఖ కృత్రిమ మేధస్సు సంస్థ ఓపెన్‌ఏఐ, సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌పై టెస్లా, ఎక్స్‌ఏఐ సీఈవో ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓపెన్‌ఏఐ తన వ్యవస్థాపక లాభాపేక్ష రహిత లక్ష్యాన్ని విడిచిపెట్టి, పూర్తిగా వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాలోని ఓక్‌లాండ్ ఫెడరల్‌కోర్టులో జరుగుతున్న ఈ కీలక విచారణలో మస్క్ తన వాంగ్మూలాన్ని వినిపించారు. మానవాళి ప్రయోజనాల కోసం సురక్షితమైన ఏఐని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఓపెన్ ఏఐ ప్రారంభమైందని, అది ఇతర టెక్ దిగ్గజాలతో పోటీపడుతూ లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తోందని మస్క్ తన వాదనలో పేర్కొన్నారు. సంస్థ ప్రారంభ దశలో తాను ఆర్థికంగా మద్దతు ఇచ్చింది, అది ఒక లాభాపేక్ష రహిత సంస్థగా, పారదర్శకంగా ఉంటుందనే నమ్మకంతోనే అని ఆయన స్పష్టం చేశారు. ఒక స్వచ్ఛంద సంస్థను దోచుకోవడం సరైందేనని కోర్టు తీర్పు ఇస్తే, అది అమెరికాలోని దాతృత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ భద్రతపై గూగుల్ పెద్దగా దృష్టి పెట్టడం లేదనే భావనతోనే తాను ఓపెన్‌ఏఐ ఏర్పాటులో పాలుపంచుకున్నట్లు వివరించారు. సంస్థ ప్రారంభంలో ప్రతిభావంతులను నియమించుకోవడంలో, ఇతర టెక్ భాగస్వాములతో సంబంధాలు నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని మస్క్ కోర్టుకు తెలిపారు. మరోవైపు ఓపెన్‌ఏఐ ఈ ఆరోపణలను ఖండించింది. అధునాతన ఏఐ పరిశోధనలకు అయ్యే భారీ ఖర్చులను భరించడానికే పరిమితలాభాల నమూనాకు మారాల్సి వచ్చిందని వివరించింది. సంస్థపై తుది నియంత్రణ ఇప్పటికీ లాభాపేక్ష రహితవిభాగం చేతిలోనే ఉందని స్పష్టం చేసింది. 2015లో ఓపెన్‌ఏఐ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న మస్క్, 2018లో సంస్థ నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాతే ఓపెన్‌ఏఐ వాణిజ్య విభాగాన్ని ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల నుంచి భారీగా పెట్టుబడులు ఆకర్షించింది. చాట్‌జీపీటీ విజయంతో ప్రపంచ ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిచింది. ఓపెన్‌ఏఐతో విభేదించిన తర్వాత మస్క్ సొంతంగా మరో ఏఐ సంస్థను ప్రారంభించారు. ఈ కేసులో తనకు ఎలాంటి ఆర్థిక పరిహారం అవసరం లేదని, ఓపెన్‌ఏఐలో కేవలం వ్యవస్థాగత మార్పులనే కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

# ట్రంప్ చిత్రం, సంతకంతో అమెరికా పాస్‌పోర్టులు



ట్రంప్ పాస్‌పోర్టు

**వాషింగ్టన్, ఏప్రిల్ 29:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరో అసాధారణ నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ప్రభుత్వ సంస్థలపై తనదైన ముద్ర వేస్తున్న ఆయన, ఇప్పుడు అమెరికన్ పాస్‌పోర్టులపైనా తన ఫొటో, సంతకాన్ని ముద్రించనున్నారు. ఈ చర్యతో దశాబ్దాలుగా పాటిస్తున్న ఓ సంప్రదాయానికి తెరదించినట్టయింది. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక పాస్‌పోర్టులను విడుదల చేయనున్నట్టు యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ధ్రువీకరించింది. ఈ కొత్త పాస్‌పోర్టు లోపలి పేజీల్లో రెండు చిత్రాలు ఉంటాయి. ఒక చిత్రంలో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన పత్రంపై ట్రంప్ అధికారిక ఫొటో, దాని కింద బంగారు రంగులో ఆయన సంతకం ఉంటాయి. రెండో చిత్రంలో అమెరికా జాతిపితల చారిత్రక పెయింటింగ్ ఉంటుంది. జులైలో అమెరికా 250వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని పరిమిత సంఖ్యలో ఈ ప్రత్యేక పాస్‌పోర్టులను విడుదల చేస్తున్నట్టు స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి టామీ పిగోట్ తెలిపారు. ఈ లిమిటెడ్ ఎడిషన్ పాస్‌పోర్టులను అదనపు రుసుము లేకుండా కేవలం వాషింగ్టన్‌లో మాత్రమే అందుబాటులో ఉంచుతామని, స్టాక్ ఉన్నంతవరకే ఇవి లభిస్తాయని ఓ అధికారి వెల్లడించారు. ప్రజాస్వామ్య దేశాల్లో అధికారంలోఉన్న నేతల చిత్రాలను పాస్‌పోర్టులపై ముద్రించడం అత్యంత అరుదు. చాలా దేశాలు తమ చారిత్రక ప్రదేశాలు, ప్రకృతి సౌందర్యం లేదా జాతీయ చిహ్నాలను ఉపయోగిస్తాయి. ప్రస్తుత అమెరికా పాస్‌పోర్టుల్లో కూడా స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, చంద్రుడిపై కాలు మోపిన చారిత్రక ఘట్టం వంటి చిత్రాలు ఉన్నాయి. గతేడాది అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ట్రంప్ ప్రభుత్వ సంస్థలపై తన వ్యక్తిగత ముద్రవేస్తున్నారు. రాజధానిలోని పలు ప్రభుత్వ భవనాలపై ఆయన బ్యానర్లు ఏర్పాటు చేశారు. కెన్నడీ సెంటర్‌కు కూడా ఆయన పేరును జోడించారు. గత నెలలో డాలర్ నోట్లపై ట్రంప్ సంతకం కూడా ముద్రించనున్నట్టు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకటించడం సంచలనంగా మారింది.



## సిఎస్ కుమార్తె నిశ్చితార్థానికి సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) జి. సాయిప్రసాద్ ఇంట జరిగిన శుభకార్యానికి బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. సాయిప్రసాద్ కుమార్తె త్రిలోక్య పావని, ప్రభాస్‌ల నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న సిఎం, 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జి. సాయిప్రసాద్, ఈ ఏడాది ఫిబ్రవరి చివరిలో ఎపి ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమం ఇవాళ జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు హజరయ్యారు. నిశ్చితార్థం అనంతరం కాబోయే వధువు, వరుడికి సిఎం పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

# ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వినూత్న పథకం

- పకడ్బందీగా వ్యక్తుల డిసీజ్ ప్రొఫైల్స్ రూపకల్పన
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రోగాల ముందస్తు నివారణ చర్యలకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు సమగ్ర వైద్య పరీక్షలు చేపడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలు దిశగా వైద్యారోగ్య శాఖ ప్రధాన నిర్ణయాన్ని తీసుకుంది. 104 సంచార వైద్య వాహనాల ద్వారా సాలీనా రూ.162.72కోట్ల వ్యయంతో గుర్తించిన ప్రతి వ్యక్తికి 47రకాల వైద్య పరీక్షలు చేపట్టే పథకానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఆమోదం తెలిపారు. ఎన్‌సిడి సర్వేలో వివిధ జబ్బుల పాలైన లేదా అవకాశమున్న వారిగా గుర్తించిన వారితోపాటు సంక్షేమ విద్యా వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులతో కలపి ఏడాదికి 56లక్షల 40వేల మందికి ఒక్కొక్కరికి 47రకాల పరీక్షలు చేస్తారు.

**కొత్త పుంతలు తొక్కనున్న 104సేవలు:** ఇప్పటివరకు 104సంచార వైద్య వాహనాల ద్వారా గ్రామస్థాయిలో 15రోజులకోకసారి 6రకాల పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి. అవి ర్యాండమ్ బ్లడ్ షుగర్, యూరిన్ షుగర్, హిమగ్లోబిన్, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణకు ర్యాపిడ్ డయోగ్నస్టిక్ టెస్ట్, యూరిన్ అల్బుమిన్, గర్భధారణ నిర్ధారణకు మూత్ర పరీక్ష. ఇవి కూడా ఎక్కువ భాగం అంతగా ఖచ్చితమైన ఫలితాలివ్వని ర్యాపిడ్ కిట్స్ ద్వారా జరుగుతున్నాయి. దీంతోపాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో వ్యక్తుల డిసీజ్ ప్రొఫెల్స్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల తయారీ కావడంలేదు. దీనికి భిన్నంగా నూతన 104సేవల అమల్లో భాగంగా 11అంశాలకు సంబంధించి గుర్తించిన ప్రతి వ్యక్తికి మొత్తం 47రకాల పరీక్షలు జరుగుతాయి. వీటి వివరాలు కాలేయ సంబంధిత పరీక్షలు-8, మూత్ర విశ్లేషణ-6, కొవ్వు సంబంధిత పరీక్షలు-5, తెల్లరక్తకణాల కౌంట్ -5,ఎర్ర రక్త కణాల కౌంట్-5,ఎలక్ట్రోలైట్ పరీక్షలు-4, మూత్ర పిండాల పరీక్షలు-3, గ్లూకోజ్ పరీక్షలు-3, కోయాగ్యులేషన్ పరీక్షలు-2, ఇఎస్ఆర్-1 తో పాటు 5ఇతర పరీక్షలు.

**ప్రయోజనం:** ఈ సమగ్ర వైద్య పరీక్షల ఫలితాల



ఆధారంగా పౌరుల ఆరోగ్య స్థితికి సంబంధించి వ్యక్తిగత స్థాయిలో డిసీజ్ ప్రొఫైల్స్ మరియు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను రూపొందించి సంజీవని పథకం కింద ఆయా వ్యక్తులకు ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముమ్ముందు రోగాల నివారణకు చేపట్టాల్సిన విషయాలపై తగు సూచనలు అందించడం జరుగుతుంది. ఈ మేరకు ఈ సమగ్ర వైద్య పరీక్షల ప్రారంభం రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణ దిశగా ఎంతో ప్రాముఖ్యమైన చర్య అని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు.

**సత్వర ప్రారంభించాలి:** విస్తృత ప్రయోజనాల లక్ష్యంగా రూపొందించిన ఈ పథకాన్ని అతి త్వరలో ప్రారంభించడానికి తగు చర్యలు చేపట్టాల్సిందిగా శాఖా ఉన్నతాధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. రెండు నెలల్లో ఈ సేవల్ని ప్రారంభించడానికి కృషి చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు.



## తిరుమలలో సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్ వివాహం

**తిరుమల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో బుధవారం రాత్రి తెలుగు సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్ వివాహం వేడుకగా జరిగింది. యువనటుడు బెల్లంకొండ శ్రీనివాస్ తన ప్రేయసి కావ్య రెడ్డిని పెళ్లి చేసుకుని ఓ ఇంటివాడు అయ్యాడు. కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. కావ్యరెడ్డి మెడలో మూడుముళ్ళు వేశారు. పలువురు అధికారులు, సినీ ప్రముఖులు, అగ్రగణ/్యలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. బెల్లంకొండ శ్రీనివాస్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. మే 1న హైదరాబాద్లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు.

## క్రమశిక్షణ, నిబద్ధత గల నేత లోకేష్

- తెలుగుదేశం పార్టీ నాకు పుట్టినిల్లు, జీవితాంతం పార్టీకి రుణపడి ఉంటా: మంత్రి అనిత



**విజయవాడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హోం మంత్రి అనిత హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. లోకేష్ క్రమశిక్షణ, నిబద్ధతతో పాటు కార్యకర్తలపై ప్రేమాభి మానాలు కలిగిన నాయకుడని ఆమె పేర్కొన్నారు. యువగళం తో మొదలై, నవగళంగా విస్తరించి పార్టీ శ్రేణుల్లో చైతన్యాన్ని రగిల్చిందని, కార్యకర్తలను సైనికులుగా తీర్చిదిద్దిన తెలుగుదేశం సేనాని అని కొనియాడారు. మహిళలు, యువతకు పార్టీలో పెద్దపీట వేస్తూ,యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో లోకేష్ ముందున్నారని తెలిపారు. 44 సంవత్సరాల క్రితం పార్టీ ఉన్న విలువలను కొనసాగిస్తూ అదే దిశలో ముందుకు నడిపిస్తున్న యువ నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి లోకేష్ కృషి చేస్తున్నారని, తెలుగు జాతి ఉన్నంతవరకు పార్టీ కొనసాగుతుందన్నారు.

ఇదే సందర్భంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాస్‌కు, పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. తనకు రెండోసారి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు తన జీవితంలో అత్యంత సంతోషకరమైన రోజుగా పేర్కొన్న ఆమె, తెలుగుదేశం పార్టీ తనకు పుట్టినిల్లు వంటిదని తెలిపారు. ఇలాంటి ఉన్నతమైన పదవి దక్కడం తనకు అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొంటూ, జీవితాంతం పార్టీకి రుణపడి ఉంటానని అన్నారు. పార్టీ మరింత బలోపేతం కావడానికి తన వంతు కృషి చేస్తానని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

## తెలుగు అకాడమీ నిధులు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయాలి

### సిఎం రేవంత్‌కు విల్సన్ విజ్ఞాపన

**గుంటూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కి రావాల్సిన తెలుగు అకాడమీ నిధులు కోర్టు ఆదేశాలు వున్నా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వలేదని ఎపి తెలుగు అకాడమీ చైర్మన్ విల్సన్ అన్నారు. తెలంగాణ అకాడమీ నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎఫ్‌డీల తాలూకు వడ్డీ, స్థిర చర ఆస్తుల, వాహనాల పంపిణీ జరగలేదని అన్నారు. ఉమ్మడిగా ముద్రించిన పుస్తకాలు, పర్నీచర్ కూడా పంపిణీ జరగలేదని అన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంకు లోనవుతున్నదన్నారు. అదే సమయంలో అకాడమీ నుండి వేసే ఇంటర్ ఫ్రీ బుక్ బకాయిలు ప్రస్తుత సంవత్సరంకు కలుపు కొని రూ.50 కోట్ల పై చిలుకు రావాలి అన్నారు. ఈ విషయమై సమగ్ర శిక్షా పిడిని కలిసి కూడా మాట్లాడమని, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులు కేశవ్‌కు కూడా లేఖ రాశామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిధులు విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని విల్సన్ విజ్ఞప్తి చేశారు. బకాయిలు పేరుకు పోతే అకాడమీ అస్థిత్వమే దెబ్బతింటుంది అన్నారు.

తమిళనాడు తరహాలో ఆంధ్రప్రదేశ్‌కు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఈ మేరకు విద్యా శాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేస్తున్నాం అన్నారు. తెలుగు భాషను ధ్వంసం చేసిన గత ప్రభుత్వంలో కూడా తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌కి కేబినెట్ క్యాడర్ ఇచ్చినప్పుడు ప్రస్తుత ప్రభుత్వం కూడా కేబినెట్ క్యాడర్ ఇస్తే తెలుగు భాషకు సముచిత ప్రాధాన్యత ఇచ్చినట్టు అవుతుందన్నారు. ప్రయివేటు విద్యా సంస్థలు ఈ ఏడాదైనా అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేసేలా తమ విద్యార్థులకు ఆదేశాలు ఇవ్వాలని విల్సన్ కోరారు. తెలుగు అకాడమి భవన నిర్మాణానికి రూ.15 కోట్లు నిధులు కేటాయించామని అన్నారు. అకాడమీలో 13 పోస్టులు సత్వరం భర్తీ చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు.

# టిడిపిలోనే బిసిలకు పెద్దపీట

- మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు
- 102 ప్రాజెక్టులను ఆపేసింది వైసిపినే: పరిటాల శ్రీరామ్
- ఏటా రూ.15 వేల కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుదే: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**అంతపురం క్రైమ్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** బిసిలకు అన్ని విధాల అభివృద్ధి చేసే పెద్దపీట వేసింది టిడిపి ప్రభుత్వమేనని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పష్టం చేశారు. బుధవారం రోడ్డు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో బిసిలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది టిడిపినేనన్నారు. పార్టీ పరంగా, అధికారికంగా అయినా బిసిలకు పెద్దపీట వేసింది టిడిపియేనన్నారు. అధికారంలో ఉండగా వైసిపి నాయకులను పూర్తిగా విస్మరించారని ఇప్పుడు రాయలసీమపై ప్రేమ ఉన్నట్టుగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంత పురంలో జరిగిన సమావేశంలో 15నిమిషాలు కూడా జనం లేరు. అందులో పుట్టపర్తిలోని ఇళ్లనే రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించా రన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సరైన అనుమతులు డిపిఆర్‌లు లేకుండా ప్రారంభించారన్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కేసులు వేస్త 2021లోనే ఆగిపోయిందన్నారన్నారు. దీనిపై సరైన కౌంటర్ కూడా వేయలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఆగిపోయినట్టు ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో ప్రాజెక్టుల కోసం ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు కోసం ఎంత ఖర్చు చేశారన్నారు. దీనిపై చర్చించడానికి ఎక్కడైనా సిద్ధమన్నారు. పోలవరం నుంచి హంద్రీ-నీవా వరకు ఏ ప్రాజెక్టు గురించి చర్చించడానికైనా సిద్ధమన్నారు.



ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడటానికి వైసిపికి కనీస అర్హత లేదు. రాయలసీమ గురించి మాట్లాడే అర్హత అంతకన్నా లేదు. 356జీఓ రాష్ట్ర వ్యాప్తంగా 102ప్రాజెక్టులను అర్ధాంతరంగా ఆపేసింది వైసిపినన్నారు. ఇద్దరు సిఎంలు మాట్లాడారని, ఈ రోజు యాగీ చేస్తున్నారు. అప్పుడు 102ప్రాజెక్టుల గురించి మాట్లాడి ఉంటే.. మీకు విలువ ఉండేదన్నారు. ఇప్పుడు చంద్రబాబు మీద బురద జల్లాలని చూస్తున్నారు. పేరూరు, బిటిపి, జిల్లేడుబండ ప్రాజెక్టులను ఆపేశారనన్నారు. టిడిపి హయాంలో గ్రావిటీతోనే చాలా చెరువులకు నీరిచ్చాం. మీ ఐదేళ్ల పాలనలో కనీసం వాటిని పట్టించుకోకుండా బద్ధకించారు. మీరు ఇలానే వ్యవహరిస్తే ప్రజలు, రైతులు పరిగెత్తించి కొడుతారన్నారని పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు.

పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఏ ప్రాజెక్టును కూడా వైసిపి పట్టించుకోలేదన్నారు. కనీసం నిర్వహణ, మరమ్మతులు కూడా సరిగా చేయలేక నష్టం చేకూర్చారని ఆరోపించారు. ఏ ప్రాజెక్టు అయినా ప్రారంభించింది ఎన్టీఆరే నని, అయితే పూర్తి చేసింది చంద్రబాబు మాత్రమేనన్నారు. ప్రతి బడ్జెట్ లో 14 నుంచి 15వేల కోట్లు చంద్రబాబు కేటాయించారన్నారు. ఈ రెండేళ్లలో 8వేల కోట్లు కేటాయించారన్నారు. కృష్ణాజలాల మాకు వద్దని లేఖ రాసింది ఎవరికో తెలుసనన్నారు. పట్టిసీమ కడితే కృష్ణ, గోదావరి ప్రాంతాల వారిని రెచ్చగొట్టింది జగనేనన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు మరమ్మతు చేయకపోవడం వలన ఎంతో మంది చనిపోయారన్నారు. రాయలసీమ ప్రాజెక్టు వారి హయాంలోనే ఆగిపోతే ఇప్పుడు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## ఆకివీడు రామాలయం పిల్ డిస్మిస్

**విజయవాడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆకివీడు రామాలయంపై దాఖలైన పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్)ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ కోర్టు బుధవారం డిస్మిస్ చేసింది. రామాలయానికి సంబంధించిన అన్ని అనుమతులు తీసుకున్నామని ఆలయ వర్గాలు కోర్టు దృష్టికి తీసుకు వెళ్ళాయి. హైకోర్టులో ఇదే అంశంపై మరో బెంచి వద్ద పిటిషన్ విచారణ పరిధిలో ఉన్నట్లు సమాచారం. న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వేసిన పిల్‌లో అనుమతులు లేవని చేసిన ఆరోపణలను కోర్టు పరిగణనలోకి




తీసుకోరాదని, ఈ కేసులో ఆలయ సమితి తరపున ప్రముఖ సీనియర్ న్యాయవాది వై.వి. రవిప్రసాద్ బలమైన వాదనలు వినిపించారు. ఈ క్రమంలో ఒకే విషయంలో న్యాయస్థానంలో పిటిషన్ విచారణలో ఉన్నందున పిల్‌ను డిస్మిస్ చేస్తామని న్యాయవాది జడ శ్రవణ్ కుమార్‌కు ప్రధాన న్యాయమూర్తి లీసా గిల్ వెల్లడించారు.

## మాజీ మంత్రి అప్పల నరసింహరాజు ఇకలేరు



**విశాఖపట్నం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి అప్పల నరసింహ రాజు కన్నుమూశారు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలోని తన నివాసం లో బుధవారం తెల్లవారు జామున ఆయన కన్నుమూశారు. 82 ఏళ్ల వయసులో అనారోగ్య కారణాలతో ఆయన తుదిశ్వాస విడిచారు. భీమునిపట్నం కోటలో అజేయమైన నాయకుడిగా ఆయనకు పేరుంది. 1985 నుంచి 1999 వరకు వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి, భీమిలి అంటే అప్పల నరసింహరాజు అన్నంతగా గుర్తింపు పొందారు. ఎన్టీఆర్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆయన, నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. క్రమశిక్షణకు మారుపేరుగా, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు విషాదంలో మునిగిపోయాయి. చంద్రబాబుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు ఆయన మరణానికి సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

# 'ఆపరేషన్ స్వర్ణ'కు అడ్డంకులేనా!?

## ఆదిలోనే పడకేసిన ప్రక్షాళన

**తిరుపతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బృందం:** తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మహానగరంలో "హైడ్రా" తరహాలో తిరుపతి జిల్లాలో ప్రధానమైన "స్వర్ణముఖినది" ప్రక్షాళనకు చేపట్టిన "ఆపరేషన్ స్వర్ణ"కు అడుగడుగునా అడ్డంకులేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడ) కార్యాలయంలో చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి అట్టహాసంగా పాకిస్థాన్‌పై భారత్ చేసిన ఆపరేషన్ సింధు తరహాలో స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతాల అభివృద్ధికి ఆపరేషన్ స్వర్ణ ప్రకటించారు. ఈ ఆపరేషన్ గత ఎనిమిదినెలలుగా ఎక్కడవేసిన గొంగడి అన్నట్లు తయారైందనే విమర్శలు ఉన్నాయి. తిరుపతి జిల్లాలో దక్షిణకైలాసంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి కొలువైన పట్టణం వరకు ఈ స్వర్ణముఖీనది విస్తరించింది. తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం చంద్రగిరి నియోజకవర్గంలోని తొండవాడ నుండి శ్రీకాళహస్తి వరకు పవిత్ర స్వర్ణముఖి నది పరిరక్షణకు కొత్త జిఒ తీసుకువచ్చామని అప్పట్లో వెల్లడించారు. అయితే ఈ పనులు ఇప్పటికీ ఎంతవరకు ముందుకు సాగలేదనేది రాజకీయ విశ్లేషకుల వాదన. ఆపరేషన్ స్వర్ణతో స్వర్ణముఖి నదికి పూర్వవైభవం తీసుకువస్తామనేది తొలిరోజుల్లో ఆర్భటంగా ప్రకటన. 130కిలోమీటర్ల పొడవున్న స్వర్ణముఖి వెంబడి భారీగా ఆక్రమణలు జరిగాయని, నదికి ఇరువైపులా భూములు కబ్జాచేసి అమ్మేశారని ఆరోపణలు కూడా లేకపోలేదు. దీంతో తుడ చైర్మన్ దివాకర్ రెడ్డి "ఆపరేషన్




స్వర్ణ" పేరున చేపట్టిన స్వర్ణముఖి ప్రక్షాళన ఆదిలోనే పడకేసిందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనివెనుక రాజకీయ నేతల మోకాలడ్డుకూడా లేకపోలేదనది విమర్శలు. హైడ్రా తరహాలో స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించడానికి ఆయన ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే చంద్రగిరి నియోజక వర్గంలోనే ఈ కార్యక్రమానికి అక్కడి ప్రజాప్రతినిధి అడ్డుపడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తనకు తెలియకుండా తన నియోజక వర్గంలో ఇలాంటి పనులు చేపట్టడం ఏమిటని ఆయన మండిపడుతున్నట్టు తెలిసింది. కళ్యాణి డ్యాం నుంచి రేణిగుంట వరకు ఈ నది చంద్రగిరి నియోజక వర్గంలో పారుతుంది. ఇక్కడ నదీ పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించుకున్న వారు చాలా మంది ఓ పార్టీకి చెందిన నాయకుల బంధువులు, పార్టీ కార్యకర్తలు ఉన్నందున చెడ్డపేరు వస్తుందని ఆయన అంటున్నట్టు తెలిసింది. ఆపరేషన్ స్వర్ణ పేరిట స్వర్ణముఖి ప్రక్షాళన, పరిరక్షణకు ముందుకు వెళ్ళడం కూడా క్లిష్టంగా మారింది. 130 కిలోమీటర్ల పొడవున్న స్వర్ణముఖి నదికి ఇరువైపులా వైసిపి హయాంలో భారీగా భూములు కబ్జాచేసి అమ్మేశారని, చివరకు వంకలు, చెరువులను తప్పుడు పత్రాలతో దోచుకున్నారనేది గత ఏడాది ఆపరేషన్ గురించి వెల్లడించిన సందర్భంలో తెలిపారు. ఈ క్రమంలో నదికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను తొలగించడానికి ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని, స్వర్ణము ఖి బఫర్‌జోన్లలో స్థలాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆరోజు చైర్మన్ స్పష్టంగా వెల్లడించారు. అయితే ఇప్పటికీ స్వర్ణముఖి ప్రక్షాళనకు మాత్రం ముహూర్తం కుదరలేదనది విస్మయం. ఈ నేపథ్యంలో కొందరి స్వార్ధ ప్రయోజనాలతో స్వర్ణముఖి ప్రక్షాళనకు అడ్డు పడుతున్నారని విమర్శిస్తున్నారు. ఇంతకీ ప్రజల నుంచి భారీ స్థాయిలో వసూళ్ల చేయడమే దీనివెనుక ఆంతర్యమా? అనేది కూడా ఆరోపణలు.

## రీజెన్సీ అధినేత జిఎన్ నాయుడు కన్నుమూత



**యానం, ఏప్రిల్ 29 ప్రభాత వార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** యానంలో 1983లో ఇటలీ దేశ సాంకేతిక పరిజ్ఞానం ఉపయో గించి కోట్లాది రూపాయల పెట్టుబడితో రీజెన్సీ సిరా మిక్స్ లిమిటెడ్ పరిశ్రమను స్థాపించిన జిఎన్ నాయుడు (87) హైదరాబాదులోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. రీజెన్సీ పరిశ్రమ స్థాపించి యానంకు ఖండాంతర ఖ్యాతి తీసుకురావడంతో పాటు, యానాంలో పలు విద్యాసంస్థలను స్థాపించి తద్వారా విద్యా సేవలు అందించిన మహా విద్యావేత్త. రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ స్థాపించిన తర్వాత కార్మికుల పిల్లల కోసం రీజెన్సీ పబ్లిక్ స్కూల్, రీజెన్సీ జూనియర్ కళాశాల నెలకొల్పారు. రీజన్సీ ఫ్యాక్టరీ చెంతనే మహిళల ఉపాధి కోసం రిగ్మా అట్టల ఫ్యాక్టరీని స్థాపించారు. వరకట్న దురాచారాన్ని అరికట్టడానికి మహిళా కార్మికులను కట్నం లేకుండా వివాహం చేసుకుంటే ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇచ్చేలా కృషి చేసిన సంస్కరణ వాది డాక్టర్ జి ఎన్ నాయుడు. ఆయన మృతికి బుధవారం యానాంలో పలుచోట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం పలువురు ఘన నివాళులర్పించారు.

# హథీరాంజీ మఠం భూములను కాపాడండి

- రక్షణ కోసం పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయండి
- సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ

**తిరుపతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో వేల కోట్ల విలువైన హథీరాంజీ మఠం భూములు కళ్ల ముందే కరిగిపోతున్నా, అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడు తున్నా అటు ప్రభుత్వం, ఇటు జిల్లా యంత్రాం గం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాం నుంచి నేటి వరకు ఈ ఆస్తుల దోపిడీ నిరంత రాయంగా సాగుతోందని, అధికార యంత్రాంగం ఉదాసీనత వల్లే భూమాఫియా రెచ్చిపోతోందని ఆయన ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం సిఎం చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. వేల కోట్ల రూపాయల విలువైన మఠం భూములు హారతి కర్పూరంలా కరిగిపోతుంటే దేవాదాయ శాఖ కనీసం పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేయాల్సిన మఠం సిబ్బంది, కస్టోడియన్లు కబ్జాదారులకు భయపడి లేదా వారితో చేతులు కలిపి మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. మఠం భూముల్లో కబ్జాదారులు బోర్డులను తొలగించినా పోలీసు లకు ఫిర్యాదు చేసే ధైర్యం మఠం అధికారులకు లేకపోవడం మఠం ఏ స్థాయిలో నిర్వీర్యమైందో స్పష్టం చేస్తోందన్నారు. మఠానికి చెందిన సుమారు రూ.2,562 కోట్ల విలువైన 244 ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు తాము గుర్తిం చామని ఈశ్వరయ్య పేర్కొన్నారు. తుమ్మల గుంటలో దశాబ్దాలుగా రికార్డుల్లో నమోదు కాక పోవడంతో ఇక్కడ అక్రమ నిర్మాణాలు వెలిశా యన్నారు. అవిలాల (చెంచులక్ష్మి కాలనీ)లో 26 ఎకరాలు, 6.56 ఎకరాలు, 36.60 ఎకరాలు కబ్జాలో ఉన్నాయన్నారు.

తిరుచానూరు రోడ్డులో 11 ఎకరాల విలువైన భూమి అన్యాక్రాంతమైం దన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలో 9.89 ఎకరాల భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగు తున్నాయన్నారు. పేరూరులో సర్వే నంబరు 4.46 ఎకరాల భూమి (విలువ రూ.20 కోట్లు) లేఅవుట్ల కోసం చదును చేయబడిందన్నారు. మఠం భూముల నిర్వహణ ఎంత అస్తవ్యస్తంగా ఉందో చెప్పడానికి అవిలాలలోని 2.16 ఎకరాల భూమి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

గత వైసిపి ప్రభుత్వం హయాంలో మఠం భూములను అక్రమార్కులు పంచుకున్నారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అదే తీరు కొనసాగడం దురదృష్టకరమని ఈశ్వరయ్య అన్నారు. 244 ఎకరాల మఠం భూముల్లో సాగుతున్న అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలని.. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ, స్టేటస్ కో పాటించకుండా అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మఠం భూములు ప్రజల ఆస్తి అని, వాటిని కొంతమంది వ్యక్తులు వందల కోట్లు సంపాదించుకోవడానికి వనరుగా మార్చుకోవడాన్ని సిపిఐ సహించబోదని ఈశ్వరయ్య హెచ్చరించారు.

# ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడుగా రావులపల్లి రవీంద్రనాథ్

## ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య ఎన్నిక




**తిరుపతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో మూడురోజులు జరిగిన ఎఐటియుసి 18వ రాష్ట్ర మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ మహాసభల్లో రాష్ట్ర నూతన నాయకత్వాన్ని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు 191 మంది సభ్యులతో రాష్ట్ర సమితిని, 23 మంది ఆఫీస్ బేరర్లను మహాసభ ఎంపిక చేసింది. ఈ మహాసభలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా, కార్మిక గర్జనను తలపించాయి. ఈ నెల 26న ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఇందిరా మైదానం వరకు భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించి, అనంతరం బహిరంగ సభను చేపట్టారు. 27, 28 తేదీల్లో కచ్చపి ఆడిటోరియంలో ప్రతినిధుల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్మిక కళా ఉత్సవాలను ప్రముఖ సినీ నటుడు మాదాల రవి ప్రారంభించి కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపారు. మహాసభలను ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్ ప్రారంభించగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వారు తీవ్రంగా ఎండగట్టారు. కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముందని వారు దిశానిర్దేశం చేశారు.

**కీలక తీర్మానాలు:** రాబోయే మూడు సంవత్సరాల కాలానికి కార్యాచరణను నిర్దేశిస్తూ మహాసభ 43 తీర్మానాలను ఆమోదించింది. "కార్మికుల కనీస వేతనాన్ని రూ.35 వేలుగా నిర్ణయించాలి. కార్మిక చట్టాల రద్దును అడ్డుకోవాలి, కొత్త లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలి. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే ప్రయత్నాలను అడ్డుకోవాలి, 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' పోరాటాన్ని బలోపేతం చేయాలి. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలి, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. రాబోయే మే డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ ర్యాలీలు నిర్వహించి కార్మిక వర్గాన్ని పోరాటాలకు సన్నద్ధం చేయాలి" అని మహాసభ పిలుపునిచ్చింది.



హైకోర్టు న్యాయమూర్తికి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## మే 1న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** మే 1వ తేదీన శుక్రవారం, వైశాఖ పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షణ జరుగుతుందని భక్తులు పాల్గొనాలని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. శుక్రవారం ఉదయం 5:55 గంటలకు శ్రీ కామధేను అమ్మవారి ఆలయం (ఘాట్ రోడ్) వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభించి శ్రీకామధేను అమ్మవారి ఆలయం కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా శ్రీ మల్లిఖార్జున మహా మండపమునకు చేరుకున్నాక అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తామన్నారు.



ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

దుర్గమ్మవారిని నేషనల్ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ రామ సుబ్ర మన్యయన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇఒ వీకే శీనా నాయక్ వారికి దుర్గమ్మ వారి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రం అందించారు. వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల కుటుంబసమేతంగా బుధవారం శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం మరియు శేషవస్త్రాన్ని బహుకరించారు.

## తెలంగాణ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో శ్రీచైతన్య రికార్డు స్థాయి ఫలితాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో శ్రీ చైతన్య రికార్డు స్థాయి ఫలితాలు సాధించిందని యాజమాన్యం ప్రకటించింది. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో, శ్రీచైతన్య స్కూల్ అద్భుతమైన 597 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థుల సంఖ్యను కూడా ఆమె ప్రకటించారు. 580 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 829 మంది, 570 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 2,303 మంది, 560 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 3,954 మంది, 550 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 5,521 మంది అని తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించిన సబ్జెక్టుల వారీ ఏ గ్రేడ్ల సంఖ్య .. ఫస్ట్ లాంగ్వేజ్ ఏ గ్రేడ్లు: 11,302, సెకండ్ లాంగ్వేజ్ ఏ గ్రేడ్లు: 12,380, ఇంగ్లీష్‌లో ఏ గ్రేడ్లు : 13,821, గణితంలో ఏ గ్రేడ్లు: 12,226, సైన్స్‌లో ఏ గ్రేడ్లు: 13,273, సోషల్‌లో ఏ గ్రేడ్లు: 14,737, మొత్తం ఏ గ్రేడ్‌లు : 77,739. గరిష్టంగా 600 మార్కుల్లో శ్రీ చైతన్య స్కూల్ సుమారు సగటు మార్కులు 532 సాధించిందని, మొత్తం ఉత్తీర్ణత శాతం 99.7 శాతంగా నమోదైందని ఆమె తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్‌కి చెందిన 132 బ్రాంచ్‌లు 100 శాతం ఉత్తీర్ణతను సాధించాయని పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా 100/100 మార్కులు సాధించిన వారి సంఖ్య మాథ్స్ 1,647, సోషల్ 357, ఫస్ట్ లాంగ్వేజ్ 259, సెకండ్ లాంగ్వేజ్ 105, వివిధ సబ్జెక్టులలో 2,441 మంది 100/100 మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచ్‌లు ఉన్న మెజారిటీ జిల్లాల్లో, మండలాల్లో, పట్టణాలు/నగరాల్లో శ్రీ చైతన్య స్కూల్ టాప్ మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కూడా ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు 100 లోపు 12 ర్యాంకులు, 1000 లోపు 77 ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో, శ్రీ చైతన్య స్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు 499/500 మార్కులు సాధించారని, మెజారిటీ రాష్ట్రాల్లో టాప్ మార్కులతో పాటు, ఓవరాల్ గా 100 శాతం పాస్ సాధించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంతటి భారీ విజయానికి మరే ఇతర విద్యాసంస్థ కూడా సమీపంలో లేదన్నారు. ఈ గొప్ప విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనా సిబ్బందిని ఆమె అభినందించారు.

## తెలంగాణ ఎస్.ఎస్.సి-2026 ఫలితాల్లో మరోసారి టాప్ మార్క్‌తో చరిత్ర సృష్టించిన నారాయణ!



**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ ఎస్.ఎస్.సి- 2026 ఫలితాల్లో నారాయణ హవా కొనసాగింది. ఎప్పటిలాగే నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో పైచేయి సాధించారు. స్టేట్‌లోనే టాప్ మార్కులతో నారాయణ విద్యార్థి మేథాన్ శ్రీరామ 597 మార్కులతో చరిత్ర సృష్టించాడు. అదేవిధంగా శోభిత కొప్పారపు 596 మార్కులు, మన్నే చంద్రహాస్ 596 మార్కులు, తూముల నిశ్చయ్ ప్రణవ్ 596 మార్కులు, కిలారి లలిత్ 596 వంటి టాప్ మార్కులతో సంపూర్ణ ఆధిపత్యం కొనసాగించారు. అలాగే 595 మార్కులు ఆరుగురు విద్యార్థులు, 594 మార్కులు 8 మంది విద్యార్థులు, 593 మార్కులు 8 మంది విద్యార్థులు, 592 మార్కులు 19 మంది విద్యార్థులు, 591 మార్కులు 30 మంది విద్యార్థులు, 590 మార్కులు 40 మంది విద్యార్థులు సాధించగా, 590 ఆపైన 116 మంది విద్యార్థులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ, పి.శరణి నారాయణ, నారాయణ విద్యాసంస్థల కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ తెలిపారు. మ్యాథ్స్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 7334, సైన్స్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 7558, సోషల్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 8022, ఇంగ్లీష్ సబ్జెక్టులో ఎ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు 7475, ఫస్ట్ లాంగ్వేజ్‌లో ఏ గ్రేడ్లు సాధించిన విద్యార్థులు 6574, సెకండ్ లాంగ్వేజ్‌లో ఎ గ్రేడ్లు సాధించిన విద్యార్థులు 7259 మొత్తంగా ఏ గ్రేడ్‌లు 44222 విద్యార్థులు సాధించినట్లు తెలిపారు.

నారాయణ మొత్తం విద్యార్థుల సగటు మార్కు 530.26గా ఉందన్నారు. తెలంగాణాలో 530.26 సగటు మార్కు సాధించిన ఏకైక విద్యాసంస్థ నారాయణ మాత్రమేనని పేర్కొన్నారు. తెలంగాణలో 8935 మంది విద్యార్థులలో 99.66 శాతం ఉత్తీర్ణతా శాతం సాధింపజేసిన ఘనత ఒక్క నారాయణకే దక్కిందన్నారు. 80 బ్రాంచీలలో 100శాతం పాస్ పర్సంటేజ్ సాధించినట్లు తెలిపారు. అదే సమయంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీపరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను తమ రోజు వారి సిలబస్ భాగంగా బోధించటం ద్వారా నారాయణ విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. నారాయణ సిఒ-స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ ప్రోగ్రామ్స్‌తో బోధన చేయటం కారణంగానే ఘనవిజయాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

# సైకో పార్టీ సినిమాకు శుభం కార్డు వేసేది పసుపు సైన్యమే

### ● తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్



**విజయవాడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో సైకో పార్టీ సినిమాకు శుభం కార్డు వేసేది పసుపు సైన్యమేని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. మీలో ఒకడిని, మీ వాడిని, అన్నగారి కుటుంబంలో అతి చిన్నవాడిని కాబట్టి అంతా కలిసి తెలుగుదేశం పార్టీ కుటుంబ గౌరవాన్ని పెంచుతూ కలసికట్టుగా ముందుకు సాగుదామని నేతలకు లోకేశ్ పిలుపునిచ్చారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని స్పష్టం చేశారు. ఒక్కడిననే అహం లేకుండా కలసికట్టుగా పని చేద్దామని నాయకుల్ని కోరారు. మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార ముగింపు కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆశయాలతో కలసి కట్టుగా పనిచేస్తూ ముందుకు సాగుదామని నాయకులకు పిలుపునిచ్చారు. ఢిల్లీ రాజకీయాలు, గల్లీ రాజకీయాలు రెండూ తెలుగుదేశం పార్టీకి తెలుసని వెల్లడించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండటమే మన బలం అన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడుతూ వారి సమస్యలు తీర్చే బాధ్యత అంతా తీసుకోవాలని సూచించారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినా, చేయాల్సిన పనులు ఇంకా ఉన్నాయనే విషయం గుర్తిద్దామన్నారు. రాష్ట్రంలో ఉన్న సైకో పార్టీ సినిమా విధ్వంసమైతే, తెలుగుదేశం సినిమా అభివృద్ధి అని లోకేశ్ స్పష్టం చేశారు. బెంగుళూరులో ఉంటున్న క్రెడిట్ చోరీ నాయకుడిది ఇక బెంతాహై అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. శిక్షణ తరగతుల్ని ప్రతీ ఒక్కరూ గౌరవించి హాజరు కావాలని లోకేశ్ కోరారు. అలక అనే జబ్బు వీడి సంస్కరణల కోసం కలసి పోరాడదామని పిలుపునిచ్చారు. నమ్మకున్న సిద్ధాంతాల కోసం అహర్నిశలూ కష్టపడాలని హితబోధ చేశారు. నాలుగు గోడల మధ్య ఎంతసేపైనా కూర్చుని ఒకరినొకరం కన్విన్స్ చేసుకుందామని కోరారు. పార్టీ నిర్ణయం తీసుకున్నాక అంతా దానికి కట్టుపడాల్సిందేనని స్పష్టం చేశారు. ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల్లో ఒకే ప్రభుత్వం కొనసాగేలా అమలవుతున్న సక్సెస్ ఫార్ములా ఇక్కడా అమలు కావాలని తేల్చిచెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు, నేతలు లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులందరితోనూ లోకేశ్ ఫొటోలు దిగారు. కార్యక్రమం అనంతరం మహానాడు నిర్వహణపై నేతలతో సమావేశమయ్యారు.

## ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

### ● ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా



**విజయవాడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ఇసుక రవాణాలో అక్రమాలను సహించేదిలేదని ఎన్‌టిఆర్ జిల్లాలో ఇసుక అక్రమరవాణాను అరిట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళివెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్‌శాఖ సహకారంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 9రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, మరో 5రీచ్‌లకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కృష్ణా మునేరు పరిధిలో జగ్గయ్యపేట మండలంలో రెండు, చందర్లపాడు మండలంలో రెండు, కంచికచర్ల మండలంలో 3కొత్తరీచ్‌లకు తిరిగి టెండర్లు పిలిచే ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. పట్టాభూముల్లో మేట వేసిన ఇసుక తొలగింపుకు రైతులకు అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో మైన్స్ డిడి శ్రీనివాస్ కుమార్, ఏడి కె.వీరాస్వామి, డిపిఒ లావణ్యకుమారి, డిటిసి పురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి:** రాష్ట్రంలోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్లు ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు రైజ్ కేంద్రం ద్వారా ఉపాధి అవకాశాలపై శిక్షణనిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు చేతివృత్తులపై శిక్షణనిచ్చి వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించాలని సూచించారు. ఈసందర్బంగా మహిళలు రూపొందించిన పచ్చళ్ళు, బ్యాంగిల్స్, మిల్లెట్ బిస్కెట్లు, కప్‌కేక్స్, పేపర్‌బ్యాగ్స్, ఆర్గానిక్ హెయిర్ ఆయిల్ ప్రదర్శించారు.

## డ్వాక్రా మహిళల జీవనోపాధి కోసం రూ.207.03 కోట్లు మంజూరు

### కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కొండపల్లి

**విజయవాడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని డ్వాక్రామహిళల జీవనోపాధిని మెరుగు పరచేందుకు కేంద్రప్రభుత్వం మొదటి విడతగా రూ.207.03కోట్ల నిధులు మంజూరు చేసింది. స్వయం సహాయకసంఘాల జీవనోపాధిని మెరుగు పరచేందుకు సెర్ప్ ద్వారా దీన్‌దయాళ్ అంత్యోదయా యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పథకాన్ని అమలు చేయటం కోసం కేంద్రం తన వాటాగా ఈమొత్తాన్ని మంజూరు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎన్ఆర్ఎల్ఎం కింద స్వయం సహాయసంఘాలకు మొత్తం రూ.690కోట్లు అందుబాటులోకి రానున్నాయి. కేంద్రం మంజూరు చేసిన నిధులకు 40శాతం రాష్ట్రప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటును కలిపి ఈమొత్తాన్ని విడుదల చేసు_్తంది. కేంద్రం నిధులు మంజూరు చేయటం పట్ల రాష్ట్ర యంఎ స్‌యంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబందాలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేసారు. ఈనిధులు మంజూరుకు సహకరించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్‌ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్బంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈఏడాది రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈనిధులు మహిళల ఆర్థికాభివృద్ధికి వారిని పారిశ్రామికవేత్తలుగా మార్చటానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.



## విద్వేష ప్రసంగాల కట్టడికి కొత్త చట్టాలు అవసరం లేదు

- తాము జోక్యం చేసుకునేంత శూన్యత లేదు
- ప్రస్తుత క్రిమినల్ చట్టాల వ్యవస్థ సరిపోతుంది
- సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:** విద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టడానికి అదనపు ఆదేశాలు జారీ చేయడానికి భారత సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థ సరిపోతుం దని, సమస్య చట్టాలు లేకపోవడంలో కాకుండా వాటిని అమలు చేయడంలో ఉందని పేర్కొంది. విద్వేషపూరిత ప్రసంగాల కేసులపై తమ 2023 ఆదేశాలను పాటించలేదని ఆరోపిస్తూ దాఖలైన ధిక్కార పిటిషన్లను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కొట్టి వేసింది. కొత్త క్రిమినల్ నేరాలను సృష్టించడం పూర్తిగా శాసనసభ పరిధిలోకి వస్తుందని కోర్టు నొక్కి చెప్పింది. రాజ్యాంగ న్యాయస్థానాలు చట్టాలను వ్యాఖ్యానించగలవని, ప్రాథమిక హక్కులను పరిరక్షి ంచగలవని, కానీ అవి చట్టాలను రూపొందించలేవని లేదా కొత్త నిబంధనలను తీసుకు రావాలని పార్లమెంటును, రాష్ట్ర శాసనసభలను బలవంతం చేయలేవని కోర్టు వ్యాఖ్యానించింది. ఇప్పటికే ఉన్న పరిష్కార మార్గాలను ప్రస్తావిస్తూ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్), 2023 కింద ఉన్న చట్టపరమైన యంత్రాంగాలు ఇటువంటి నేరాలను పరిష్కరించడానికి ఇప్పటికే ఒక సమగ్ర వ్యవస్థను అందిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. విచారణార్హమైన నేరాలలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం పోలీసుల విధి అని, చర్య తీసుకోని పక్షంలో బాధితులు ఉన్నతాధికారులను లేదా మేజిస్ట్రేట్‌లను ఆశ్రయించవచ్చని సూచిం చింది. విద్వేషపూరిత ప్రసంగంపై ఎలాంటి శాసనపరమైన శూన్యత లేదని, అమలులో ఉన్న లోపాల వల్లే ఆందోళనలు తలెత్తుతున్నాయని కోర్టు స్పష్టం చేసింది. ఎఫ్ఐఆర్‌ల నమోదు లేదా ప్రాథమిక విచారణల సమయంలో కాకుండా, కేవలం నేరాన్ని పరిగణనలోకి తీసుకునే దశలో మాత్రమే ముందస్తు అనుమతి అవసరాలు వర్తిస్తాయని కూడా అది నొక్కి చెప్పింది. తదుపరి ఆదేశాలు జారీ చేయడానికి నిరాకరిస్తూనే, విద్వేషపూరిత ప్రసంగం సామాజిక సామరస్యం, రాజ్యాం గ విలువలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ధర్మాసనం అంగీకరించింది. మారుతున్న సవాళ్ల దృష్ట్యా అదనపు చట్టపరమైన లేదా విధానపరమైన చర్యలు అవసరమవుతాయేమోనని పరిశీలించాలని అది శాసన అధికార వర్గాలను కోరింది.

## హుబ్లీ-తిరుపతి ప్యాసింజర్ ట్రైన్‌పై మంటలు ఇంజన్ మూడోబాక్స్‌పై మృతదేహం



**రైల్వేకోడూరు రూరల్ (తిరుపతి జిల్లా), ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** హుబ్లీ- తిరుపతి ప్యాసింజర్ ట్రైన్‌పై రైల్వేకోడూరు మండలం అనంతరాజుంపేట స్టేషన్ దాటుకుంటానే మంటలు వచ్చినట్లు ప్రయాణికులు తెలుపుతున్నారు. గుర్తించిన ఇంజన్ డ్రైవర్ ట్రైన్ స్లో చేశాడు. కానీ మబ్బులు ఏమీ కనిపించలేదు. రైల్వేకోడూరు స్టేషన్‌కి వచ్చిన తర్వాత ఆపి చూస్తే ఇంజన్ నుండి మూడో బాక్స్ పైన మనిషి శవం కనిపించింది. ఈ విషయమై ఇంజన్ డ్రైవర్ ఎప్పుడు జరిగిందో మాకు తెలియదని తెలిపారు. రైల్వే కోడూరు రైల్వే స్టేషన్లో సుమారు రైలు గంట పైనే ఆపివేశారు.

## కన్నవారికే నిప్పు పెట్టిన కసాయి కూతురు

### - ఆస్తికోసం అర్ధరాత్రి ఘాతుకం.. చిలకలూరిపేటలో కలకలం



**గుంటూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. ఆస్తిపాస్తుల ముందు పేగు బంధం చిన్నబోతోంది. కన్నవారిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కూతురే.. ఆస్తి కోసం వారు నిద్రిస్తున్న ఇంట్లోనే పెట్రోల్ పోసి నిప్పంటించిన అమానుష ఘటన చిలకలూరిపేట పట్టణంలో సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని గుర్రాలచావిడి ప్రాంతంలో నివసిస్తున్న గౌడిశెట్టి సుకన్యకు ఇద్దరు కుమార్తెలు. అయితే, గత కొంతకాలంగా ఆస్తి విషయంలో తల్లిదండ్రులకు, కుమార్తె గౌడిశెట్టి చంద్రికకు మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆస్తి మొత్తం తనకే చెందాలన్న దురాశతో చంద్రిక కన్నవారని కూడా చూడకుండా అత్యంత దారుణానికి ఒడిగట్టింది. అర్ధరాత్రి అగ్నిప్రమాదం.. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తల్లి సుకన్య, తండ్రి ఇంట్లో నిద్రిస్తుండగా, చంద్రిక ఇంటికి నిప్పు పెట్టింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రాణభయంతో వృద్ధ దంపతులు బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదయ్యింది. అదృష్టవశాత్తూ వారు తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు.

**పోలీసుల రంగప్రవేశం:** స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ అమానుష ఘటనపై స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. "ఆస్తి కోసం కన్నవారిని చంపాలనుకోవడం కలికాలం కాకపోతే మరేమిటి?" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తరుగు పేరిట నిలువు దోపిడి

### అన్నదాతకు తప్పని తిప్పలు
### క్వింటాకు 5 కిలోల దాకా కోత
### ప్రశ్నిస్తే తూకం ఆలస్యం..
### మిల్లుల్లో అన్‌లోడింగ్ కష్టం
### ఎకరాకు క్వింటా పైగా నష్టం
### మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అక్రమ దందా



**హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఆరు గాలం కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకుం దామని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తే మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అక్రమాలు అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి. వడ్లలో తేమ, తాలు, రాళ్లు ఉన్నాయనే సాకుతో క్వింటాల్‌కు 3 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ఒక బస్తాకు 41 కేజీల వడ్లు తూకం వేయాల్సి ఉండగా, 44-45 కేజీల వరకు జోకుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి పక్షం రోజుల వరకు ఆరబెట్టి తేమ 17శాతం వరకు వచ్చాక తూకం వేసే క్రమంలో పాక్షిక నష్టం, గన్నీ బస్తాల బరువు పేరుతో అదనంగా 3 నుంచి 5 కిలోల మేర వడ్లను జోకుతుం డడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసంగానైనా క్వింటాల్‌కు అయిదు కేజీల వరకు తరుగు పేరిట తూకం అంటే ఎకరా ధాన్యం సాగు చేసిన రైతు 20 క్వింటాళ్లు పండించినా ఒక క్వింటా మేర తరుగు కిందనే నష్టపోతున్నాడు. అంటే ఎకరం ధాన్యం సాగు చేసిన రైతుకు క్వింటా ధాన్యంపైగా రూ.3000 వరకు తరుగు పేరిట నష్టపోతున్నాడు. ధాన్యం నాణ్యత లేదని, రంగు మారిందని సాకులు చూపిస్తూ క్వింటాల్‌కు 3 కిలోల వరకు కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఒకబస్తా 41 కిలోల వరకు తూకం వేయాల్సి ఉండగా నిర్వహకులు 44కిలోలకు పైగా తూకం వేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. తూకం అక్రమాలను ప్రశ్నిస్తే కేంద్రాల్లో తూకం వేసి మిల్లులకు చేరిన తరువాత ఆన్‌లోడింగ్ చేయకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంచలేక, ఆకాల వర్షం వస్తే తడిసిపోయే ప్రమాదం ఉండడంతో తప్పని పరిస్థితిలో క్వింటాల్‌కు రెండు నుంచి మూడు కిలోల కోత పెట్టినా ఒప్పుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. లారీలో 600 వరకు బస్తాలు తరలిస్తే కోతలతో మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులకు సుమారుగా రూ.25 వేల వరకు సంపాదించుకున్నట్టు రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. పంట పండించిన రైతు కంటే రైస్ మిల్లర్ల దందా బాగుందని, ఎలాంటి కష్టం లేకుండా లక్షల సంపాదిస్తున్నారని, అధికారుల కనుసన్నలో మిల్లర్లు మోసగిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా సాగు మొదలైనప్పటి నుంచి పంట తీసి మార్కెట్లో అమ్మే వరకు రైతుకు అన్ని కష్టాలే వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

### కారు అతివేగానికి బొల్లవరం అడ్డరోడ్డు వద్ద ప్రమాదం



**సత్తెనపల్లిటౌన్, ముప్పాళ్ళ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం ప్రధాన రహదారి పై ఉన్న బొల్లవరం అడ్డరోడ్డు రక్తసిక్తమయ్యింది. అధికారుల నిర్లక్ష్యం, కనీస భద్రతా ప్రమాణాలు లేని రహదారి వెరసి ఇద్దరు యువ విద్యార్థులను బలితీసుకుంది. నరసరావుపేట నుండి వస్తున్న విద్యార్థులను, సత్తెనపల్లి నుండి అతివేగంతో దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. నరసరావుపేటలో తమ పనులు ముగించుకుని బైక్‌పై సత్తెనపల్లి వైపు వస్తున్న వేజెండ్ల ఇమేష్ (24), గంప ఆంజనేయ రాజు (26) అనే విద్యార్థులను సత్తెనపల్లి నుండి ముప్పాళ్ళ వైపు అతివేగంతో దూసుకొచ్చిన కారు బొల్లవరం అడ్డరోడ్డు, నార్నెపాడు కాలువ మధ్య బలంగా ఢీకొట్టింది. కారు వేగానికి బైక్ నుజ్జునుజ్జు అయ్యింది. యువకులు తీవ్ర రక్తస్రావంతో స్పాట్‌లోనే ప్రాణాలు విడిచారు. ఈ ప్రమాదానికి అతివేగం ఒక కారణమైతే, అధికారుల నిర్లక్ష్యం మరో ప్రధాన కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్డరోడ్ల వద్ద కనీసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం దారుణం. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవని చెబుతున్నారు. కళ్లముందే ఎదుగుతున్న పిల్లలు శవాలై పడి ఉండటం చూసి ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు ఇంటి పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి బొల్లవరం అడ్డరోడ్డు వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోతే, మరింత మంది ప్రాణాలను మింగేసే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ముప్పాళ్ళ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.



## ఐటిటిఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో
# భారత్ విజయం

**న్యూఢిల్లీ:** ఐటీటీఎఫ్ ప్రపంచ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు ట్యునీషియాను ఓడించింది. భారత పురుషుల టేబుల్ టెన్నిస్ జట్టు లండన్‌లో జరిగిన ఈ ప్రపంచ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో ట్యునీషియాపై 3-0 తేడాతో విజయం సాధించి తమ ప్రయాణాన్ని ప్రారంభించింది. స్టేజ్ 1బిలోని గ్రూప్ 7 పోరులో గుజరాత్‌కు చెందిన మానవ్ థక్కర్, మనుష్ షా, హర్మీత్ దేశాయ్ ముగ్గురూ తమ తమ సింగిల్స్ మ్యాచ్‌లలో విజయం సాధించారు. ఈ పోటీలో ఒక గేమ్ కోల్పోయిన ఏకైక భారత ఆటగాడు షా. అతను ఎస్సిద్ వసీమ్‌ను 3-1 తేడాతో ఓడించాడు. మరోవైపు, ఠక్కర్, దేశాయ్ తమతమ మ్యాచ్‌లను 3-0 తేడాతో గెలుచుకోవడంతో, ఈ టైలో భారత్ ట్యునీషియాను చిత్తుగా ఓడించడంలో సహాయపడింది. అంతకుముందు, ఉగాండా వాకోవర్ ఇవ్వడంతో భారత మహిళల జట్టు 3-0 తేడాతో విజయం సాధించింది. మణికా బాత్రా, యశస్విని ఘోర్పడే, సుతీర్థ ముఖర్జీ, దియా చితాలే, సింద్రెలా దాస్‌లతో కూడిన భారత జట్టు ఏ మ్యాచ్ ఆడాల్సిన అవసరం రాలేదు. భారత పురుషుల జట్టు తమ రెండవ గ్రూప్ మ్యాచ్‌లో స్లోవేకియాతో తలపడనుండగా, మహిళల జట్టు ఉక్రెయిన్‌తో పోటీపడనుంది.



# మాండ్రిక్ ఓపెన్‌లో సబలెంకాకు పరాభవం
## అత్యంత జూనియర్ హేలీ చేతిలో ఓటమి

**న్యూఢిల్లీ:** మాడ్రిడ్ ఓపెన్ సెమీఫైనల్స్‌లో అమెరికాకు చెందిన హేలీ బాప్టిస్ట్, ప్రపంచ నంబర్ 1 అరీనా సబలెంకాను ఓడించి సంచలనం సృష్టించింది. ఈ మ్యాచ్‌లో 24 ఏళ్ల క్రీడాకారిణి ఒక సెట్ వెనుకబడినప్పటికీ, ఆరు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుంది. చివరకు 2 గంటల 30 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో 2-6, 6-2, 7-6(6) తేడాతో హేలీ విజయం సాధించింది. ఈ గెలుపు ఆమె కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలవడమే కాకుండా, టూర్‌లో సబలెంకా కొనసాగిస్తున్న 15మ్యాచ్‌ల విజయ పరంపరకు కూడా ముగింపు పలికింది. మ్యాచ్ ప్రారంభంలో సబలెంకా పూర్తి నియంత్రణలో కనిపించింది. సర్వ్‌పైనా, బేస్‌లై పైనా తన ఆధిపత్య ప్రదర్శనతో తొలి సెట్‌ను సునాయాసంగా కైవసం చేసుకుంది. టాప్ సీడ్ అయిన ఆమె హేలీ ఆటను శాసించి ఆ సెట్‌ను సునాయాసంగా గెలుచుకుంది. అయితే, రెండవ సెట్‌లో హేలీ తన ఆటతీరును పెంచి, దూకుడుగా షాట్లు కొడుతూ సబలెంకాను ఇబ్బంది పెట్టడంతో ఆట గమనం మారింది. బెలారసియన్ క్రీడాకారిణి చేసిన వరుస తప్పిదాలు హేలీకు పట్టు సాధించే అవకాశం కల్పించాయి. ఆమె ఆరంభంలోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని మ్యాచ్‌ను సమం చేసింది. ఇక నిర్ణయాత్మక సెట్ ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగింది. సబలెంకా మొదటి బ్రేక్ సాధించి, ఆ తర్వాత మ్యాచ్ కోసం సర్వ్ చేస్తున్నప్పుడు పలు మ్యాచ్ పాయింట్లు సంపాదించి, విజయానికి ఒక గేమ్ దూరంలో నిలిచింది. అయితే ఒత్తిడిలో హేలీ అద్భుతమైన సంయమనం ప్రదర్శించి సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకువెళ్లింది. టైబ్రేక్‌లో, సబలెంకా మళ్ళీ మ్యాచ్ పాయింట్‌ను సాధించినప్పటికీ, హేలీ పట్టుదలతో వరుసగా 3 పాయింట్లు గెలుచుకుని విజయాన్ని ఖాయం చేసుకుంది.

## ఐపిఎల్ ప్లేఆఫ్స్ రేసు నుంచి
# 5 జట్లు అవుట్!

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ సగం ముగిసేసరికి సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఐపీఎల్ 2026 రసవత్తరంగా సాగుతున్న తరుణంలో, దిగ్గజ జట్లు సైతం నిలకడ లేని ప్రదర్శనతో వెనుకబడుతున్నాయి. కొన్ని జట్లు అగ్రస్థానంలో దూసుకుపోతుండగా, మరికొన్ని జట్లు టోర్నీ నుండి నిష్క్రమించే స్థితికి చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఐదు జట్లు ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపు కోల్పోయే ప్రమాదంలో ఉండటం అభిమానులను కలవరపెడుతోంది.

ఛాంపియన్లకే చాంపియన్ గా నిలిచిన ముంబై ఇండియన్స్ గత రెండు సీజన్ల నుండి పేలవ ప్రదర్శనతో వెనుకబడిపోయింది. అలాగే ప్రస్తుత సీజన్ కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ఏమాత్రం కలిసి రావడం లేదు. కోల్‌కతా ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో వెనుకబడింది. మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తేనే ఆ జట్టుకు అవకాశాలు ఉంటాయి. అయితే, ఫామ్‌లో ఉన్న హైదరాబాద్, బెంగళూరు జట్లతో తదుపరి మ్యాచ్‌లు ఉండటం కోల్‌కతాకు పెద్ద సవాల్‌గా మారింది. లక్నో పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు. రిషబ్ పంత్ నాయకత్వంలోని ఈ జట్టు అంచనాలను అందుకోలేకపోయింది. ఒక్క ఓటమి ఎదురైనా లక్నో టోర్నీ నుంచి అధికారికంగా తప్పుకోవాల్సి ఉంటుంది. ఐదుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఏడు మ్యాచ్‌ల్లో కేవలం రెండు విజయాలతో తొమ్మిదో స్థానంలో ఉన్న ముంబై, ప్లేఆఫ్స్ చేరాలంటే మిగిలిన ఏడు (29వ తేదీ మ్యాచ్‌తో సహా) మ్యాచ్‌ల్లో కనీసం ఆరింటిలో గెలవాలి. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 103 పరుగుల తేడాతో ఓటమి చెందడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. మరోవైపు, ఢిల్లీ క్యాపిటల్స్ ప్రదర్శన అత్యంత విచిత్రంగా ఉంది. ఒక మ్యాచ్‌లో 264 పరుగులు చేసిన అదే జట్టు, తర్వాతి మ్యాచ్‌లో 75 పరుగులకే కుప్పకూలడం ఆశ్చర్యకరం. ఎనిమిది మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఉన్న ఢిల్లీ, ఇకపై ప్రతి మ్యాచ్‌ను నాకౌట్‌లా భావించాల్సి ఉంటుంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఈ సీజన్ అగ్నిపరీక్షగా మారింది. యువ ఆటగాడు ఆయుష్ మాత్రే అందుబాటులో లేకపోవడం జట్టు సమతుల్యతను దెబ్బతీసింది.

ఎనిమిది మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆరో స్థానంలో ఉన్న చెన్నై, తదుపరి మ్యాచ్‌ల్లో ముంబై, హైదరాబాద్ వంటి బలమైన జట్లను ఎదుర్కోవాలి. సంజు శాంసన్ వ్యక్తిగత ప్రదర్శనపైనే జట్టు ఆధారపడుతుండటం ఆందోళన కలిగించే అంశం. వరుస విజయాలు సాధించకుంటే ఛాంపియన్ జట్టు లీగ్ దశలోనే ఇంటికి వెళ్లక తప్పదు. ఇలా కేవలం అద్భుతాలు జరిగితే తప్ప ఈ ఐదు జట్లు ప్లేఆఫ్స్ చేరడం అసాధ్యమని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఇక జరిగే మ్యాచ్‌లు ప్రతి జట్టు భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.







ఆట



## సింబైన్ క్లాసిక్ లాంగ్ జంప్‌లో..
# శ్రీశంకర్‌కు టైటిల్

**న్యూఢిల్లీ:** సింబైన్ క్లాసిక్ 2026లో భారత్‌కు చెందిన మురళీ శ్రీశంకర్ పురుషుల లాంగ్ జంప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ సిల్వర్ లెవెల్ మీట్‌లో, శ్రీశంకర్ 8.12 మీటర్ల అత్యుత్తమ లీప్ నమోదు చేసి, దక్షిణాఫ్రికాకు చెందిన దివాన్ మాన్యుయెల్ (8.07 మీ)ను అధిగమించి పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. శ్రీశంకర్ విజయం సాధించిన జంప్, 1.0 మీ/సె గాలి వేగంతో నమోదైంది. అంటే, అతను ఎదురుగాలిలో దూకాడు. ఈ సీజన్‌లో శ్రీశంకర్‌కు ఇది రెండవ పోటీ. ఈ నెల ప్రారంభంలో బెంగళూరులోని శ్రీ కంఠీరవ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ సిరీస్ 1లో 8.15 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో అతను ఈ ఏడాదిని ప్రారంభించాడు. రెండు సంవత్సరాల క్రితం 2024 పారిస్ ఒలింపిక్స్‌కు కొద్ది రోజుల ముందు శ్రీశంకర్ తీవ్ర గాయానికి గురవ్వడంతో, అతను ఆ ప్రపంచ పోటీకి దూరమవ్వాల్సి వచ్చింది. అతను గత సంవత్సరం టోక్యోలో జరిగే 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడానికి సమయానికి కోలుకున్నాడు, కానీ క్వాలిఫికేషన్ రౌండ్‌ను దాటడంలో విఫలమయ్యాడు. ఈ ఏడాది చివర్లో జరగనున్న 2026 ఆసియా క్రీడలు, 2026 కామన్వెల్త్ క్రీడల నేపథ్యంలో, శ్రీశంకర్ వరుసగా ఐచినగోయా, గ్లాస్గోలలో అత్యుత్తమ ప్రదర్శన చేయాలని పట్టుదలతో ఉన్నాడు.

## ఆసియా బీచ్ గేమ్స్‌లో..
# ప్రియా, పుష్పకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా బీచ్ గేమ్స్ 2026, రెజ్లింగ్‌లో ప్రియా మాలిక్, పుష్పా యాదవ్‌లు స్వర్ణం గెలుచుకున్నారు. దీంతో 2026 ఆసియా బీచ్ ఛాంపియన్‌షిప్‌లో 3 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యంతో సహా 6 పతకాలతో భారత్ ముగించింది. చైనాలోని సాన్యాలో బుధవారం జరిగిన చివరి రోజు బీచ్ రెజ్లింగ్ పోటీలో భారత రెజ్లర్లు నాలుగు పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రియా మాలిక్ (70+ కేజీలు), పుష్పా యాదవ్ (60 కేజీలు) స్వర్ణ పతకాలను కైవసం చేసుకోగా, సిద్ధార్థ్ (70 కేజీలు), జస్‌ప్రీత్ కౌర్ (70 కేజీలు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. మరోవైపు, లైట్‌వెయిట్ 50 కేజీల కాంస్య పతక పోరులో ప్రియాన్షి ప్రజాపత్ గాయపడటంతో జపాన్‌కు చెందిన ఫునా యానో చేతిలో ఓటమిని అంగీకరించింది. మాజీ ఆసియా ఛాంపియన్‌షిప్ పతక విజేత ప్రియా మాలిక్ మంగోలియాకు చెందిన జోరిగ్ట్‌ను ఓడించగా, పుష్పా యాదవ తమతమ ఫైనల్స్‌లో చైనాకు చెందిన ప్రస్తుత ఆసియా ఫ్రీస్టైల్ ఛాంపియన్ షీ మెంగూపై విజయం సాధించారు. ఇద్దరు రెజ్లర్లు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించి, గ్రూప్, ఆ తర్వాత నాకౌట్ దశ అంతటా అజేయంగా నిలిచి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. ఇక సెమీఫైనల్స్‌లో వియత్నాంకు చెందిన డాంగ్ థి నిన్ చేతిలో ఓడిపోయిన జప్రీత్ కౌర్ (70 కేజీలు), కాంస్య పతక పోరులో కజఖ్ రెజ్లర్‌ను 2-0 తేడాతో ఓడించి బలంగా పుంజుకుంది. అంతకు ముందు మిగిలిన ముగ్గురు భారత రెజ్లర్లు, సచిన్ మోర్ (80 కేజీ), ఆర్యన్ (90 కేజీ), జస్పూరన్ సింగ్ (90+ కేజీలు) క్వార్టర్ ఫైనల్స్‌లో నిష్క్రమించారు.



# బ్లూచిప్ కంపెనీల షేర్ల ర్యాలీ




## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 29:** అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అనిశ్చితుల మధ్యకూడా దేశీయస్టాక్ మార్కెట్ల సూచీలులాభాల్లోనే ముగిసాయి. ఆసియా మార్కెట్ల నుండి అందిన సానుకూల సంకేతాలు, బ్లూచిప్ కంపెనీల ఆకర్షణీయమైన త్రైమాసిక ఫలితాలు వెరసి దలాల్ స్ట్రీట్‌లో బుల్ రన్‌కు దారితీశాయి. ప్రధానంగా ఐటీ రంగం, రిలయన్స్ బ్లూచిప్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్ల మద్దతు మార్కెట్‌ను లాభాల బాటలో నడిపించాయి. సెన్సెక్స్ సుమారు 609 పాయింట్లు పెరిగి 77,496 వద్ద ముగియగా, నిఫ్టీ 181 పాయింట్లు లాభపడి 24,177 స్థాయిని అందుకుంది. చివరి గంటలో ఇన్వెస్టర్లు కొంత లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వల్ల గరిష్ట స్థాయిల నుండి స్వల్పంగా వెనక్కి తగ్గింది. మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేసిన కీలక అంశాలను పరిశీలిస్తే రంగాల వారీగా ఎఫ్ఎంసీజీ, రియల్టీ రంగాలు మంచి పనితీరును కనబరిచాయి. ముఖ్యంగా ఐటీసీ షేరు దాదాపు 3.79 శాతం పెరిగి సెన్సెక్స్‌లో టాప్ గెయినర్‌గా నిలిచింది. టెక్ మహీంద్రా, మారుతి, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు కూడా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించాయి. మరోవైపు, విస్తృత మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించింది; స్మాల్‌క్యాప్ సూచీ లాభపడగా, మిడ్‌క్యాప్ స్వల్ప నష్టాలను చవిచూసింది. ఇండెక్స్ హెవీవెయిట్ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోళ్లు మార్కెట్ స్థిరత్వానికి సూచీగా నిలిచాయి. అంతర్జాతీయ పరిణామాలు ఈ ట్రేడింగ్ సెషన్‌లో కీలక పాత్ర పోషించాయి. ఒకవైపు ఒపెక్ కూటమి నుండి యూఏఈ వైదొలుగుతున్నట్లు ప్రకటించడం చమురు మార్కెట్లలో కలకలం రేపింది. మే 1 నుండి అమలులోకి రానున్న ఈ నిర్ణయం ప్రపంచ చమురు సరఫరా సమీకరణాలను మార్చే అవకాశం ఉంది. అమెరికాఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన కారణంగా హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుండటంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 111 డాలర్ల మార్కును దాటింది. పెరిగిన చమురు ధరలు ద్రవ్యోల్బణ భయాలను పెంచుతున్నప్పటికీ, భారత మార్కెట్లు ప్రస్తుతానికి కంపెనీల ఆదాయ వృద్ధిపైనే ఎక్కువ నమ్మకాన్ని ఉంచాయి. బిఎస్ఇలోమొత్తం 2120 షేర్లు లాభపడగా 2112 షేర్లు క్షీణించాయి. 177 షేర్లుమాత్రం స్థిరంగానే కొనసాగాయి.ఇక డాలరుతోరూపాయి మారకం విలువలు 94.85కి చేరింది. ముందురోజు 904.68గాట్రేడ్ అయితే బుధవారం మరింతగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ 0.62శాతం క్షీణించి రూ.1,49,099గా కొనసాగింది. బ్రెంట్‌ముడి చమురు కూడా జూన్ సెటిల్‌మెంట్ల ధరలు 3.55 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 114.81 డాలర్లుగా కొనసాగిం ది. అమెరికా మార్కెట్ల విషయానికొస్తే వాల్ స్ట్రీట్‌లో ఏఐ కంపెనీల ఆదాయ వృద్ధిపై ఆందోళనలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఓపెన్‌ఏఐ ఫలితాల ప్రభావంతో మంగళవారం నాస్‌డాక్ నష్టపోయింది. బుధవారంఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో కొంత కోలుకోవడం భారత మార్కెట్లకు ఊరటనిచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లందరూ అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకోబోయే నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ముడి చమురు ధరల హెచ్చుతగ్గుల మధ్య, మార్కెట్ మరికొంత కాలం అస్థిరంగానే ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.




# మేనెలలో 12 రోజులు బ్యాంకులకు సెలవు

**ముంబయి, ఏప్రిల్ 29:** మే నెలకు సంబంధించి రిజర్వుబ్యాంకు దేశంలో మొత్తం బ్యాంకుల సెలవుల కేలండర్‌నుప్రకటించింది. దేశవ్యాప్తంగా చూస్తే మొత్తంగా శని, ఆదివారాలతో కలిపి 12 రోజులు బ్యాంకులకు సెలవు ఉంది. తెలుగు రాష్ట్రాల్లో మహారాష్ట్ర దినోత్సవం, బక్రీద్ సందర్భంగా బ్యాంకులకు హాలిడే ఉంది. ఇతర రాష్ట్రాల్లో వీటితో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వంటి ఇతర సెలవులు ఉన్నాయి. మే 1 మహారాష్ట్ర దినోత్సవం,బుద్ధపూర్ణిమ, అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం నేపథ్యంల. రెండు తెలుగు రాష్ట్రాలు సహా చెన్నై, భోపాల్, ముంబై, ఢిల్లీ, శ్రీనగర్, పట్నా ఇలా పలు ప్రధాన ప్రాంతాల్లో బ్యాంక్ హాలిడే ఉంది. ఈరోజున గుజరాత్, ఒడిశా, చండీగఢ్, సిక్కిం, రాజస్థాన్, నాగాలాండ్, మేఘాలయ వంటి చోట్లలో బ్యాంకులు తెరిచే ఉంటాయి. మే 9 ఈ రోజున రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి. అదే రోజున రెండో శనివారం కాబట్టి వెస్ట్ బెంగాల్ సహా అన్ని ప్రాంతాల్లో బ్యాంక్ హాలిడే ఉంది. మే 16 సిక్కిం రాష్ట్ర దినోత్సవం సందర్భంగా ఆ రోజున సిక్కింలో బ్యాంకుకు హాలిడే ఉంది. మిగతా ప్రాంతాల్లో యథావిధిగా పనిచేస్తాయి. మే 26 కాజీ నజ్రుల్ ఇస్లామ్ బర్త్‌డే నేపథ్యంలో త్రిపురలో బ్యాంక్ సెలవుఉంది. మే 27 బక్రీద్ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు సహా మధ్యప్రదేశ్, చండీగఢ్, ఉత్తరాఖండ్, అసోం, జమ్ముకశ్మీర్, కేరళ, నాగాలాండ్, వెస్ట్ బెంగాల్, ఉత్తర్ ప్రదేశ్, న్యూఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ ఇలా పలు ప్రాంతాల్లో సెలవు ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, సిక్కిం,రాజస్థాన్, గోవా బిహార్‌లో యథావిధిగా పనిచేయనున్నాయి. మే 28 మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు,రాజస్థాన్, శ్రీనగర్, గోవా, బిహార్ రాష్ట్రాల్లో బక్రీద్ గురువారం నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడమే 28న సెలవుఉంది. మిగతా వీకెండ్స్ విషయానికి వస్తే నాలుగో మే 23, ఆదివారాలు మే 3, 10, 17, 24, 31 బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఇలా మొత్తంగా 12 సెలవులు వస్తున్నాయి. కస్టమర్లు ఆన్‌లైన్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ సేవలు పొందొచ్చు. ఈ కార్యకలాపాలు అన్నీ అందుబాటులోనే ఉంటాయి. ఇంకా ఏటీఎంలు, డిపాజిట్ మెషీన్లు తెరిచే ఉంటాయి.

# 6%కి దిగివస్తున్న భారత్ జిడిపి వృద్ధి




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 29:** భారత్ జిడిపి వృద్ధి ఆరుశాతానికి దిగివస్తుందని, రిటైల్‌ద్రవ్యోల్బణం కొంతమేర పెరగడవచ్చని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరుశాతానికి ఆటూ ఇటూగా ఉంటుందనిఆర్బీఐ ఇప్పటికే అంచనా వేసింది. ఈ ప్రభావం ఆర్థికవృద్ధిపై ఉంటుందని ఎర్నెస్ట్‌యంగ్ ఇండియా ప్రకటించింది. ముడిచమురు కూడా రానున్న రోజుల్లో బ్యారెల్‌కు 120 డాలర్లకు పెరగవచ్చని ఈవై ఇండియా చీఫ్ పాలసీ సలహాదారు డికె శ్రీవాస్తవ వెల్లడించారు. రెపోరేట్‌ను కొంతమేర ఎగువకు తీసుకెళ్లాలిస ఉంటుందని, సవరణలు అనివార్యం అవుతాయని చెప్పారు. ముడిచమురు సరఫరా కొరత కారణంగా ధరలు మరింతగాపెరుగుతాయని, పశ్చిమాసియా సంక్షోభం మరింతగా కొనసాగే అవకాశం ఉన్నందున ధరలు 120 డాలర్లవరకూ వెళ్లవచ్చని అంచనావేసారు. ఇండియన్ క్రూడ్ బాస్కెట్ ధరల్లో సగటున 2027 ఆర్థికసంవత్సరంలో బ్యారెల్‌కు 120 డాలర్లవరకూ ఉంటుందని తేలింది. ఈపరిణామాలతో భారత్ జిడిపి వృద్ధి ఆరుశాతానికి దిగిపోవచ్చని తేలింది. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణం కూడా ఆరుశాతంగా ఉంటుందని ఆర్థికలోటుపై ప్రతికూల ప్రభావం తగ్గుతుందని కూడా అంచనావేసింది. పెరుగుతున్న ఇంధన ధరలు రిటైలర్లపైకే వెళతాయని ఎర్నెస్ట్ యంగ్ ప్రకటించింది. అమెరికా ఇంధన సమాచార పాలనావిభాగం ఇఐఎ స్వల్పకాలిక ఇంధన సమీక్షలోబ్రెంట్‌ముడిచమురుధరలు సగటున బ్యారెల్‌కు 81 డాలర్లుగా తొలిత్రైమాసికంలో ఉంటే రెండోత్రైమాసికంలో బ్యారెల్‌కు 115 డాలర్లవరకూ ఉంటాయని తేలింది. ఐఎంఎఫ్ భారత ఆర్థికవృద్ధిని 6.5శాతంగా అంచనావేస్తే ఆసియా అభివృద్ధిబ్యాంకు 6.9శాతం, ప్రపంచ బ్యాంకు 6.6శాతంగా జిడిపి వృద్ధిని అంచనావేసాయి.అయితే భారత రిజర్వుబ్యాంకు మాత్రం జిడిపి వృదిధ 6.9శాతంగాఉంటుందని ద్రవ్యోల్బణం 4.6శాతంగా ఉంటూ రెండుశాతం అటూఇటూగా పెరగవచ్చని అంచనావేసింది. పశ్చిమాసియా సంక్షోభం అంచనాలకు మించి పెరుగుతోందని యుద్ధం ముగిసినా గ్లోబల్ ముడిచమురుసరఫరాకు మరికొంత సమయం దుతుందని అంచనావేసారు. 2027ఆర్థికసంవత్సరంలో ప్రపంచ వృద్ధికంటే మెరుగ్గానే ఉంటుందని భౌగోళిక ఉద్రిక్తతలున్నప్పటికీ సవాళ్లను భారత్ అధిగమించే సామర్థ్యంతో ఉందని రేటింగ్ సంస్థలు అంచనావేస్తున్నాయి.

# వచ్చేనెలనుంచి సిగరెట్ ధరల్లో పెంపు



**ముంబయి, ఏప్రిల్ 29:** మే 1 నుంచి సిగరెట్ల ధరలు ఏకంగా 17 శాతం పెరగవచ్చన్న అంచనాలతో కంపెనీల స్టాక్స్ మార్కెట్‌లో విపరీతంగా పెరిగాయి. ఐటీసీ షేర్లు 4 శాతం లాభపడగా, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేర్లు ఏకంగా 6.5 శాతం పుంజుకున్నాయి. సిగరెట్ల ధరల పెంపు వల్ల కంపెనీల లాభాలు పెరుగుతాయన్న అంచనాతో ఇన్వెస్టర్లు ఈ షేర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఫలితంగా నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీ కూడా 2 శాతం మేర ఎగబాకింది. ఈ ధరల పెంపు కేవలం ప్రీమియం ఉత్పత్తులకే పరిమితం కాకుండా, సామాన్యులు వాడే తక్కువ ధర కలిగిన వాల్యూఎండ్ బ్రాండ్‌లకు కూడా వర్తించనుంది. ప్రస్తుతం రూ.115 ఉన్న ఐటీసీ గోల్డ్‌ఫ్లేక్ ప్రీమియం ప్యాక్ ధర మే నెల నుంచి రూ.135 కి చేరే అవకాశం ఉంది. అంటే సగటున ప్రతి సిగరెట్‌పై రూ.2 నుంచి రూ.3 వరకు భారం పెరగనుంది. కింగ్ సైజ్ సిగరెట్లపై ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించనుంది. ఈ ఏడాది ఆరంభంలో పార్లమెంట్ ఆమోదించిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025 ఈ పెంపునకు ప్రధాన కారణం. పొగాకు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం భారీగా ఎక్సైజ్ సుంకాలను పెంచింది. ప్రతి 1,000 సిగరెట్లపై వాటి పొడవును బట్టి రూ.2,050 నుంచి రూ.8,500 వరకు ఎక్సైజ్ డ్యూటీ విధిస్తున్నారు. ఈ ఎక్సైజ్ డ్యూటీకి అదనంగా మరో 40 శాతం జీఎస్టీ కూడా అమల్లో ఉంటుంది. ఫిబ్రవరి 1 నుంచే ఈ సుంకాలు అమల్లోకి వచ్చినప్పటికీ, కంపెనీలు ఇప్పుడు ఆ భారాన్ని వినియోగదారులపైకి మళ్లించడానికి సిద్ధమయ్యాయి. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ప్రకారం 75 మి.మీ కంటే ఎక్కువ పొడవు ఉన్న సిగరెట్లు ఐటీసీ మొత్తం అమ్మకాల్లో 16 శాతం వాటాను కలిగి ఉన్నాయి. సుంకల పెంపు వల్ల ఈ విభాగంలో ఖర్చు 2228 శాతం పెరిగింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ మాట్లాడుతూ ధరలు పెరిగినప్పుడు ప్రారంభంలో అమ్మకాలు కొద్దిగా తగ్గినట్లు అనిపించినా, సిగరెట్ కంపెనీలకు ఉన్న ధరల నిర్ణయ సామర్థ్యం వల్ల అవి తిరిగి లాభాలను సంపాదిస్తాయని పేర్కొన్నారు. పన్నులు ఎంత పెరిగినా కంపెనీల లాభదాయకతకు డోకా లేదని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు.

# ఐడిబిఐలో వాటా విక్రయానికి ఎల్‌ఐసి, కేంద్రం రెడీ..

**ముంబయి, ఏప్రిల్ 29:** ఐడీబీఐ బ్యాంకులో వాటా విక్రయం కోసం కేంద్రం ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం, ఎల్‌ఐసీకి కలిపి మొత్తం 90 శాతం వరకు వాటా ఉంది. దీంట్లో భాగంగా ఎల్‌ఐసీ 30.24 శాతం, ప్రభుత్వం 30.38 శాతం చొప్పున మొత్తం 60 శాతానికిపైగా వాటాను విక్రయిం చనున్నాయి. ఈ ప్రక్రియ ఆగిపోయినట్లు వార్తలు వచ్చాయి. ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వ్ ధరల కంటే చాలా తక్కువ ధరకు బిడ్డర్లు కోట్స్ చేయడంతో వాయిదా వేసింది. బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రక్రియలో ఈ ఐడీబీఐ బ్యాంక్ విక్రయ ప్రక్రియ కీలకంగా ఉంది.బిడ్స్ అంచనాల కంటే తక్కువగా ఉండటం ఇంకా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల తరుణంలో విక్రయ ప్రక్రియ ఆలస్యమైంది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి టీవీ. సోమనాథన్ ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల కమిటీ తాజాగా సమావేశమైంది. ఐడీబీఐ బ్యాంక్ వాటా విక్రయంపై సరికొత్త వ్యూహాన్ని సమీక్షించింది. ఇప్పుడు మార్కెట్ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విలువను నిర్ణయించడంతో పాటుగా టైమ్‌లైన్‌ను మళ్లీ సెట్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా మళ్లీ విలువను నిర్ణయించే ప్రక్రియ ప్రారంభించింది. ఇది ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు తగ్గట్లుగా రియలిస్టిక్‌గా ఉండేలా చూస్తోంది.

# బజాజ్‌ఫైనాన్స్ నికరలాభం రూ.4839.50 కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 29:** ప్రైవేటునాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్‌సంస్థ బజాజ్‌ఫైనాన్స్ బుధవారం నికరలాభాలనుప్రకటించింది.నాలుగోత్రైమాసికంలో 23శాతం లాభం పెరిగి 4839.50 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. గత ఏడాది ఇదేకాలంలో 3940.44కోట్లనుంచి ఈ ఏడాది 23శాతంపెంచుకోగలిగింది.మొత్తం రాబడులు ఈ త్రైమాసికంలో రు.18,430.64 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది 15,469.91 కోట్లనుంచి భారీ వృద్ధిని నమోదుచేసింది. పన్నులచెల్లింపులకు ముందు లాభాలురూ.6484.34కోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయాలు కూడా రూ.11,946.30 కోట్లుగా ఉన్నట్లు తేలింది.పూర్తి ఆర్థిక సంవత్సరానికిగాను బజాజ్‌ఫైనాన్స్‌నికరలాభం గత ఏడాది రూ.16,661.50 కోట్లనుంచి రూ.17,803.87కోట్లకు పెరిగింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14